Pubilshed from kakinada
PRGI NO : APTEL/25/A1470

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com

కాకినాడ KAKINADA | సంపుటి : 03 | సంచిక : 13 | శనివారం | అక్టోబర్ 31, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ
Vol.No : 03 | Issue No : 13 | SATURDAY | 31 OCTOBER 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-
Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

పులివెందులలో అరాచకాలకు వెన్నుపోటు పార్టీ భారీ స్కెచ్

ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి డిమాండ్

5 లో..

ప్రభుత్వం చేతిలో ఎస్ఈసీ కీలుబొమ్మ

- టీడీపీ బ్రాంచ్ ఆఫీస్‌గా మారిన ఎస్ఈసీ కార్యాలయం
- వైయస్ఆర్‌సీపీ సమర్పించిన వందలాది ఫిర్యాదులపై చర్యలు శూన్యం
- రాష్ట్ర ఎన్నికల కమిషన్ తీరుపై వైయస్ఆర్‌సీపీ నేతల ధ్వజం

2 లో..

వెన్నుపోటు పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారు

- తుపాన్ బాధిత రైతులను ఆదుకోకుండా చంద్రబాబు రాజకీయాలు
- శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ

ప్రజాభూమి ప్రతినిధి - విజయనగరం

తుఫాన్‌లో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విజయనగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. తుఫాన్‌లో సర్వస్వం కోల్పోయిన రైతన్నలకు తక్షణమే నష్టపరిహారాన్ని ప్రకటించాలని, నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తెచ్చి ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. తుపానుతో రైతులు, సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోయి ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకి

- తరువాయి 2లో..

కష్టం తెలుసు.. ఆదుకుంటాం!

సాధారణ స్థితికి తెచ్చేందుకే నిరంతరం శ్రమిస్తున్నాం

పంటల బీమాతోనే ప్రతి రైతుకు ధీమా

డెల్టా కాలువల ఆధునీకరణతో ముంపు తొలగిస్తాం

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం చంద్రబాబు

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు రెండో రోజు పర్యటన

షెల్టర్లలోని బాధితులకు బియ్యం, సరుకులు పంపిణీ చేసిన సీఎం

ప్రజాభూమి ప్రతినిధి, నరసాపురం

అర్నబ్ తుఫాను కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులు, నష్టాలకు గురైన కొబ్బరి రైతులు, మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. తుఫాను కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనలో భాగంగా రెండో రోజు పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మండలాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు. క్షేత్రస్థాయిలో నష్టాన్ని పరిశీలించి, రైతులు, మత్స్యకారులు, స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నరసాపురం మండలం కొత్త నవరసపురంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన ముఖ్యమంత్రి రైతులతో మాట్లాడారు. పంట నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేసి ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. రైతులు పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. ఇ-పంట విధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

- తరువాయి 2లో..

ఓటరు మహాశయులు ఎవరిని గెలిపిస్తారో..?



ప్రజాభూమి, కృష్ణా జిల్లా బ్యూరో : నవంబరు ఒకటవ తేదీన మచిలీపట్నం నగర పాలక సంస్థకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల ప్రచారం కూడా ముగిసింది. భారీ వర్షాలవల్ల ప్రచారానికి అంతరాయం ఏర్పడినా గురువారం, శుక్రవారం సాయంత్రం వరకూ పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ ముమ్మరంగా ప్రచారం చేశారు. మేయర్ అభ్యర్థులయిన అబ్దుల్ అబీదా (కూటమి అభ్యర్థిని), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థిని లంకా జ్యోతిలు ఎవరికివారు తాము గెలుస్తామంటే తాము గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.
అభ్యర్థిని లిద్దరూ ఎవరికివారు తాము గెలిస్తే మచిలీపట్నంను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని, ప్రజలకు అన్ని సౌకర్యాలు అందిస్తామని ఎవరికి వారు వాగ్దానాలు చేశారు. అరవై డివిజన్లకు కూటమి అభ్యర్థులుగా తెలుగుదేశం, జనసేన, బీజేపీకి చెందినవారు పోటీ చేస్తున్నారు. తెలుగుదేశంకు చెందిన కార్పొరేటర్ అభ్యర్థులుగా 40 మంది, జనసేనకు చెందిన కార్పొరేటర్ అభ్యర్థులుగా 18 మంది, బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థులుగా ఇద్దరు పోటీ చేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా 60 డివిజన్లకు 60 మంది పోటీ చేస్తున్నారు.

- తరువాయి 2లో..

రాష్ట్రంలో 16 మాదకద్రవ్యాల వ్యసన విముక్తి కేంద్రాల ఆధునికీకరణ

- రూ.9.86 కోట్ల విడుదల

2 లో

శాశ్వత పరిష్కారాలు అన్వేషించాలి

- వేట పడవలకు బీమా సౌకర్యం కల్పించే అంశంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- దీపావళి తర్వాత మత్స్యకార గ్రామాల్లో క్షేత్ర స్థాయి పర్యటన
- ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ పనులు వేగవంతం చేయాలి
- మత్స్యకారుల సమస్యలపై స్వయంగా అధ్యయనం చేస్తా
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి

తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా అధికారులను ఆదేశించారు. తుపానులు వచ్చిన ప్రతిసారీ తాత్కాలిక చర్యలు చేపట్టడం కాకుండా, తీర ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వేట పడవలకు బీమా సౌకర్యం కల్పించే అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి, తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని దిశా

- తరువాయి 2లో..

సంపాదకీయం

విద్యతోనే వికసించే భవిష్యత్తు!

విద్య అనేది కేవలం అక్షరజ్ఞానాన్ని అందించే సాధనం మాత్రమే కాదు. మనిషి ఆలోచనా విధానాన్ని మార్చి, జీవితానికి సరైన దిశానిర్దేశం చేసే శక్తివంతమైన ఆయుధం. ఒక వ్యక్తి అభివృద్ధి చెందాలన్నా, ఒక కుటుంబం ఆర్థికంగా ఎదగాలన్నా, ఒక సమాజం పురోగతి సాధించాలన్నా విద్య ఎంతో కీలకం. అందుకే విద్యను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలి. ప్రస్తుత కాలంలో విద్యారంగం వేగంగా మారుతోంది. ఒకప్పుడు పుస్తకాలు, తరగతి గదులు, ఉపాధ్యాయుల బోధనకే పరిమితమైన విద్య ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త రూపాన్ని సంతరించుకుంది. డిజిటల్ తరగతులు, ఆన్‌లైన్ అభ్యాసం, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతికతలు విద్యార్థులకు అనేక కొత్త అవకాశాలను అందిస్తున్నాయి. అయితే సాంకేతికత ఎంత పెరిగినా ఉపాధ్యాయుల పాత్రను, పుస్తక పఠనాన్ని, స్వయంగా ఆలోచించే సామర్థ్యాన్ని విస్మరించకూడదు. నేటి విద్యావ్యవస్థలో మార్కులకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం ఆందోళనకరమైన విషయం. పరీక్షల్లో అధిక మార్కులు సాధించడం ఒక్కటే విద్యార్థి ప్రతిభకు కొలమానం కాకూడదు. విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్యలను పరిష్కరించే నైపుణ్యం, క్రమశిక్షణ, సమయపాలన, సామాజిక బాధ్యత వంటి లక్షణాలను పెంపొందించాలి. చదువుతో పాటు జీవితాన్ని ఎలా ఎదుర్కోవాలో నేర్పినప్పుడే విద్యకు నిజమైన అర్థం చేకూరుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు కూడా పట్టణ విద్యార్థులతో సమానమైన అవకాశాలు కల్పించాలి. ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాలు, తగినంత మంది ఉపాధ్యాయులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు అందుబాటులో ఉండాలి. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువును కేవలం మార్కులతో ముడిపెట్టకూడదు.

ఇతర పిల్లలతో పోల్చకుండా వారి ఆసక్తులు, సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి. పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంచాలి. తప్పులు చేసినప్పుడు మందలించడం కంటే వాటి నుంచి నేర్చుకునే అవకాశాన్ని కల్పించాలి. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో కుటుంబ వాతావరణం ఎంతో ముఖ్యమైనది. అదేవిధంగా యువతకు ఉపాధి కల్పించే విధంగా విద్యా విధానంలో నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి. డిగ్రీలు సంపాదించడమే కాకుండా పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యాలను పెంపొందించాలి. అప్పుడే విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడమే కాకుండా స్వయం ఉపాధి దిశగా కూడా ముందుకు సాగగలరు. విద్య అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, సమాజం అందరూ భాగస్వాములైనప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందినప్పుడే సమాన అవకాశాలతో కూడిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. చివరగా ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. సంపదను కోల్పోతే తిరిగి సంపాదించవచ్చు. కానీ విద్య ద్వారా పొందిన జ్ఞానం జీవితాంతం మనిషికి తోడుగా ఉంటుంది. నేటి విద్యార్థులే రేపటి పౌరులు. వారికి నాణ్యమైన విద్య, మంచి విలువలు, సరైన మార్గదర్శకత్వం అందించడం ద్వారా మాత్రమే సమర్థవంతమైన, అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించగలం. విద్యపై పెట్టే పెట్టుబడి ఎప్పటికీ వృథా కాదు.. అదే దేశ భవిష్యత్తుకు అసలైన పునాది!

ప్రభుత్వం చేతిలో ఎస్ఈసీ కీలుబొమ్మ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ

రాష్ట్రంలో వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వ కనుసన్నల్లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) పని చేస్తోందని, టీడీపీ కార్యాలయానికి అనుబంధ విభాగంలా కమిషన్ ?యవహరిస్తోందని వైయస్ఆర్‌సీపీ నేతలు మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవస్థలు పని చేస్తున్నాయని, ఎన్నికల నిబంధనల అమలులో పక్షపాత ధోరణి కనిపిస్తోందని వారు స్పష్టం చేశారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన ఎన్నికల కమిషన్ తన బాధ్యతను విస్మరిస్తోందని ఆక్షేపించారు. వందలాది ఫిర్యాదులు, ఆధారాలు సమర్పించినా స్పందన లేకపోవడం ఎన్నికల సంఘం పనితీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోందని తెలిపారు.

ఈ అంశాలన్నింటిపై విజయవాడలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన వైయస్ఆర్‌సీపీ నాయకులు, అనంతరం మీడియాతో మాట్లాడుతూ తమ ఆందోళనను వ్యక్తం చేశారు.

మీడియాతో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైయస్ఆర్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు ఏమన్నారంటే..:

ఎన్నికల పోలింగ్‌కు రెండు రోజుల ముందు కూడా వందలాది ఫిర్యాదులు, వీడియోలు, ఆడియో ఆధారాలు సమర్పించినా ఎస్ఈసీ కనీసం విచారణ చేపట్టలేదు. 150 మంది పోలీసు అధికారులపై రెండుసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. పోలీసు, రెవెన్యూ అధికారులు టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తూ నామినేషన్ పత్రాలు, పోలింగ్ ఏజెంట్ ఫారాలు చించేస్తున్నా పట్టించుకోవడం లేదు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి బ్రాంచ్ ఆఫీస్‌గా ఎస్ఈసీ మారిపోయింది. రాష్ట్రంలో 12,224 పోలింగ్ కేంద్రాలకు కేవలం 36,351 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. గత ఎన్నికల్లో 60 వేల నుంచి 70 వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తే, ఇప్పుడు సగానికి తగ్గించడం వెనుక ఉద్దేశం ఏమిటి? బూత్ క్యాప్చరింగ్, దొంగ ఓట్లు, రిగ్గింగ్‌కు అవకాశం కల్పిస్తున్నారా? ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలని న్యాయస్థానాలు చెప్పినా అమలు చేయడం లేదు. 12 వేలకుపైగా బూత్‌లలో 7 వేలకైనా ఈ సదుపాయాలు ఉన్నాయో లేదో స్పష్టత లేదు. సమస్యాత్మక కేంద్రాల జాబితాను కూడా వెల్లడించడం లేదు. కడప, పులివెందుల, కర్నూలులోని కొన్ని వార్డుల్లో ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయడం లేదు. డబ్బులు పంచుతూ, పెన్షన్లు తొలగిస్తామని బెదిరిస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు. మాచర్లలో తల్లి మతదేహాన్ని చూసేందుకు కూడా ఒక వ్యక్తిని అనుమతించని పరిస్థితి ఉంది. నెల్లూరు, గూడూరులో పోలీసు అధికారుల ప్రమేయంతో అభ్యర్థులను ప్రలోభపెట్టడం, బెదిరించడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినా స్పందించని ఎస్ఈసీపై అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు వైయస్ఆర్‌సీపీ పోరాటం కొనసాగుతుంది. ఓటు అనే ఆయుధంతో ప్రజలు తమ తీర్పును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

ఓటరు మహాశయులు ఎవరిని గెలిపిస్తారో..?

మడు పార్టీలు తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కూటమిగా పొత్తు పెట్టుకుని పోటీ చేస్తున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగానే పోటీ చేస్తోంది. మచిలీపట్నం నగర పాలక సంస్థకు ఎన్నికలు ప్రకటించినప్పుడు ముందుగానే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కృష్ణా జిల్లా ఇన్‌చార్జి, మాజీ మంత్రి పేర్ని నాని మేయర్ అభ్యర్థిని, కార్పొరేటర్లు పోటీ చేసే వారి పేర్లను ప్రకటించి ఎన్నికలకు మేము సిద్ధంగా వున్నామన్నట్లు వెల్లడించారు. పేర్ని నాని, పేర్ని కిట్టూ ఇద్దరే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మచిలీపట్నం నగర పాలక సంస్థను భద్రతగా తీసుకుని అహరహం ప్రచారం చేస్తూవస్తున్నారు. వారు అభ్యర్థులతో కలసి ప్రచారం చేస్తూ వ్యక్తిగతంగా అందరినీ కలుసుకుంటూ అభిమానాన్ని చూరగొన్నారు.

ఇక కూటమి అభ్యర్థుల విజయం కోసం మంత్రి కొల్లు రవీంద్ర అలుపెరుగక కూటమిలోని నాయకులనందరినీ కలుసుకుని ప్రచారం చేస్తూ వచ్చారు. కొల్లు రవీంద్రతోపాటు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఆయన తమ్ముడు జగన్నాథరావు (బుల్లయ్య), బండి రామకృష్ణ, పంతం వెంకట గజేంద్రరావులు మిగతా నాయకులతో కలసి ప్రచారం చేస్తూ వచ్చారు.

సాధారణంగా ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో వుంటుందో, ఆ పార్టీయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుంది. అంతమాత్రాన ఇదంతా మా ఘనతేనని నాయకులు గర్వపడవలసినంత విషయం వుండదు! స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాంతీయ తత్వం, కులాలు, అభ్యర్థుల మంచి, చెడూ, బంధుత్వాలు ఇలా పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఓటర్లు ఓటు వేస్తూ వుంటారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుండగా ఏ మాత్రం అభివృద్ధి జరగలేదని, శంకుస్థాపన చేసిన వాటిని కూడా పూర్తిచేయకుండా వదిలేశారన్న విమర్శలు వున్నాయి. నిజమే! కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి రెండు సంవత్సరాలు దాటింది. ప్రకటనలు, మాటలు, శంకుస్థాపనలతోనే సరిపెడుతున్నారని, ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించేవారు కూడా ఉన్నారు.

ఏది ఏమైనా అధికారంలోకి రావడమే ధ్యేయంగా ప్రచారం చేసుకుంటూ ముందుకెళ్ళారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ఎన్నికల ప్రచారం ముగుస్తుంది. ఇప్పుడు పోటీ చేసే అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించడానికి 'ఓటు'కు ఇంత ఇస్తామని ఇంటింటికీ తిరిగి ఆకట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తారన్న విమర్శలు వున్నాయి. పలువురు ఓటర్లు కూడా డబ్బులు తీసుకోవడానికి సిద్ధంగా వున్నారన్న ఆరోపణలు వున్నాయి. పోటీ చేసే రెండు పార్టీలు కూటమి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు ఎంత ఇచ్చినా, ఇరువైపుల నుంచి 'డబ్బులు' తీసుకున్నవారు ఎవరికి ఓటు వేస్తారో, ఎవరిని గెలిపిస్తారో దేవ రహస్యంగానే వుంటుంది! డబ్బులు పంచిన వారు మాత్రం 'మేమే' గెలుస్తామన్న ధీమాతో వుంటారు. ఓటరు మహాశయులు అత్యధికంగా ఎవరి పక్షాన వుంటారో వేచి చూడాలి!

వెన్నుపోటు పార్టీకి

ప్రజలే బుద్ధి చెబుతారు

మాత్రం ఎన్నికల ప్రచారం, ఆర్భాటాలే ముఖ్యమయ్యాయని ఆయన విమర్శించారు. ఈ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని బొత్స సత్యనారాయణ అన్నారు. విశాఖపట్నంలో వైఎస్సార్‌సీపీ మేయర్ అభ్యర్థిని గెలిపిస్తే, నగరంలో జరుగుతున్న దోపిడీ నాటకాన్ని మొదటి తీర్మానంతోనే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. అలాగే విజయనగరం పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు వైఎస్సార్‌సీపీ మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని బొత్స సత్యనారాయణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైంది. తుపాను ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయి, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్పందించకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ప్రజల కష్టాలను పట్టించుకోకుండా చంద్రబాబు ప్రచార ఆర్భాటాలకు, రాజకీయ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నాడు. తుపాను బాధితులను ఆదుకోవాల్సిన సమయంలో ప్రచారం కోసం హడావుడి చేయడం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం. పంట నష్టాలను వెంటనే అంచనా వేసి, నష్టపోయిన ప్రతి రైతుకూ తక్షణ పరిహారం అందించాలి. రాజకీయాలు చేయడం మానుకుని, ముందుగా బాధితులను ఆదుకోవడంపై చంద్రబాబు దృష్టి పెట్టాలి. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని ప్రభుత్వానికి ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారు. విజయనగరం జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. నా 35 ఏళ్ల రాజకీయ జీవితంలో జిల్లాలో ఇలాంటి పరిస్థితులను ఎప్పుడూ చూడలేదు. అధికార పార్టీ నాయకులు కొందరు అధికారులతో కుమ్మక్కై, పోలీసులను, ధనబలాన్ని అడ్డంపెట్టుకుని మా అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఎత్తుకెళ్లే దుష్ట సంస్కృతికి పాల్పడుతున్నారు. నామినేషన్లు ఉపసంహరించుకునేలా చేస్తున్న ఈ దౌర్జన్యాలను ఈ ప్రభుత్వ హయాంలోనే చూస్తున్నాం. కొన్ని ప్రాంతాల్లో అభ్యర్థులను ఎత్తుకెళ్లే ప్రయత్నాలు జరిగితే మా కార్యకర్తలు అప్రమత్తమై పోలీసుల దృష్టికి తీసుకెళ్లి అడ్డుకున్నారు. నామినేషన్ల పరిశీలన పూర్తయిన తర్వాత రాత్రి 10 గంటలకు జాబితాలు ప్రకటించి, బీఫామ్‌లు దొరకలేదని చెప్పడం ప్రభుత్వ కుట్రలో భాగంగానే కనిపిస్తోంది. ఎన్నికల్లో ప్రజల మద్దతుతో గెలవాలి తప్ప, అభ్యర్థులను ప్రలోభాలకు గురిచేసి, బెదిరించి పోటీ నుంచి తప్పించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూ నగరాన్ని మరింత అభివృద్ధి చేయడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు.

రాష్ట్రంలో 16 మాదకద్రవ్యాల వ్యసన

విముక్తి కేంద్రాల ఆధునికీకరణ

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి: మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు వ్యసన బాధితులకు మెరుగైన వైద్య చికిత్స, కౌన్సెలింగ్, పునరావాస సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 16 ప్రభుత్వాసుపత్రుల్లో నడిచే 16 మాదకద్రవ్యాల వ్యసన విముక్తి కేంద్రాలను రూ.9.86 కోట్లతో ఆధునికీకరించనుంది. మద్య నిషేధ, ఎక్సైజ్ శాఖ తాజాగా విడుదల చేసిన నిధులతో ఈ అభివృద్ధి పనులు జరుగనున్నాయి. క్షేత్రస్థాయిలో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రధాన ప్రాంతీయ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య చికిత్స, పునరావాస సేవలు అందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. ఈ కేంద్రాల్లో భవనాల మరమ్మతులు, గదుల విభజన, అద్దాల తలుపుల ఏర్పాటు, విద్యుత్ వ్యవస్థల బలోపేతం, ఆధునిక ఫర్నిచర్ ఏర్పాటు చేయనున్నారు. బయో ఫీడ్‌బ్యాక్ యంత్రాలు, శ్వాస పరీక్ష పరికరాలు, మల్టీ పారామీటర్ మానిటర్లు, ఈసీజీ యంత్రాలతో పాటు డిజిటల్ సమాచార సాంకేతిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. వైద్య విద్యా శాఖ పరిధిలోని 10 ప్రభుత్వ బోధన, ప్రధాన ఆసుపత్రుల్లో ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, తిరుపతి ఎస్వీఆర్ఆర్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, రాజమండ్రి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, విశాఖపట్నం కింగ్ జార్జి ఆసుపత్రి, కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పరిధిలోని మానసిక వైద్యశాలను ఈ కార్యక్రమంలో చేర్చారు.

వీటిలో విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, విశాఖపట్నం కింగ్ జార్జి ఆసుపత్రి, కడప మానసిక వైద్యశాలను ప్రత్యేక వైద్య సేవల కేంద్రాలు(ఎక్స్‌లెన్సీ)గా అభివృద్ధి చేయనున్నారు. ఈ మూడు ప్రాంతీయ కేంద్రాల్లో అత్యున్నత వైద్య చికిత్స, వ్యసన విముక్తికి అవసరమైన ప్రత్యేక వైద్య సేవలు, పునరావాస సహాయాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. వీటితో పాటు మరో ఆరు జిల్లా, ఏరియా ఆసుపత్రుల్లోనూ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. అనకాపల్లి జిల్లా ఆసుపత్రి, నరసాపురం ఏరియా ఆసుపత్రి, నరసరావుపేట ఏరియా ఆసుపత్రి, చిత్తూరు జిల్లా ఆసుపత్రి, హిందూపురం జిల్లా ఆసుపత్రి, బాపట్ల ఏరియా ఆసుపత్రుల్లో భవన, విద్యుత్ సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు అవసరమైన ఆధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. తద్వారా ప్రాంతీయ, మారుమూల ప్రాంతాల్లోనూ వ్యసన విముక్తి సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

గడువు ముగిసింది

- **అన్ని రకాల బహిరంగ, డిజిటల్ ప్రచారాలకు స్వస్తి పలకాలి**
- **ఎన్నికలు జరిగే ప్రాంతాలకు సంబంధం లేని రాజకీయ నాయకులు, కార్యకర్తలు వెంటనే వెళ్లిపోవాలి**
- **ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం, బహుమతుల పంపిణీ చేస్తే చర్యలు తప్పవు**
- **నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ

ఎన్.టి.ఆర్ జిల్లా పరిధిలోని పురపాలక ఎన్నికల ప్రచార గడువు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ముగిసిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు.

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రచార గడువు ముగిసిన వెంటనే అన్ని రకాల ప్రచార కార్యక్రమాలను నిలిపివేయాలని స్పష్టం చేశారు. బహిరంగ ప్రచారాలు, మైకుల వినియోగంపై నిషేధం ప్రచార గడువు ముగిసిన తర్వాత ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు నిర్వహించరాదు. మైకులు, లౌడ్‌స్పీకర్ల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలి. ఫేస్‌బుక్ లైవ్, జూమ్, గూగుల్ మీట్ తదితర ఆన్‌లైన్ వేదికలు, సోషల్ మీడియా ద్వారా కూడా ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి వీల్లేదని తెలిపారు. ఎన్నికలు జరిగే డివిజన్లు, వార్డులకు చెందని రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రచారకులు తక్షణమే ఆయా ప్రాంతాలను విడిచి వెళ్లాలని ఆదేశించారు. ఇంటింటి ప్రచారాలు, అనుమతి లేని సమావేశాలు జరగకుండా నిఘా బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తాయని తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం లేదా ఇతర బహుమతులు పంపిణీ చేయడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు.

ఇటువంటి చర్యలకు పాల్పడే వారిని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు గుర్తించి, ఎన్నికల చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. పురపాలక ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, భయాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కష్టం తెలుసు..ఆదుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టం జరిగినప్పుడు బీమా ద్వారా పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీ కూడా రైతులకు అండగా ఉంటుందని చెప్పారు. రైతులు కష్టపడి పండించిన పంటకు నష్టం వాటిల్లకుండా చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. పంట కాలువల్లో నీటి ప్రవాహం సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన గోదావరి డెల్టా కాలువల ఆధునీకరణకు రూ.3 వేల కోట్లు కేటాయించామని, పనులు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. రైతులు ప్రకృతి సేద్యం వైపు మొగ్గు చూపాలని సూచించారు. దీనివల్ల పంటలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంటుందన్నారు.

15 వేల విద్యుత్ స్తంభాలు నేల కూలాయి

తుఫాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 15 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేల కూలాయని సీఎం తెలిపారు. రేపు సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని ప్రకటించారు. తొలుత గృహాలకు, ఆ తర్వాత వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సరఫరా అందిస్తామన్నారు. అవసరమైన అదనపు సిబ్బందిని తెలంగాణ నుంచి కూడా రప్పిస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్ పునరుద్ధరణ పనులను స్వయంగా పరిశీలించిన ముఖ్యమంత్రి.. కార్మికులతో కలిసి విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టేందుకు సీఎం సహకరించారు. విపత్కర పరిస్థితుల్లో నూ శ్రమిస్తున్న విద్యుత్ సిబ్బంది, కార్మికులను ముఖ్యమంత్రి అభినందించారు. పశ్చిమగోదావరి జిల్లాలోనే 12,500 చెట్లు నేల కూలాయని, వాటి వ్యర్థాలను త్వరితగతిన తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తుఫాను గాలుల కారణంగా కొబ్బరి చెట్లు, వరి పంటలు దెబ్బతిన్నాయని, బాధిత రైతులకు న్యాయం చేస్తామన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థలోనూ కొంత అంతరాయం ఏర్పడిందని, ప్రైవేటు టెలికాం టవర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సిగ్నల్స్ సమస్య తలెత్తిందని తెలిపారు. వీటిని కూడా పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

మొగల్తూరు మండలం మాత్రేవు గ్రామంలోని తుఫాను షెల్టర్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. నాలుగు రోజులుగా అక్కడ ఆశ్రయం పొందుతున్న మహిళలు, ఇతర బాధితులతో మాట్లాడారు. తుఫాను తీరం దాటే సమయంలో తీవ్ర ఆందోళనకు గురయ్యామని వారు సీఎంకు వివరించారు. తుఫాను ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని, అందువల్ల ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించ గలిగామని సీఎం తెలిపారు. వశిష్ట గోదావరిలో ఎదురవుతున్న సమస్యలను మత్స్యకారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సముద్ర ముఖద్వారం వద్ద కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించి, మత్స్యకారులు సులభంగా చేపల వేట సాగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మత్స్యకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

కేంద్ర బృందం కూడా పర్యటిస్తుంది

మాత్రేవు గ్రామంలోని తుఫాను షెల్టర్ సందర్శన అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ.. అర్నబ్ తుఫాను ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించానన్నారు. ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో ముందస్తు చర్యలు తీసుకుందని చెప్పారు. రాత్రంతా సమీక్షలు నిర్వహిస్తూ వాతావరణ పరిస్థితులను అంచనా వేసి ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేశామని వివరించారు. కలెక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేశామని తెలిపారు. గతంతో పోలిస్తే ప్రాణ నష్టాన్ని భారీగా తగ్గించగలిగామని, దురదృష్టవశాత్తూ ఏడుగురు మృతి చెందారని విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించామన్నారు. తుఫాను వల్ల ప్రాథమికంగా రూ.4,600 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా వేసి కేంద్రానికి నివేదిక పంపించామని, పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేసి మరో నివేదిక అందిస్తామని తెలిపారు. నష్ట తీవ్రతను అంచనా వేసేందుకు కేంద్ర బృందం కూడా రాష్ట్రంలో పర్యటిస్తోందని చెప్పారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేసిందని, ప్రజల భాగస్వామ్యంతో విపత్తును సమర్థంగా ఎదుర్కొన గలిగామని సీఎం అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువులను నింపేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధులను శుక్రవారం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఏడాదికి మూడు విడతల్లో మొత్తం రూ.20 వేలు అందిస్తామని ఇచ్చిన హామీలో భాగంగా రెండో విడతగా రూ.7 వేల చొప్పున రైతులకు జమ చేశామన్నారు. తుఫాను కారణంగా పంటలు నీట మునిగిన రైతులను కూడా ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. తుఫాను బాధిత కుటుంబాలకు బియ్యంతో పాటు కందిపప్పు, వంటనూనె, బంగాళదుంపలు తదితర నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామని సీఎం తెలిపారు. సహాయ కార్యక్రమాల్లో భాగంగా బాధితులందరికీ ప్రభుత్వం ప్రకటించిన రేషన్ అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. తుఫాను వల్ల నష్టపోయిన చిట్టచివరి వ్యక్తికి కూడా న్యాయం జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నప్పటికీ తుఫాను బాధితుల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. మీడియా సమావేశం అనంతరం ముఖ్యమంత్రి తుఫాను బాధితులకు స్వయంగా రేషన్ సరుకులు పంపిణీ చేశారు. సీఎం వెంట మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ సహా ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచాలి

❖ అర్ధరాత్రి నగరంలో పర్యటించి పనులను పరిశీలించిన కలెక్టర్ డీకే బాలాజీ ❖ విద్యుత్ సరఫరా జాప్యంపై అధికారులపై అసంతృప్తి.. జిల్లాకు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి రాక

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి : అర్నాబ్ తుఫాను ప్రభావంతో ఈదురుగాలులు, భారీ వర్షాలకు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం అర్ధరాత్రి మచిలీపట్నం నగరం లోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించిన ఆయన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గాంధీనగర్, ఇంగ్లీష్ పాలెం, బస్టాండ్ వెనుక గానుగ సెంటర్, చింత చెట్టు సెంటర్, కాలేఖాన్ పేట, బలరాముని పేట, కాసాని గూడెం, పాత హౌ సింగ్ బోర్డు కాలనీలలో పర్యటించి పనుల పురోగ తిని సమీక్షించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జరుగుతున్న జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు సిబ్బందిని రంగంలోకి దించి, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ మరమ్మతు పనులను వేగవంతం చేయాలని సూచించారు.తుఫాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, ఇతర పరికరాల మరమ్మతులను నిరంతరం పర్యవేక్షించాలని, విద్యుత్ సరఫరాను సాధ్యమైనంత త్వరగా సాధారణ స్థితికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొం టు న్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

విద్యుత్ పునరుద్ధరణ పనులపై సీఎండీ సమీక్ష

కృష్ణా జిల్లాలో తుఫాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులను పర్యవేక్షించేందుకు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి శుక్రవారం ఉదయం జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా గూడూరు వద్ద జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని మర్యాదపూర్వకంగా కలిశారు.జిల్లాలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల పురోగతి, క్షేత్రస్థాయిలో చేపడుతున్న చర్యలు, ఎదురవుతున్న సమస్యలపై ఇరువురు చర్చించారు. దెబ్బతిన్న విద్యుత్ లైన్ల మరమ్మతులను వేగవంతం చేసి, ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. విద్యుత్ వ్యవస్థను వీలైనంత త్వరగా సాధారణ స్థితికి తీసుకురావడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఉయ్యూరు మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

❖ కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ డీకే బాలాజీ ❖ ప్రతి దశపై పూర్తి అవగాహన ఉండాలి.. ఎన్నికల నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలి

ఉయ్యూరు, కృష్ణాజిల్లా బ్యూరో : ఉయ్యూరు మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు–2026లో భాగంగా శుక్ర వారం ఉయ్యూరులోని ఏజీఎస్జీ సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో కౌంటింగ్ సూపర్వైజర్లు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌంటింగ్ ప్రక్రియలో అనుసరించాల్సిన విధివిధానాలు, ఓట్ల లెక్కింపు దశలు, ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.కౌంటింగ్ విధులకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ ఆర్ఓ హ్యాండ్ బుక్‌లోని మార్గదర్శకాలను క్షుణ్ణంగా చదివి, నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు.

శిక్షణలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతి అంశాన్ని వివరించడంతో పాటు, మాక్ కౌంటింగ్ నిర్వహించి సిబ్బందికి ప్రాక్టికల్ అవగాహన కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు.కౌంటింగ్ సమయంలో ప్రతి ఓటును నిబంధనల ప్రకారం కౌంటింగ్ ఏజెంట్లు, అబ్జర్వర్లు, రిట ర్నింగ్ అధికారి పరిశీలించేలా చూపించిన అనంతరమే సంబంధిత టేబుల్‌పై ఉంచాలని తెలిపారు. ఓట్ల లెక్కింపులో అత్యంత అప్రమ త్తంగా వ్యవహరిస్తూ, పారదర్శకతకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాట్ల పరిశీలన

అనంతరం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను వేగవంతంగా, క్రమబద్ధంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సిబ్బంది ఎక్కువ సమయం వేచి ఉండకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని, ప్రతి పోలింగ్ సిబ్బందికి కేటాయించిన కేంద్రానికి సంబంధించిన సామగ్రిని సక్రమంగా అందజేసి ఎలాంటి జాప్యం లేకుండా పోలింగ్ కేంద్రాలకు పంపించాలని ఆదేశించారు.

కౌంటింగ్ కేంద్రంలో భద్రతపై ప్రత్యేక దృష్టి

డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి కౌంటింగ్ హాల్ వరకు ఏర్పాటు చేసిన మార్గం, బారికేడ్లు, ఫెన్సింగ్‌ను కలెక్టర్ పరిశీలించారు. మార్గమంతా పటిష్టమైన భద్రత కల్పించాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు.ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్‌ను కూడా పరిశీలించి కౌంటింగ్ టేబుళ్లు, కుర్చీలు, సిబ్బంది కూర్చునే ఏర్పాట్లు, టేబుళ్ల చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను తనిఖీ చేశారు.

విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు.కౌంటింగ్ ప్రారంభం నుంచి ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశను ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. సుభాష్ చంద్రబోస్, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్, ఎంపీడీవో, ఎన్నికల అధికారులు, కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

2,23,183 పెన్షన్లకు రూ. 96.93 కోట్ల లబ్ధి

- పంపిణీ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ: ఎన్‌టీఆర్ జిల్లాలో 2,23,183 పెన్షన్లకు మొత్తం రూ. 96.93 కోట్ల లబ్ధి జరుగుతోందని.. పెన్షన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.శుక్రవారం కంచికచర్ల మండలం, పరిటాల గ్రామంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పరిశీలించారు. లబ్ధిదారులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ద్వారా పంపిణీ కార్యక్రమం సజావుగా జరుగుతుందా.. లేదా? అనేది పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సామాజిక భద్రత లక్ష్యంగా అమలవుతున్న కార్యక్రమాన్ని సద్వినియో గం చేసుకోవాలని సూచించారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు, నిర్లక్ష్యానికి తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరించేందుకు సిబ్బందికి దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. పెన్షన్ల పంపి ణీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో అనుక్షణం పర్యవేక్షిస్తూ లోటుపాట్లు లేకుండా చూస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.కార్యక్రమంలో నందిగామ ఆర్‌డీవో అనిల్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం డ్రై డే కార్యక్రమం ఆరోగ్య అవగాహన కార్యక్రమం

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు, మచిలీపట్నం పరిధిలోని యుపిహెచ్‌సి – నారాయణపురం, 50వ సచివాలయ ప్రాంతంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య పర్యవేక్షకులు రాఘవేంద్ర, సూరిబాబు, హెల్త్ అసిస్టెంట్ మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.కార్యక్రమంలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై ఆరోగ్య అవగాహన కల్పించడం, దోమల లార్వా వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం, ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడం, నీటి నిల్వ పాత్రలను శుభ్రపరచడం గురించి ప్రజలకు సూచనలు ఇవ్వడం, దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడం జరిగింది.ప్రతి శుక్రవారం మీ ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని, నిల్వ నీటిని తొలగించాలని, నీటి పాత్రలను శుభ్రపరచుకోవాలని, దోమల పెరుగుదలను అరికట్టి, మీ కుటుంబాన్ని మరియు సమాజాన్ని సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకోవాలని పిలుపునిచ్చారు.





నగరంలో కుండపోత వర్షం!

భారీ వర్షానికి జలమయమైన రహదారులు.. ఇబ్బందుల్లో నగరవాసులు

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం నగరంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ప్రారంభమైన కుండపోత వర్షంతో నగరంలోని జనజీవనం కొంతసేపు స్తంభించింది. భారీ వర్షం కారణంగా ప్రధాన రహదారులతో పాటు పలు అంతర్గత రహదారులు సైతం వర్షపు నీటితో జలమయంగా మారాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొ న్నారు. రెండు రోజుల క్రితం ఆర్నబ్ తుఫాను ప్రభావంతో నగరంలో భారీగా చెట్లు, కొమ్మలు నేలకొరిగి పచ్చదనానికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ తుఫాను ప్రభావం నుంచి నగరం ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో మరోసారి భారీ వర్షం కురవడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంబంధిత అధికారులు అప్రమత్తమై మురుగునీటి కాలువల్లో నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని, నీరు నిలిచిన ప్రాంతాల్లో తక్షణమే పారుదల ఏర్పాట్లు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

తుఫాను ప్రభావిత 13 జిల్లాల్లో గ్యాస్ సిలిండర్ల పంపిణీకి ఓటీపీ నిబంధన నుంచి తాత్కాలిక మినహాయింపు

నగదు చెల్లింపుతో నేరుగా సిలిండర్లు పొందే వెసులుబాటు

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి : అర్నాబ్ తుఫాను ప్రభావంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, మొబైల్ నెట్‌వర్క్, ఇంటర్నెట్ సేవల్లో అంతరాయాలు ఏర్పడిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని 13 తుఫాను ప్రభావిత జిల్లాల్లో గృహ వినియోగ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల పంపిణీకి ఓటీపీ (OTP) ధృవీకరణ నుంచి కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక మినహాయింపు కల్పించింది. ఈ మేరకు నగదు చెల్లింపు ద్వారా నేరుగా సిలిండర్లు పొందే (క్యాష్ అండ్ క్యారీ) విధానాన్ని అమలు చేసేందుకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది.తుఫాను కారణంగా ఏర్పడిన పరిస్థితుల్లో గ్యాస్ వినియోగదారులు ఇబ్బందులు పడకుండా, గృహ అవసరాలకు ఎల్పీజీ సరఫరాలో అంతరాయం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఓటీపీ ధృవీకరణ సాధ్యం కాని పరిస్థితుల్లో వినియోగదారులు నగదు చెల్లించి నేరుగా గ్యాస్ సిలిండర్లు పొందవచ్చు.ఈ వెసులుబాటు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో వర్తించనుంది.తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఈ తాత్కాలిక వెసులుబాటు అమల్లో ఉంటుందని అధికారులు వెల్లడించారు. తుఫాను సంక్షోభ సమయంలో గృహ వినియోగదారులకు గ్యాస్ సరఫరా సజావుగా జరిగేలా ఈ అవకాశాన్ని అవసరమైన మేరకు వినియోగించుకోవాలని, గ్యాస్ పంపిణీదారులకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పద్మశాలి దసరా మేళను విజయవంతం చేయాలి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం: ఆటోనగర్‌లోని హరిన వనస్థలి అనన్య ఎకోపార్క్ ఆవరణలో నవంబర్ ఒకటవ తేదీన నిర్వహించే 24వ పద్మశాలి దసరా మేళ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పద్మశాలి సంఘం ఎల్బీనగర్ సర్కిల్ వ్యవస్థాపక కమిటీ సభ్యులు రావిరాల సంధ్యారాణి నేత, ఉమా శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. కొత్తపేటలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గత 23 సంవత్సరాలుగా పద్మశాలి దసరా మేళా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని, రాష్ట్రంలోని పద్మశాలీలు ఏకతాటిపై రావాలని ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పద్మశాలి మేళా ద్వారా మరోసారి పద్మశాలి ఐక్యతను చాటి చెప్పాలన్నారు. పద్మశాలి దసరా మేళ కార్యక్రమంలో పలు క్రీడా పోటీలు, వైద్య శిబిరం, సాంస్కృతిక కార్యక్రమాలు, వివాహ పరిచయ వేదికలు, దాండియాతో పాటు రుచికరమైన భోజనాలను ఏర్పాటు చేస్తున్నామని పద్మశాలి బంధువులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

వైసీపీకి ఓటు వేయడమంటే అరాచకాన్ని ప్రోత్సహించడమే

❖ ప్రజల కోసం పనిచేసే నాయకులకి ఓట్లు వేయండి.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకుందాం ❖ రాష్ట్ర ప్రజలు విజ్ఞతతో ఆలోచించి స్థానిక ఎన్నికల్లో వినియోగించుకోండి ❖ ఉమ్మడి పాత్రికేయ సమావేశంలో మచిలీపట్నం కూటమి నేతల పిలుపు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేది ఎవరో.. నాశనం చేసేది ఎవరో గుర్తించి 2024 ఎన్నికల్లో కూటమికి ప్రజలు పట్టం కట్టారు. అదే స్ఫూర్తిని ఇప్పుడు స్థానిక ఎన్నికల్లోనూ చూపించాలని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో ఉమ్మడిగా పాత్రికేయ సమావేశం నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. మంచి చేసే అభ్యర్థులను, మంచి వాళ్లను గెలిపించుకున్నప్పుడే రాష్ట్రానికి మన నియోజకవర్గానికి మంచి జరుగుతుంది. గత ఐదేళ్లు వైసిపి అరాచక పాలనను రాష్ట్ర ప్రజలంతా చూశారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో కనీసం నామినేషన్లు కూడా వేయనీయకుండా అడ్డుకున్నారు. ప్రత్యర్థులపై దాడులకు తెగబడ్డారు. నామినేషన్ పత్రాలను బలవంతంగా లాక్కుని చించేశారు. వారి అరాచకాలను చూసి ప్రజలు కూటమికి 2024 ఎన్నికల్లో పట్టం కట్టారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశాం. గతంలో ఎన్నడు లేనివిధంగా మచిలీపట్నంలో అభివృద్ధి చేస్తున్నాము. ప్రధానంగా తాగునీరు రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం చేస్తున్నాం. త్వరలోనే మచిలీపట్నం పోర్టు పూర్తి చేయబోతున్నాం. ఫిషింగ్ హార్బర్, మెడికల్ కాలేజీ పనులు వేగంగా జరుగుతున్నాయి. తాజాగా మంగినపూడి సముద్ర తీరాన్ని ప్రపంచ పర్యాటక ప్రాం తంగా మారుస్తున్నాము. గత ఏడాది బీచ్ ఫెస్టివల్ నిర్వహిం చాము. ఇప్పుడు మహాగణపతి ఉత్సవాల నిర్వహణతో దేశస్థాయిలో మంగినపూడి తీరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాం. ఇదే స్ఫూర్తితో మచిలీపట్నంలో మరింతగా పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తాం. పోర్ట్ సిటీగా మచిలీపట్నం అభివృద్ధిని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తాం. ఇప్పుడు వరకు డబల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది. స్థానిక ఎన్నికల్లో విజయంతో ట్రిపుల్ ఇంజన్ వేగాన్ని అందుకుంటాం. మెగాడిఎస్సి ద్వారా 16 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చాం. త్వరలో విశాఖ కేంద్రంగా పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించబోతున్నాం. ఇప్పటి వరకు 22 లక్షల కోట్ల పెట్టుబడులు ఏపీకి రాగా 70% గ్రౌండ్ అయ్యాయి. కూటమి పాలనలో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి. పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. కానీ గత ఐదేళ్లు వైసిపి అరాచకంతో రాష్ట్రంలో పెట్టుబడి అంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. వైట్ కలర్ ఉద్యోగాలు కూటమి ప్రభుత్వ నినాదం అయితే.. చొక్కా మడత పెట్టి రప్ప రప్ప అంటూ నరుకుతామని బెదిరించడం వైసిపి సంస్కృతి. గతంలో బూతులు దాడులు అరాచకాలు రాష్ట్రంలో రాజ్యమేలుతే.. నేడు అభివృద్ధి ఉద్యోగాలు సంక్షేమం రాజ్యమేలుతోంది. నిన్నటికి నిన్న ఏపీని అర్నాబ్ తుఫాను 150 కి.మీలకు మించిన వేగంతో అతలాకుతలం చేస్తే 24 గంటల్లోనే విద్యుత్ వ్యవస్థ మొత్తాన్ని పునరుద్ధరించాం. 24 గంటల్లోనే నష్టపరిహారం ప్రకటించాం. దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేస్తున్నాం. రాష్ట్రాన్ని అభి వృద్ధి చేసే నాయకుడు ప్రభుత్వం కావాలో.. రప్ప రప్ప అంటూ అరాచకాలు చేసే గుండాలు కావాలో రాష్ట్ర ప్రజలు విజ్ఞతతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర విన్నవించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో చెప్పాం.. గత రెండున్నర సంవత్సరాలుగా చెప్పింది చేస్తు న్నాం.. చెప్పిన ప్రతి మాటను తూచా తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇస్తున్నాం. స్థానిక సంస్థల వ్యవస్థనే ఏకం గా నాశనం చేయాలని వైసిపి నేతలు ప్రయత్నిస్తున్నారు. 2014-19 మధ్య రాష్ట్రంలో 25వేల కిలోమీటర్ల సిసి రోడ్లు నిర్మించాం. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో నిర్మించింది కేవలం ఎనిమిది వందల కిలోమీటర్లు మాత్రమే. కేంద్రం నుండి వచ్చిన నిధులను సైతం దారి మళ్లించి రాష్ట్రాన్ని దగా చేశాడు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు పదివేల కిలోమీటర్ల సిసి రోడ్లు నిర్మించాం. మరో పదివేల కిలోమీటర్ల రోడ్లు వివిధ దశల్లో ఉన్నాయి. J జల్ జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రంలో ప్రతి ఇంటికి మంచినీటి కులాయి ఏర్పాటు చేస్తున్నాం. అభివృద్ధి సంక్షేమాన్ని నిబద్ధతతో పాటిస్తున్నాం. మాయ మాటలు చెప్పి మోసం చేయాలని చూస్తున్న జగన్ రెడ్డి విష కోరలకు ప్రజలు భయపడొద్దు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే కూటమి ప్రభుత్వ ఏకైక లక్ష్యమని గురుమూర్తి పేర్కొన్నారు. డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ పని అయిపోయింది. ఎన్ని ఆరోపణలు చేసిన ఎన్ని అరాచకాలకు పాల్పడదామని ప్రయత్నించిన ప్రజలు సహించేందుకు సిద్ధంగా లేరు. సూపర్ సిక్స్ హామీలన్నీ సూపర్ హిట్ చేసాం. అభివృద్ధిని చేసి చూపిస్తున్నాం. నిన్న తుఫాను రాష్ట్రాన్ని వనికించినప్పటికీ ఎక్కడ ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా చేయడం చంద్రబాబు నాయుడు గారి పరిపాలన దక్షతకు నిదర్శనం. రాత్రింబవళ్లు సమీక్షించి అధికారులను అప్రమత్తం చేయడం ఆయన పనితీరుకు అద్దంపడుతుంది. ప్రజల కోసం పనిచేసేందుకు మేము ఉంటే.. గొడ్డలి పార్టీ మాత్రం ప్రజల్ని నరుకుతాం చంపుతాం రప్ప రప్ప అంటూ రాక్షస సం స్కృతిని చాటు కుం టుంది. ఇప్పటి కైనా ప్రజలు ఆలో చించి ఓటు వేయా లని బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. సీనియర్ నాయ కులు బూరగడ్డ మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలను వీలైనంత త్వరగా నిర్వహించి కేంద్రం నుండి వచ్చే 16వ ఆర్థిక సంఘం నిధులు సాధించుకోవాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుంది. కానీ హోటల్ పార్టీ మాత్రం ఎన్నికలను అడ్డుకోవాలని కుట్రలు చేస్తోంది. గొడ్డలి పార్టీ ఎన్ని రకాల కుతంత్రాలకు పాల్పడిన అభివృద్ధి విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గబోదు. ప్రజలు వైసీపీకి ఓటు వేసే పరిస్థితి లేదు అని హెచ్చరించారు. టీడీపీ సీనియర్ నాయకులు కొనకళ్ల జగన్నాథ రావు మాట్లాడుతూ.. బందరులో గత ఐదేళ్ల వైసీపీ పరిపాలనను.. గత రెండు సంవత్సరాల కూటమి ప్రభుత్వ పాలనను చూసి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వ గొప్పదనం స్పష్టంగా కనిపిస్తోంది. జగన్ రెడ్డి గొడ్డలి పార్టీ నాయకు ఎన్ని వేషాలు వేసినా ప్రయోజనం శూన్యం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదా, బీజేపీ నాయకు ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏలూరు అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించాలి

- **ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు పిలుపు**

ప్రజాభూమి ఏలూరు

నగర అభివృద్ధి కొనసాగాలంటే కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా 12, 24,27,32వ డివిజన్లలో నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.పలుచోట్ల పూలవర్షంతో నాయకులకు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరు తెలుగుదేశం పార్టీకి కంచుకోట అని,అదే ఆదరణను కూటమి పట్ల కూడా ప్రజలు చూపించడం అభినందనీయమన్నారు.నగరంలోని అన్ని ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టామని,వచ్చే ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి గోదావరి జలాలను ఏలూరు ప్రజలకు తాగునీటి అవసరాల కోసం అందించేలా కృషి చేస్తున్నామని తెలిపారు.మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ గత రెండున్నరేళ్లలో నగరంలో జరిగిన అభివృద్ధిని గుర్తించి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు మీరావలీ,12వ డివిజన్ జనసేన అభ్యర్థి పైడి లక్ష్మణ్ రావు,24వ డివిజన్ టీడీపీ అభ్యర్థి గొంగడి బోసు బాబు,27వ డివిజన్ టీడీపీ అభ్యర్థి పైడి

వెంకట్రావు, 32వ డివిజన్ టీడీపీ అభ్యర్థి తాటిపూడి సుప్రీత్, జనసేన సీనియర్ నాయకులు నారా శేషు, ఈడా మాజీ ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్,నాయకులు ఎమ్మార్డీ బలరాం, ఎస్సెమ్మార్ పెదబాబు పాల్గొన్నారు.

ఏలూరు 13వ డివిజన్‌లో జనసేన నాయకుల విస్తృత ప్రచారం

ప్రజాభూమి ఏలూరు

నగరంలో 13వ డివిజన్ జనసేన పార్టీ ఇంచార్జ్ సోషల్ సర్వీస్ మురళి ఆధ్వర్యంలో కార్యకర్తలు,ప్రజల మధ్య విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.పార్టీ సిద్ధాంతాలు,ప్రజా సమస్యలు,నగర అభివృద్ధి లక్ష్యాలను ప్రజలకు వివరిస్తూ జనసేన నాయకులు ముందుకు సాగుతున్నారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు,స్థానిక ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.ప్రజల సమస్యలను తెలుసుకుంటూ,వాటి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా కల్పిస్తున్నారు.13వ డివిజన్‌లో జనసేన పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా కొప్పన మంగ ప్రచారం నిర్వహిస్తున్న ప్రజలతో మమేకమవుతూ,పార్టీ గాజు గ్లాసు గుర్తుకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజల ఆశీస్సులతో డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని నాయకులు పేర్కొన్నారు.

ఏపీడబ్ల్యూ జెఎఫ్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా కె.బాలశౌరి ఏకగ్రీవ ఎన్నిక

- ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తా: బాలశౌరి

ప్రజాభూమి ఏలూరు

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్), నేషనల్ అసోసియేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఏజే) ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏలూరు జిల్లా రిటర్నింగ్ ఆఫీసర్‌గా సీనియర్ నాయకులు కె. బాలశౌరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.శుక్రవారం ఏలూరు రెవెన్యూ భవన్‌లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.త్వరలో జరగనున్న రాష్ట్ర, జాతీయ ఎన్నికల నిర్వహణ కోసం ప్రతి జిల్లాలో రిటర్నింగ్ ఆఫీసర్లను ఎంపిక చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎస్.డి. జబీర్, కార్యదర్శి వై.వి. హరీష్ తెలిపారు.

ఈ సందర్భంగా కె.బాలశౌరి మాట్లాడుతూ,తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో కె. సోమశేఖర్,పి. కళ్యాణ్ కుమార్, సి. హెచ్. ప్రతాప్, ఎస్.రిషి రావు, టి. వెంకటరావు,కె.వై. దాస్, మిల్ట్రీ ప్రతాప్,సతీష్ కుమార్,మౌనిక,సన్నీ,ఎర్ర జయదాసు,సామ్యూల్, సుధాకర్,దొరబాబు జిల్లా నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించి ట్రిపుల్ ఇంజన్ సర్కార్‌కు బాటలు వేయాలి

- అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ కూటమి.. అరాచకానికి వైస్సార్సీపీ

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట:

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజన్ సర్కార్‌కు బాటలు వేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆలమూరు మండలంలో శుక్రవారం బడుగువానిలంక నుంచి ప్రారంభమైన కూటమి ఎన్నికల ప్రచారంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బీజేపీ నేత తమలంపూడి రామకృష్ణారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. జడ్పీటీసీ అభ్యర్థి దొండపాటి సుబ్బరాజుతో పాటు 21 ఎంపీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు.

కూటమి అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ కొనసాగుతోందని, స్థానిక సంస్థల్లోనూ కూటమి అభ్యర్థులు గెలిస్తే అభివృద్ధి మరింత వేగవంతమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రైనేజీలు, గ్రామ సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ప్రధాని మోదీ కేంద్రం నుంచి సహకారం అందిస్తున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో గ్రామీణ అభివృద్ధి కుంటుపడిందని ఎమ్మెల్యే విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. యువత భవిష్యత్తు, గ్రామాల అభివృద్ధి కోసం కూటమికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో కూటమిలో ఏ పార్టీ అభ్యర్థి పోటీ చేసినా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కూటమి అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలి

- **ఎమ్మెల్యే చిర్రి బాలరాజు**

ప్రజాభూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

జీలుగుమిల్లి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు గౌడ సంఘం నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం జీలుగుమిల్లి, పి. రాజవరం గ్రామాల్లో కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీలుగుమిల్లి మండలం జెడ్పీటీసీ అభ్యర్థి కుంజా నాగమణి, జీలుగుమిల్లి ఎంపీటీసీ అభ్యర్థిని కారం సుజాత, తాటియాకులగూడెం ఎంపీటీసీ అభ్యర్థిని జాస్తి హేమ విజయానికి కూటమి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పిలుపునిచ్చారు. అనంతరం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థుల విజయానికి మద్దతు కోరుతూ ఎమ్మెల్యే చిర్రి

బాలరాజు, కూటమి నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యదర్శి మాజీ జెడ్పీటీసి గెడ్డమనగు రవి కుమార్, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి రాము, రూపా సత్యనారాయణ, కోలా మధు, చిర్రి వెంకటేశ్వరరావు, చిర్రి శ్రీనివాస్, కూరం వెంకటేష్, ఉలవల శివ, నరేంద్ర, ఉలవల ముత్యం, కొప్పుల కృష్ణమోహన్, చిట్టిబొమ్మ సతీష్, కక్కిరాల మురళి, మధు, జాస్తి సత్యనారాయణ, గుడిపాటి పుల్లారావు, సూరిశెట్టి మహేష్ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

23వ డివిజన్ అభివృద్ధికి స్వతంత్ర అభ్యర్థిగా గరికి ముక్కు గౌతమ్ కుమార్ గెలిపించండి

ప్రజాభూమి ఏలూరు

నగరంలోని 23వ డివిజన్‌లో స్వతంత్ర అభ్యర్థిగా గరికిముక్కు గౌతమ్ కుమార్ కార్పొరేటర్‌గా పోటీ చేస్తున్నారు.ఈ ఎన్నికల్లో డివిజన్ ప్రజల ఆశీస్సులు, ఆదరాభిమానాలు, సహకారంతో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. 23వ డివిజన్ ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని గౌతమ్ కుమార్ తెలిపారు.ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని,డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, నిరంతరం ప్రజలకు సేవ చేయడమే తన ఆశయమని, ఈ ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించి ఆశీర్వదించాలని గౌతమ్ కుమార్ కోరారు.

మురికివాడలు, మధ్యతరగతి ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలం

- **రిటైర్డ్ డీజీపీ పూర్ణచంద్రరావు విమర్శ**

ప్రజాభూమి ఏలూరు

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పటికీ మురికివాడలు, మధ్యతరగతి ప్రజల సమస్యలు ఎందుకు పరిష్కారం కాలేదని రిటైర్డ్ డీజీపీ జె. పూర్ణచంద్రరావు ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి కోసం సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ పోరాడుతుందని తెలిపారు. ఏలూరు నగరంలోని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ఏలూరు మేయర్ అభ్యర్థి గుబ్బల నాగేశ్వరరావును బ్లాక్ బోర్డు గుర్తుపై

ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.మేయర్ అభ్యర్థి గుబ్బల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు నగర అభివృద్ధి కోసం ప్రజలు తనకు మద్దతు తెలిపి బ్లాక్ బోర్డు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో ప్రొఫెసర్ లాల్, ఏఐబీఎస్ జిల్లా అధ్యక్షుడు ములకల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా తుది ప్రచురణ విడుదల

- మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి,పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పురపాలక సంఘం పరిధిలోని 44 వార్డు లకు సంబంధించి ఎన్నికల నిమిత్తం పోలింగ్ కేంద్రాల జాబితా తుది ప్ర చురణ ఫారం 6 ద్వారా విడుదల చేసినట్లు మున్సిపల్ కమిషనర్ డి కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.మొత్తం 88 పోలింగ్ బూత్‌లకు సంభిందించి ప్రచురణ ప్రతులను పురపాలక సంఘం, ఆర్ డి ఓ, తాసిల్దార్ కార్యాలయం, వార్డ్ సచివాలయం, నర్సాపురం, యలమంచిలి ఎంపీడీఓ కార్యాలయం ల లో వద్ద ప్రదర్శించినట్లు తెలిపారు. కావున ఓటర్లు ప్రజలు గమనించవలసిందిగా కమిషనర్ కిరణ్ కుమార్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏలేశ్వరం బాలాజీ చౌక్‌లో భారీ బహిరంగ సభ

- **అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా**

ప్రజా భూమి, ప్రత్తిపాడు

ఏలేశ్వరం నగర పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బాలాజీ చౌక్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ముఖ్య అతిథిగా హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో ఇప్పటికే చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాబోయే రోజుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులు, పట్టణ భవిష్యత్తు ప్రణాళికలపై వివరంగా వెల్లడించారు. ఏలేశ్వరం పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం తరపున చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు.

అనంతరం మున్సిపల్ ఎన్నికల్లో కూటమి చైర్‌పర్సన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న యార్లగడ్డ అక్షితతో పాటు, 28 వార్డుల్లో పోటీ చేస్తున్న కూటమి కౌన్సిలర్ అభ్యర్థులకు ప్రజలు తమ ఓటు వేసి మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని నాయకుల విజ్ఞప్తి

- **26వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి ఇనపనూరి జగదీష్ బాబు**

ప్రజాభూమి ఏలూరు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ప్రజలు అండగా నిలిచి, రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా, వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ నాయకత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. పార్టీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏలూరు నగర మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గంటా మోహన రావు (జి ఎంఆ ర్)కు, 26వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఇనపనూరి జగదీశ్ బాబుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.అభ్యర్థులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ నగర అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మేయర్ అభ్యర్థితో పాటు కార్పొరేటర్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.ప్రజల ఆశీర్వాదంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారనే ధీమా వ్యక్తం చేశారు.

కీలకం నాలుగు రోజులే..

- **మన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతి గడపకు తీసుకెళ్లాలి**
- **కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రానికి, నియోజకవర్గానికి మేలు జరుగుతుందని ప్రజలకు వివరించండి-మంత్రి నిమ్మల పిలుపు**

ప్రజాభూమి ప్రతినిధి , పాలకొల్లు

స్థానిక సంస్థల జడ్పీటిసి, ఎంపీటీసీల ఎన్నికల ప్రచారానికి మిగిలింది కీలకమైన నాలుగు రోజులేనని, ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూటమి శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో సాధించిన ప్రగతిని, పాలకొల్లు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. పాలకొల్లులోని ఆయన కార్యాలయంలో కూటమి శ్రేణులతో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గంలోనూ కోట్లాది రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, గత రెండేళ్లలో నియోజకవర్గం మొత్తం మీద రూ.1,245 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయని వెల్లడించారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలో చేపట్టిన రహదారులు, డ్రెయిన్లు, మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, రైతులకు పుంత రహదారులు, తదితర అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులకే పరిమితం కాకుండా, వివిధ సంస్థల నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను సమీకరించి చేపడుతున్న కార్యక్రమాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ, స్మశాన వాటికల అభివృద్ధి, పార్కుల ఏర్పాటు, పట్టణాలు, గ్రామాల్లో సుందరీకరణ పనులు వంటి కార్యక్రమాలను వివరించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే స్థానిక సంస్థల్లో

కూటమి అభ్యర్థుల విజయం ఎంతో అవసరమని చెబుతూ ఓటు వేసి గెలిపించాలంటూ అభ్యర్థించాలని మంత్రి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రానికి, ప్రజలకు మరింత మేలు జరుగుతుందని, వైసీపీకి ఓటు వేయడం వల్ల అభివృద్ధికి ఎలాంటి ప్రయోజనం ఉండదని, గత అనుభవాలను ప్రజలకు గుర్తుచేస్తూ వాస్తవాలను వివరించాలన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లో బూత్ స్థాయిలో ఇంటింటికీ వెళ్లాలని, కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు.మాజీ ఎమ్మెల్సీ అంగర రామోహన్, ఎ ఎంసీ చైర్మన్ కోడి విజయ్ భాస్కర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పులివెందులలో అరాచకాలకు వెన్నుపోటు పార్టీ భారీ స్కెచ్

- సీఎంఓ, డీజీపీ కార్యాలయం నుంచి పోలీసులకు ఆదేశాలు
- డీఐజీ కోయ ప్రవీణ్ కనుసన్నల్లో ఎన్నికల అరాచకాలు
- గతంలో జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో జరిగిన దారుణాలే ఇప్పుడూ జరుగుతున్నాయి
- బయట ప్రాంతాల నుంచి వేలాదిగా గూండాలను పులివెందులలో మోహరించారు
- వారికి పోలీసులే లాడ్జిలు, ఫంక్షన్ హాల్స్ లో ఆశ్రయం కల్పిస్తున్నారు
- చంద్రబాబు ఆదేశాలతో డీజీపీ డైరెక్షన్ లో డీఐజీ కోయ ప్రవీణ్ దారుణాలు
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు ఆధారాలున్నా కనీస విచారణ లేదు
- ప్రశాంతమైన పులివెందులలో మళ్లీ కక్షలకు చంద్రబాబు ఆజ్యం పోస్తున్నాడు
- ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా ఎస్ఈసీ చూడాలి
- ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి డిమాండ్

ప్రజాభూమిప్రతినిధి, పులివెందుల

పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికలను ప్రశాంతంగా జరగనీయకుండా వెన్నుపోటు పార్టీ భారీ స్కెచ్ వేసిందని, ప్రభుత్వ పెద్దల అండదండలతో విపరీతమైన అరాచకాలకు పాల్పడుతోందని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మండిపడ్డారు. పులివెందులలో మున్సిపల్ ఎన్నికలను ఏకపక్షంగా మార్చేందుకు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) నుంచి ప్రత్యక్ష ఆదేశాలు వస్తున్నాయని, సీఎం చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఈ కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. డిజిపి ఆఫీస్, డిఐజి కోయ ప్రవీణ్ కనుసన్నల్లో పూర్తిగా వన్ సైడెడ్‌గా వ్యవహరిస్తూ పోలీసులు టీడీపీ నేతలకు సహకరిస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ , జగన్ కృషితో పులివెందుల ప్రాంతానికి కృష్ణా జలాలు వచ్చి రైతులు ప్రశాంతంగా జీవిస్తుంటే, చంద్రబాబు, బీటెక్ రవి, ఆదినారాయణరెడ్డి తమ స్వార్థ రాజకీయాల కోసం ఈ ప్రాంతంలో మళ్లీ కక్షలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అందుకే ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి వెబ్‌కాస్టింగ్, లైవ్ ఫుటేజ్ ఏర్పాటు చేయాలని హైకోర్టులో పిటిషన్ వేశామని పులివెందులలో మీడియాతో మాట్లాడిన ఎంపీ అవినాష్‌రెడ్డి వెల్లడించారు. ప్రెస్‌మీట్‌లో ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి ఇంకా ఏం మాట్లాడారంటే" పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ఎలాగైనా అడ్డదారిలో గెలవాలన్న కుట్రతో వెన్నుపోటు పార్టీ భారీ స్కెచ్ వేసింది. ఎన్నికలు ప్రశాంతంగా జరగకుండా సీఎంఓ నుంచే ఆదేశాలు జారీ అవుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, డీజీపీ కార్యాలయం నుంచి వస్తున్న ఆదేశాలతో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. డీఐజీ కోయ ప్రవీణ్ కనుసన్నల్లో టీడీపీకి అనుకూలంగా అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు, రాయచోటి ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వెన్నుపోటు పార్టీ కార్యకర్తలను పులివెందులకు తరలిస్తున్నారు.

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే బీటెక్ రవి, ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అడ్డుకునే కార్యక్రమం మొదలుపెట్టారు. రెండో రోజు నామినేషన్లు వేయడానికి మేము బయలుదేరుతుంటే పోలీసు అధికారులే మ.1.30 గం.కు రావాలని చెప్పారు. తీరా ఆ సమయానికి వెళ్లేందుకు సిద్ధమైతే పోలీసులే మమ్మల్ని అడ్డుకున్నారు. మా కౌన్సిలర్ అభ్యర్థులను పోలీసులే తీసుకెళ్లి నామినేషన్లు వేయించాలని కోరినా అంగీకరించలేదు. చివరకు 37 రౌండ్ల కాల్పులు జరిపి, పొగ బాంబులు, బాష్పవాయువు ప్రయోగించి, లాఠీచార్జి చేసి మా వారిని అడ్డుకున్నారు. మహిళా అభ్యర్థులను సైతం నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారు. నామినేషన్లు వేయడానికి వచ్చిన అభ్యర్థులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే ప్రజాస్వామ్య హక్కులను కాలరాశారు. పులివెందులలో గతంలో 33 వార్డులు ఏకగ్రీవమయ్యాయని బీటెక్ రవి మాట్లాడుతున్నారు. అప్పట్లో విపక్షంలో ఉన్న వెన్నుపోటు పార్టీ స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస ప్రయత్నం కూడా చేయలేదు. ఘోర పరాజయం తప్పదని తెలుసు కాబట్టి, ఆ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ప్రకటించారు.

మరి అలాంటప్పుడు ఎన్నికలు ఏకగ్రీవం కాక మరేమవుతుంది? ఎన్నికల ప్రచారం సందర్భంగా కూడా మా కార్యకర్తలు, అభ్యర్థులపై దాడులు చేస్తున్నారు. మా కార్యకర్త సునీతకు చెందిన షాపును, హరిబాబుకు చెందిన రెండు బైకులను పెట్రోల్ పోసి తగులబెట్టారు. అందుకు సంబంధించిన వీడియో ఫుటేజ్‌లో నిందితులు స్పష్టంగా కనిపిస్తున్నారు. అయినా పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 33వ వార్డులో మా అభ్యర్థి నిరంజన్‌రెడ్డికి చెందిన ట్రక్కును, ఎస్టీ అభ్యర్థి అంజినప్ప బైకును తగులబెట్టారు. అంజినప్ప ఇంటిపై కూడా పెట్రోల్ పోశారు. గుడ్డునగరిగుట్టలో మా సీనియర్ కార్యకర్త నాగరాజుకు చెందిన ఎక్స్‌యూవీ వాహనాన్ని సైతం తగులబెట్టారు. ఇన్ని ఘటనలకు సంబంధించిన ఆధారాలు ఇచ్చినా నిందితులను కనీసం విచారణకు పిలవలేదు. మరోవైపు మా కార్యకర్తలపై 307 సెక్షన్ కేసులు పెడుతున్నారు. ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్నారు. అరెస్టులు, రిమాండ్లతో వేధిస్తున్నారు. మాపై దాడులు చేసిన వారిని వదిలేసి, బాధితులపైనే కేసులు పెట్టడం ఏ రకమైన న్యాయం? గత ఏడాది ఆగస్టులో జరిగిన పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో బయట ప్రాంతాల నుంచి వేలాది మందిని తీసుకొచ్చి స్థానిక ఓటర్లను, పోలింగ్ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఇప్పుడు కూడా అదే తరహా వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు, రాయచోటి ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనాన్ని తరలిస్తున్నారు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారికి లాడ్జిలు, ఫంక్షన్ హాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ వ్యవహారాలన్నీ సీఎంఓ రాజకీయ ఆదేశాలతో, డీజీపీ కార్యాలయం నుంచి వచ్చే సూచనలతో, డీఐజీ కోయ ప్రవీణ్ కనుసన్నల్లో జరుగుతున్నాయి. పోలింగ్ రోజున కూడా దొంగ ఓట్లు వేయించడం, నిజమైన ఓటర్లను పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ అక్రమాలను అడ్డుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)కు ఫిర్యాదు చేశాం. మరోవైపు హైకోర్టులో కూడా పిటిషన్ వేశాం. నిజమైన ఓటర్లు మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని, దొంగ ఓట్లు పూర్తిగా నిరోధించాలని కోరాం. అందుకు ప్రతి పోలింగ్ కేంద్రంలో పూర్తి స్థాయిలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలి. లైవ్ ఫుటేజ్ అందుబాటులో ఉంచాలి. పులివెందుల అభివృద్ధి, రైతుల సంక్షేమం విషయంలో వైఎస్సార్ చేసిన కృషి ప్రజలు ఒకసారి గుర్తు చేసుకోవాలి.

వారు ఈ ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకొచ్చి రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించారు. జగన్ గారు రూ.500 కోట్లతో నిర్మించిన మెడికల్ కాలేజీకి మంజూరైన 50 ఎంబీబీఎస్ సీట్లను కూటమి ప్రభుత్వం వద్దని కోరింది. సుమారు 8 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి, కాలనీల్లో రోడ్లు, విద్యుత్, తాగునీరు, బోర్‌వెల్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాం. కానీ, వెన్నుపోటు పార్టీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆ కాలనీల్లో ఒక్క రూపాయి పని కూడా చేయలేదు.

రైతుల కోసం రూ.25 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజ్‌ను కూడా వినియోగంలోకి తీసుకురాలేకపోయారు. వీటన్నింటినీ స్థానిక ప్రజలు గుర్తించాలి. పులివెందుల మున్సిపాలిటీని దొంగల చేతుల్లో పెట్టకుండా, వైఎస్సార్‌సీపీ చైర్‌పర్సన్ అభ్యర్థి ప్రమీలమ్మతో పాటు, పార్టీ పోటీ చేస్తున్న 20 వార్డుల్లో మా అభ్యర్థులను గెలిపించాలి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి బీటెక్ రవి ఆధ్వర్యంలో అక్రమ బెరైటీస్ మైనింగ్, ఇసుక అక్రమ తరలింపు జరుగుతోంది. కోట్లాది రూపాయల విలువైన బెరైటీస్ తవ్వకాలతో పాటు లక్షలాది ట్రిప్పుల ఇసుకను బెంగళూరుకు తరలిస్తున్నారు. ఈ వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, వెంటనే దీన్ని నిరోధించాలి. యథేచ్ఛ దోపిడి అరికట్టాలని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు.

సంక్షేమం అందించడంలో
టీడీపీ ప్రభుత్వం విఫలం

- ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని పాలన..
- వైకాపా అభ్యర్థులను గెలిపించండి

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఇందులో భాగంగా వైకాపా ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ నాయకులు గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లపూడి ఎంపీటీసీ-1 అభ్యర్థి మైగాపుల ఆంజనేయులు మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించామని, ప్రస్తుత టీడీపీ పాలనలో సంక్షేమ పథకాలకు కోత పడిందని విమర్శించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పనిచేసే అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థి జొన్నకూటి విజయలక్ష్మి విజయాన్ని కాంక్షిస్తూ నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుడా విజయరాజు, యడ్ల నాగబాబు, సిరా గంగారావు, తిగిరిపల్లి ప్రసాద్, ఒంబోలు పోసిబాబు, ఇర్లపాటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడిలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలపై సమన్వయ సమావేశం

ప్రజా భూమి, ప్రత్తిపాడు :

రౌతులపూడి మండల కేంద్రంలో స్థానిక ఎన్నికలకు సంబంధించి జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలపై గ్రామ నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే శ్రీమతి వరుపుల సత్యప్రభ రాజా పాల్గొని స్థానిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై గ్రామ నాయకులతో చర్చించారు. గ్రామ నాయకులు పైలా సాంబశివరావు, ఆయన కుమారులు పైలా వేణు, పైలా అశోక్, ఐటంశెట్టి భాస్కర్ బాబు, ఆయన కుమారుడు ఐటంశెట్టి అశోక్ తదితరులతో ఎమ్మెల్యే సమావేశమై ఎన్నికల అంశాలపై సమాలోచనలు జరిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపులో ఎటువంటి
పొరపాటు జరగకుండా శిక్షణ పూర్తి

ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఏలూరు నగరపాలక సంస్థ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా సిబ్బంది విధులు నిర్వర్తించేలా శిక్షణ అందించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక సర్. సి. ఆర్. రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల లో శుక్రవారం కౌంటింగ్ సూపెర్వైజర్లు, కౌంటింగ్ సిబ్బందికి ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ తో కలిసి సిబ్బందికి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ సీల్ తెరవడం, ఓట్ల లెక్కింపు, ఓట్ల చెల్లుబాటు పరిశీలన , తదితర అంశాలపై స్వయంగా అవగాహన కలిగించారు . ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కార్యక్రమంను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని, సిబ్బంది అందరూ మాస్టర్ ట్రైనర్లు అందించే శిక్షణను క్షుణ్ణంగా అర్థం చేసుకుని ఎక్కడా ఏ చిన్న పొరపాటుకు తావివ్వకుండా కౌంటింగ్ ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. ఓటు చెల్లుబాటుపై కౌంటింగ్ సూపెర్వైజర్, ఆఫీసర్ కి సమస్య ఎదురైతే వెంటనే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలలో సిబ్బందికి అవసరమైన వస్తువులు అధికారులు అందుబాటులో ఉంచుతారని, సిబ్బందికి ఎటువంటి వస్తువులను, సెల్ ఫోన్లను కౌంటింగ్ కేంద్రంలోని అనుమతించారని, వాటిని కౌంటింగ్ సెంటర్ బయట ప్రత్యేక కేంద్రంలో ఉంచాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ప్రతీ అంశాన్ని కౌంటింగ్ ఏజెంట్లు పరిశీలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ లను లెక్కించడం జరుగుతుందని, అనంతరం బ్యాలెట్ బాక్సులలో ఓట్లను ఎన్నికల కమిషన్ నిబందనల ప్రకారం లెక్కించాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్ల విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారు లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరాలలో పూర్తి భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం కౌంటింగ్ హాల్స్, టేబుల్స్ ఏర్పాటు, తదితర ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. అసిస్టెంట్ కలెక్టర్ సిహెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఏ . భానుప్రతాప్, కౌంటింగ్ అధికారులు, సూపెర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ పోరుకు తెర.. ప్రచారానికి బ్రేక్!

ప్రజాభూమి - ప్రత్తిపాడు

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. రాష్ట్రవ్యాప్తంగా సాయంత్రం 5 గంటలకు ప్రచార గడువు ముగిసింది. దీంతో ఏలేశ్వరం మున్సిపాలిటీలో గత కొన్ని రోజులుగా హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారానికి ముగింపు పడింది. చివరి రోజు అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటి ప్రచారం, రోడ్‌షోలు, బహిరంగ సభలతో ఏలేశ్వరం పట్టణం ఎన్నికల సందడితో మార్మోగింది. ప్రధాన పార్టీల నాయకులు సైతం తమ అభ్యర్థుల తరపున ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచార గడువు ముగియడంతో ఇక ఓటర్ల తీర్పుపై అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రచార సమయం ముగిసిన తర్వాత బహిరంగ ప్రచారం, లౌడ్‌స్పీకర్ల వినియోగంపై నిషేధం అమల్లోకి వచ్చింది.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

- నవంబర్ 1: ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్. - నవంబర్ 3: ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి.

మరోవైపు పోటీలో ఉన్న అభ్యర్థుల అఫిడవిట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. అభ్యర్థుల ఆస్తులు, కేసుల వివరాలను ఓటర్లు పరిశీలించుకునే అవకాశం కల్పించనున్నారు. ప్రచారం ముగియడంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేస్తూ, పోలింగ్ సామగ్రి తరలింపు ప్రక్రియ చేపట్టారు. ఇక ఓటరు మహాశయుల తీర్పు కోసం అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

గుంటుపల్లి ఎంపీటీసీ అభ్యర్థి అల్లూరి పెద్దిరాజు ఇంటింటి ప్రచారం

ప్రజాభూమి ప్రతినిధి, కామవరపుకోట

గుంటుపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసి అభ్యర్థిగా అల్లూరి పెద్దిరాజు గడప గడపకు ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలను కలుసుకుని గత వైసిపి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, పేదలకు అందించిన సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ శుక్రవారం ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, అందించిన సంక్షేమ పథకాలు ప్రజలు ఇంకా మర్చిపోలేదని ప్రజల్లో జగన్మోహన్ రెడ్డి పై ఉన్న అభిమానం మా గెలుపుకు కారణమవుతుందని ధీమా వ్యక్తంచేశారు. తమను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే వైసిపి కామవరపుకోట మండల జడ్పీటీసీ అభ్యర్థి దేవరపల్లి రాధిక గారిని కూడా అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులుగా తాము ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధికి సమన్వయంతో కృషి చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ నేనంటే పెద్ద ఎత్తున వైఎస్‌ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

ఒమ్మంగిలో కూటమి అభ్యర్థుల విస్తృత ప్రచారం!

- ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసిన ఎంపీటీసీ అభ్యర్థులు.. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి

ప్రజా భూమి, ప్రత్తిపాడు

ఒమ్మంగి గ్రామంలో కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం విస్తృతంగా కొనసాగుతోంది. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా బలపరిచిన ఒమ్మంగి ఎంపీటీసీ-1 అభ్యర్థి శ్రీమతి సుంకర గంగాభవాని, ఎంపీటీసీ-2 అభ్యర్థులు కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వీధిలో పర్యటిస్తూ ఓటర్లను నేరుగా కలుసుకుని తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఎన్నికల్లో ప్రతి ఓటరుకు రెండు ఓట్లు వేసే అవకాశం ఉందని వివరిస్తూ జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలోని స్థానిక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలపై ఓటర్లతో చర్చించారు. ప్రచారానికి వెళ్లిన అభ్యర్థులు, నాయకులకు పలుచోట్ల గ్రామస్థులు ఆత్మీయ స్వాగతం పలికారు. మహిళలు, యువకులు, పెద్దలు ప్రచారంలో పాల్గొని అభ్యర్థులతో మమేకమయ్యారు. ప్రతి ఓటరును నేరుగా కలుసుకుని తమ ఎన్నికల గుర్తులను పరిచయం చేస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. రానున్న ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి తమకు మద్దతు ఇవ్వాలని కూటమి అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో రామిశెట్టి మనసిబు, కొప్పన నాని, సత్యంశెట్టి సీతాబాబు, సుంకర చక్రరావు, సుంకర సోమరాజు, సుంకర గంగాభవాని, దొడ్డిపట్ల నాగేశ్వరరావు, ములికి గోవిందు, ములికి పెద్ద గోవిందు, జలతరపు సత్తిబాబు, ములికి నాగసూరి, సాధన అప్పన్న, గుర్రాల అర్జునుడు, సుంకర గంగాధర్ రామారావు, మామిడి నరసింహమూర్తి, నార్లంక చక్రరావు, దండు అన్నవరం, ముద్ద బుల్లబ్బాయి, కొప్పన గారాలు, సుంకర రాజబాబు, సుంకర బాబ్జి, రామిశెట్టి శ్యామల, కొప్పన సాయి, బీజేపీ నాయకురాలు ఉషారాణి, స్వాతి దేశెట్టి పెద్దకాపు, సుంకర రమణ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సేవలు అభినందనీయం

- విలేకరులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా రెయిన్‌కోట్లు పంపిణీ
- లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఇంజనీర్ బి. మోహన్

ప్రజా భూమి,ప్రత్తిపాడు

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకొస్తూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమని ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఇంజనీర్ బి. మోహన్ అన్నారు. వర్షం, ఎండ అనే తేడా లేకుండా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తూ సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఉచిత రెయిన్‌కోట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రత్తిపాడులోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు మొదటి విడతగా ఉచితంగా రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బి. మోహన్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ విధులు నిర్వహిస్తూ ప్రజలకు సమాచారాన్ని చేరవేస్తున్న విలేకరుల వృత్తి ధర్మానికి తమ వంతు సహకారం అందించాలనే సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థి, ఈఈ కె. వేణుగోపాల్ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సమాజంలో సేవాభావాన్ని పెంపొందిస్తూ ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బి. మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఇంజనీర్ బి. మోహన్, ఏడిద రెడ్డి నాయుడు, గొంప రామకృష్ణ, కె. సంజీవరావు, డి. సాకేత్ వర్మ తదితరులతో పాటు ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు, స్థానిక విలేకరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
శనివారం 31 అక్టోబరు 2026

అనంతపురం నగరంలోని...హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం నగర పాలక సంస్థ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ పి. జగదీష్ స్పష్టం చేశారు. ఈరోజు నగరంలోని కీలకమైన ఎన్నికల కేంద్రాలు, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి భద్రతా ఏర్పాట్లను లోతుగా పరిశీలించారు. ముందుగా ఎస్ ఎస్ బి ఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం, ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, తిరిగి స్వీకరణ, స్ట్రాంగ్ రూం భద్రత, ఓట్ల లెక్కింపు సమయంలో చేపట్టాల్సిన పోలీసు బందోబస్తు, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. స్ట్రాంగ్ రూం వద్ద నిరంతర పోలీసు పహారా, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ, అనుమతి ఉన్న వ్యక్తులనే లోపలికి అనుమతించడం, విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండటం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం... నగరంలోని హైపర్ సెన్సిటివ్‌గా గుర్తించిన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సందర్శించారు. శ్రీకృష్ణదేవరాయ పాఠశాల

-- విద్యుత్ నగర్ 49వ వార్డు సచివాలయం – – నాయక్ నగర్. మదర్ థెరిస్సా నగరపాలక ప్రాథమిక పాఠశాల – రామ్ నగర్, రాంబాబు మెమోరియల్ ప్రాథమిక పాఠశాల -- జనశక్తి నగర్. ఈ కేంద్రాల పరిసర ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలకు చేరుకునే మార్గాలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, వాహనాల రాకపోకలు, గతంలో చోటుచేసుకున్న ఎన్నికల సంబంధిత ఘటనలు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలను అందుబాటులో ఉంచాలి. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతర నిఘా కొనసాగించాలి. సమస్యాత్మక వ్యక్తులు, గతంలో ఎన్నికల సందర్భంగా గొడవలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలి. పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులుగా గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలి. పోలింగ్ కేంద్రాల లోపలికి అనుమతి ఉన్న వ్యక్తులను మాత్రమే అనుమతించాలి. నిషేధిత వస్తువులు లోపలికి తీసుకెళ్లకుండా తనిఖీలు చేపట్టాలి. సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా అవసరమైన ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి. ఏదైనా అవాంఛనీయ ఘటనకు ఆస్కారం కనిపించినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి తక్షణ చర్యలు చేపట్టాలి. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులు/ఎన్నికల సామగ్రి తరలింపు సమయం లోనూ పటిష్ట బందోబస్తు కొనసాగించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని, ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధులను పూర్తి బాధ్యతతో నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ గారితో పాటు అనంతపురం అర్బన్ డీఎస్పీ కరుణాకరరావు, సి.ఐ లు పుల్లయ్య, మస్తాన్, ఆర్ ఐ మధు, ఎస్సై గోపీ, తదితరులు వెళ్లారు.

ప్రజా "సేవకు"డు... మన "ముందుకు" జన వైద్యుడు

సామాజిక హితం.. తన అభిమతం

ఆశీర్వదించండి అంటున్న డాక్టర్ బాబన్..

ప్రజాభూమి ప్రతినిధి,
అనంతపురం (నంద్యాల)

నంద్యాల తెలుగుదేశం పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ బాబన్ వృత్తిరీత్యా వైద్యులు ప్రతిరోజూ ఎంతోమంది రోగుల బాధలను దగ్గరుండి చూసిన వ్యక్తి. శారీరక బాధను నయం చేసే డాక్టర్, రేపు మన నంద్యాల పట్టణ స్థానిక సమస్యలనే జబ్బులను కూడా అంతే నిబద్ధతతో నయం చేయగలరని మనం నమ్ముతున్నాము. ఆయనకు స్వార్థం లేదు, కేవలం ప్రజా సేవ చేయాలనే తపనతోనే మీ ముందుకు వచ్చారు. ప్రభుత్వ వైద్యుడిగా 40 సంవత్సరాలుగా సేవలందించి, నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి నందు సూపరిడెంట్ గా పదవీ విరమణ పొందారు. తక్కువ ఫీజులతో నిరుపేదల వైద్యుడుగా పేరుగాంచిన, ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తి, నిగర్వి, వివాద రహితుడు, స్నేహశీలి, అందిరికీ అందుబాటులో ఉండే వ్యక్తి డాక్టర్ పి. బాబన్ కూటమి తరుపున పురపాలక సంస్థ టి.డి.పి. పార్టీ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేయుచున్నారు. డాక్టర్ బాబన్ 77 సంవత్సరాల వయసులో కూడా యువకుడిలా ప్రచారం చేస్తున్నారు. ఓటు అనేది కేవలం ఒక గుర్తుపై వేసే ముద్ర కాదు, అది మన ఐదేళ్ల భవిష్యత్తును రాసుకునే ఒక పత్రం. నంద్యాల మున్సిపాలిటీలో మంచి రోడ్లు, పరిశుభ్రమైన డ్రైనేజీలు, నిరంతర తాగునీటి సరఫరా మరియు మెరుగైన వీధి దీపాల వంటి మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు దూదేకుల సర్దార్ వలి, పిఆర్ కొట్టాల దూదేకుల బాబా, మహమ్మద్, మౌలాలి, షేక్షావలి, సర్దార్ ప్ప, కలందర్, భాష, అబ్దుల్లా, నబీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ప్రచారంలో దూసుకుపోతున్న సైకిల్ తొట్ల అనురాధ

గెలుపే లక్ష్యంగా కూటమి నాయకుల ఇంటింటి ప్రచారం

సూపర్ సిక్స్ అమలు చేశాం.. అభివృద్ధి చేసి చూపించాం.. తొట్ల అనురాధ గెలిపించండి

ప్రజా భూమి శింగనమల

శింగనమల మండల కేంద్రంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆదేశాల మేరకు టీడీపీ బలపరిచిన -2 అభ్యర్థి తొట్ల అనురాధను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ కూటమి నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామంలోని పలు వీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలుసుకుని కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తోందని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, యువతకు ఉద్యోగాలు, మహిళలకు ఆర్థిక భరోసా వంటి సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. మాటలతో కాదు.. చేతలతో చేసి చూపించాం. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని చూసి ఓటు వేయండి అంటూ ప్రజలను కోరారు.రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీటీసీ– 2అభ్యర్థి తొట్ల అనురాధను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న స్వతంత్ర అభ్యర్థి యం పెద్దన్న

సిలిండర్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి

ప్రజాభూమి శింగనమల

శింగనమల మండలంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న ఏం. పెద్దన్న ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలుస్తూ తనను ఆదరించి ఓటు వేయాలని కోరుతున్నారు. ఎన్నికల్లో తనకు కేటాయించిన సిలిండర్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి తన అభ్యర్థిత్వాన్ని పరిచయం చేసుకుంటూ ప్రచారం కొనసాగిస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఎన్నికల సిబ్బంది

-హిందూపురం మండలంలో 34 పోస్టల్ బ్యాలెట్లు పోలింగ్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మండల పరిధిలో నిర్వహిస్తున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బంది శుక్రవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడంలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 34 పోస్టల్ బ్యాలెట్లు పోలైనట్లు ఎంపీడీవో దామోదరమ్మ వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

-ఎన్నికల విధుల్లో 1,500 మంది పోలీసులు-సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా-జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఎన్నికల బందోబస్తు వివరాలను ఎస్పీ మీడియాకు వివరించారు. నవంబర్ 1వ తేదీ ఆదివారం శ్రీ సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి, హిందూపురం, కదిరి, పెనుకొండ, మడకశిర, ధర్మవరం మున్సిపాలిటీల పరిధిలో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టినట్లు శుక్రవారం ఎస్పీ వెల్లడించారు. ఎన్నికల బందోబస్తు విధుల కోసం సుమారు 1,500 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలను సాధారణ, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా విభజించి, ఆయా ప్రాంతాల పరిస్థితులకు అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా సివిల్ పోలీసులతో పాటు ఏఆర్, ప్రత్యేక పోలీసు బృందాలు, ఏపీఎస్పీ బలగాలను ఎన్నికల విధుల్లో మోహరించనున్నట్లు వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక పోలీసు బృందాలు, రూట్ మొబైల్స్, 61 స్ట్రైకింగ్ ఫోర్సులతో నిరంతరం గస్తీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్సులను కూడా సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిలో భాగంగా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163, పోలీసు చట్టంలోని సెక్షన్ 30తో పాటు 144 సెక్షన్ నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఆంక్షలు విధించినట్లు వెల్లడించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా అదనపు బలగాలను మోహరించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నికల సందర్భంగా బయటి వ్యక్తుల అక్రమ ప్రవేశాన్ని అరికట్టేందుకు, నగదు, మద్యం అక్రమ రవాణాను నియంత్రించేందుకు సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాలను సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించనున్నట్లు స్పష్టం చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించడం, ఘర్షణలు సృష్టించడం, అల్లర్లకు పాల్పడటం వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల అక్రమాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సంఘటనలు ఏవైనా తమ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు జిల్లా పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.

ఇంటర్ పరీక్ష ఫీజుల దోపిడీని అరికట్టాలి

-అధికంగా వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి-పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు బాబావలి

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజుల పేరుతో కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే మూడింతలు అధికంగా వసూలు చేస్తున్నాయని, ఈ అక్రమ వసూళ్లతో విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు బాబావలి ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్ష ఫీజుల పేరుతో జరుగుతున్న విద్యార్థుల దోపిడీని తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హిందూపురం పట్టణంలో నిర్వహించిన విద్యార్థి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యను వ్యాపారంగా మార్చి, పరీక్షల పేరుతో విద్యార్థుల నుంచి ఇష్టానుసారంగా అదనపు మొత్తాలు వసూలు చేయడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన పరీక్ష ఫీజుల కంటే అధికంగా వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. జిల్లాలోని ఇంటర్మీడియట్ అధికారులు తక్షణమే స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని కోరారు. విద్యార్థుల నుంచి అదనంగా వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన కళాశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్ణయించిన పరీక్ష ఫీజుల వివరాలను ప్రతి కళాశాలలో విద్యార్థులకు కనిపించే విధంగా స్పష్టంగా ప్రదర్శించాలని కోరారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే విద్యార్థులు, తల్లిదండ్రులు మరింత ఆర్థిక భారాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ పట్టణ నాయకులు అనుదీప్, నాగేంద్ర, ఆకాష్, నంజుండేశ్వర, అనిల్, వలిసాబ్, సురేష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి మరోసారి అవకాశం ఇవ్వండి..

- కూటమి అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి
- హిందూపురాన్ని రాష్ట్రంలోనేఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతాం
- బహిరంగ సభలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం అభివృద్ధికి ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపట్టామని, రానున్న రోజుల్లో మరింత వేగంగా అభివృద్ధి చేసి చూపిస్తామని శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. పట్టణ ప్రజలు కూటమి అభ్యర్థులకు అండగా నిలిచి గెలిపిస్తే అభివృద్ధి బాధ్యతను తాము తీసుకుంటామని భరోసా ఇచ్చారు. తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి హిందూపురాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. పురపాలక సంఘ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పురిడి మంజునాథ్‌తో కలిసి నిర్వహించిన రోడ్‌షో అనంతరం ఎన్టీఆర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణంలోని వాల్మీకి సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు నిర్వహించిన రోడ్‌షోకు వేలాదిమంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. వాల్మీకి సర్కిల్ వద్ద ఎండీఎస్ బ్రదర్స్ ఇదాయతుల్లా, ఇందాద్ ఆధ్వర్యంలో బాలకృష్ణకు భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రారంభమైన రోడ్‌షో పట్టణ ప్రధాన వీధుల మీదుగా ఉత్సాహంగా సాగింది. బాలకృష్ణను చూసేందుకు ప్రజలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావడంతో పట్టణంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, హిందూపురం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక

ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపట్టామని, వాటిని పూర్తిచేసి మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ సదుపాయాలను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి అభ్యర్థులకు ప్రజలు తమ ఓటుతో మద్దతు పలకాలని కోరారు. అనంతరం చైర్మన్ అభ్యర్థి పురిడి మంజునాథ్ మాట్లాడుతూ, తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. బాలకృష్ణ నాయకత్వంలో ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాజకీయాలకు అతీతంగా పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని, యువతను ప్రోత్సహించడంతో పాటు వ్యాపార, వాణిజ్య వర్గాలకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని చెప్పారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ సేవలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ హిందూపురాన్ని మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. అధికారం కోసం కాకుండా ప్రజలకు జవాబుదారీతనంతో సేవ చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు అనిల్‌కుమార్, రావిళ్ల లక్ష్మి, డిఈ రమేష్‌కుమార్, జనసేన నాయకులు ఉమేష్, బీజేపీ నాయకులు ఆదర్శ్‌కుమార్, లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ పరిగి వేణుగోపాల్‌రావు, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, నాయకులు డైమండ్ బాబా, షఫీవుల్లా, రమేష్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ అశ్వర్థరెడ్డితో పాటు కూటమి నాయకులు, కౌన్సిలర్ అభ్యర్థులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పులివెందులలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న టీడీపీ - దొంగ ఓట్లకు కుట్ర

ఏ మొహం పెట్టుకొని పులివెందుల ప్రజలను ఓట్లు అడుగుతావు

నామినేషన్ల నుండి ప్రచారం వరకు అడుగడుగునా కుట్రలు చేసిన టీడీపీ : ఎంపీ అవినాష్ రెడ్డి

ప్రజాభూమి, పులివెందుల:
పులివెందుల మున్సిపల్ ఎన్నికల వేళ అధికార టీడీపీ అరాచకాలకు పాల్పడుతోందని వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బాక్రాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. పులివెందుల లో టీడీపీ నిర్వహించిన ప్రచార సభ అట్టర్ ఫ్లాప్ అయిందని ఎద్దేవా చేశారు. సభకు స్థానికంగా జనం రాకపోవడంతో జమ్మలమడుగు, కమలాపురం నుంచి జనాలను తరలించారని, దీన్ని బట్టే పులివెందు లలో టీడీపీ పరిస్థితి ఏంటో అర్థమవుతోందన్నారు. 30 నెలల పాలనలో పులివెందులకు ఒక్క రూపాయి అభివృద్ధి చేయని బీటెక్ రవి "ఒక అవకాశం ఇవ్వండి" అని అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్రం 50 సీట్లు మంజూరు చేస్తే మెడికల్ కాలేజీనే వద్దన్న వ్యక్తి ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. హౌసింగ్ కాలనీల్లో కనీసం ఒక్క పని కూడా చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబు ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. పులివెందులలో వైసీపీ అభ్యర్థుల దుకాణాలు, వాహనాలపై దాడులు చేసి భయభ్రాం తులకు గురిచేస్తున్నారని, సీసీ ఫుటేజ్ ఆధారాలున్నా పోలీసులు టీడీపీ నాయకులను అరెస్ట్ చేయడం లేదని మండిపడ్డారు. నామినేషన్ల ప్రక్రియ నుంచే కుట్ర మొదలైందన్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు నామినే షన్లు వేసుకోవచ్చని చెప్పి, అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయానికి వచ్చాక అనుమతించలేదని, ఇప్పుడు ప్రచారం చేస్తున్న వారి ఆస్తులపై కూడా దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత కీలకమైన ఆరోపణ చేసిన అవినాష్ రెడ్డి, పోలింగ్ రోజున బయటి ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనాలను తీసుకొచ్చి దొంగ ఓట్లు వేయించేందుకు టీడీపీ కుట్ర పన్నుతోందన్నారు. ఇందుకు డీఐజీ కోయ ప్రవీణ్ పూర్తిగా సహకరిస్తున్నారని సంచలన ఆరోపణ చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని, ప్రజలంతా టీడీపీ అరాచకాలను గమనించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

ప్రకృతి సేద్యంలో కడప రైతుల విజయ పతాకం

హైదరాబాద్‌లో "కిసాన్ మహారాజ్ అవార్డ్స్-2026 -- బద్వేలు, చెన్నూరు రైతులకు ఉత్తమ రైతు పురస్కారాలు

ప్రజాభూమి,కడప
ప్రకృతి వ్యవసాయం విధానంలో అద్భుత ఫలితాలు సాధించిన జిల్లా రైతులు పొరుగు రాష్ట్రంలోనూ గుర్తింపు పొందారు. అక్టోబర్ 29న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో వీష్ టీవీ నిర్వ హించిన "కిసాన్ మహారాజ్ అవార్డ్స్-2026" కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఇద్దరు రైతులకు ఉత్తమ రైతు పురస్కా రాలు దక్కాయి. బద్వేలు మండలం అబూసాహెబ్‌పేటకు చెందిన శ్రీ రాధాకృష్ణ గౌగుల, చెన్నూరు మండలం బాలసింగయ్యపల్లికి చెందిన శ్రీ దండిబోయిన బాలాజీ ఈ అవార్డులు అందుకున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి, కరివేపాకు, పసుపు పంటల సాగులో సాధించిన అత్యుత్తమ దిగుబడులు, సమర్థవంతమైన యాజమాన్య పద్ధతులకు గుర్తింపుగా వారికి ఈ పురస్కారం లభించింది. అవార్డుతో పాటు రూ. 5000 నగదు చెక్కును కూడా అందజేశారు. అనివార్య కారణాల వల్ల శ్రీ బాలాజీ స్వయంగా హాజరు కాలేకపోవడంతో ఆయన తరఫున కొండా రెడ్డి అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా కడప జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ ఎస్.వి. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, రసాయన ఎరువులు, పురుగుమందులు లేకుండా తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని మన రైతులు నిరూపించారని, ఈ అవార్డులు జిల్లా ప్రకృతి వ్యవసాయ రైతులందరికీ స్ఫూర్తినిస్తాయని అన్నారు. అవార్డు గ్రహీతలకు రైతు సాధికార సంస్థ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

అమ్మా చౌడమ్మా కరుణించవమ్మ

ప్రజాభూమి,పులివెందుల
పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ శ్రీ శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శుక్రవారము పురస్కరించుకుని ఉదయాస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ విశేష పంచామృతాభిషేకం, కుంకుమార్చ న ,మహా మంగళహారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం విశేష అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు, అమ్మవారిని దర్శించిన వారికి సకల నరఘోష తొలగి జన,ధన ఆకర్షణ శక్తి పెరుగుతుంది అని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయున ఉదయం 10.30 నిమిషములకు రాహుకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భముగా ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ ,అర్చకులు ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ కష్టాలలో ఉన్నపుడు శుక్రవారము లేదా పౌర్ణమి అమావాస్య రోజున 108 ప్రదక్షిణములు చేసి అమ్మని వేడుకుంటే కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకము,.ఆలయ ప్రాంగణం మొత్తము అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- దోమల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి- సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య

ప్రజాభూమి, వేంపల్లె
స్థానిక పట్టణంలోని ఆర్ఎంఎస్ వీధిలో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫ్రైడే - డ్రై డే కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటా జ్వరాల సర్వే, లార్వా నిర్మూలన చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి ఫక్రుద్దీన్, హెల్త్ సూపర్వైజర్ అంకయ్య స్థానిక ప్రజలకు సీజనల్ వ్యాధులు, దోమల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం సిద్దయ్య మాట్లాడుతూ దోమల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. దోమల కాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. ఇళ్లలోని నీటి తొట్టెలు, డ్రమ్ములు, పూల కుండీలు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీటి పాత్రలను వారానికి ఒకసారి శుభ్రం చేయాలని సూచించారు. ఫక్రుద్దీన్ మాట్లాడుతూ రాత్రివేళల్లో దోమతెరలు ఉపయోగించాలని, శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలని కోరారు. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. అంకయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిచ్చి మొక్కలు పెరగకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే దోమల రహిత సమాజాన్ని సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శివలక్ష్మి, ఆశా కార్యకర్తలు నాగేశ్వరి, శోభారాణి, సునీత, రాజకుమారి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారుల మధ్య మాజీ సర్పంచ్ జన్మదిన వేడుకలు

- భవిత కేంద్రంలో కేక్ కట్ చేసి.. చిన్నారులకు భోజనం, వాటర్ బాటిళ్లు, విద్యా సామాగ్రి పంపిణీ

ప్రజాభూమి, వేంపల్లె
స్థానిక భవిత దివ్యాంగ వనరుల కేంద్రంలో మాజీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కేంద్రంలోని చిన్నారులకు భోజనంతో పాటు వాటర్ బాటిళ్లు, విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవాలనే ఉద్దేశంతో చిన్నారుల మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి, వారికి అవసరమైన వస్తువులను అందజేస్తూ అభిమానులు ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్. వేణుగోపాల్, కసిరెడ్డి ఆదినారాయణరెడ్డి, సింగారెడ్డి భరత్ కుమార్ రెడ్డి, భూషణం, నాగేష్, బ్రహ్మానంద కుమార్, ఆదినారాయణ, లోకేష్, రాహుల్, ఐఈఆర్టి లు యశోద, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అనాధ వృద్ధులకు అన్నదానం

- వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేసిన వైసీపీ నేతలు

ప్రజాభూమి, వేంపల్లె
స్థానిక మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ అనాధ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు వైసీపీ రాష్ట్ర యువనేత రాచినేని వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం మాజీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం అన్నదానంతో పాటు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. తమ అభిమాన నేత జన్మదిన వేడుకలను అనాధ వృద్ధుల మధ్య నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. రాచినేని శ్రీనివాసులు నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని భగవంతుడిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి ఆది నారాయణ రెడ్డి, నాయకులు భరత్ కుమార్ రెడ్డి, భూషణం, నాగేష్, బ్రహ్మానంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ అభ్యర్థి లక్ష్మీదేవి ముమ్మర ప్రచారం

- ఓటర్లను కలిసిన ఎన్డీఏ కూటమి నాయకులు.. గాజు గ్లాస్ గుర్తుపై ఓటేయాలని విజ్ఞప్తి



ప్రజాభూమి, వేంపల్లె:
ఎన్డీఏ కూటమి బలపరిచిన జనసేన పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి బెస్త లక్ష్మీదేవి శుక్రవారం స్థానిక పట్టణంలోని గాంధీ రోడ్డు, అమ్మవారిశాల వీధి, గాండ్ల వీధి తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ఆమెకు మద్దతుగా ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, మండల కన్వీనర్ రామముని రెడ్డి, పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్తలు డా. హరీష్, దాసరి రవిశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థి బెస్త లక్ష్మీదేవికి గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. అభ్యర్థి విజయానికి కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గాలి హరిప్రసాద్, సుష్మ, పుష్పలత నాయక్, శివకృష్ణ రెడ్డి, పీవీ రమణ, నామా వేమకుమార్, మహమ్మద్, చైతన్య కుమార్, ఇస్మాయిల్, ఫయాజ్, నాగ సుబ్బారాయుడు, మనోజ్, నాగేంద్ర, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల ఇంటింటి పర్యటన

ప్రజాభూమి, పుట్లూరు.
ఎన్నికల ప్రచారంలో భాగంగా పుట్లూరు మండల కేంద్రంలో కూటమి అభ్యర్థి పెద్దయ్య గారి కళ్యాణి శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ తమకు అవకాశం కల్పించాలని ప్రజలను అభ్యర్థించారు. కూటమి అభ్యర్థి పెద్దయ్య గారి కళ్యాణి నాయకులు, కార్యకర్తలతో కలిసి వార్డులోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. తనను గెలిపిస్తే వార్డులో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులతో కలిసి వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలను నేరుగా కలుసుకుంటూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

స్మార్ట్ కిచెన్‌లో డీఈఓ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రమైన సిద్ధవటంలోని స్మార్ట్ కిచెన్ కేంద్రాన్ని శుక్రవారం డీఈఓ షంషుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాల పరిసరాలు, భోజన తయారీ విధానం, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిరోజూ రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతిష్టాత్మకంగా స్మార్ట్ కిచెన్ కేంద్రాలను ప్రారంభించిందని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి విద్యార్థికి పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. గత గురువారం చోటుచేసుకున్న సంఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆహార తయారీ, పంపిణీలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీలో కడప డీఆర్డీఏ పీడీ ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి అరుణ, ఏపీఎం సుజాత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, స్మార్ట్ కిచెన్ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీకొని డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ప్రజాభూమి, సిద్ధవటం: కడప-చెన్నై జాతీయ రహదారిపై సిద్ధవటం మండలంలోని జేఎంజే కళాశాల సమీపంలో గురువారం రాత్రి రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఓ లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. రేణిగుంట నుంచి నాగ్‌పూర్‌కు ఇనుము లోడుతో వెళ్తున్న లారీ, పూణే నుంచి ఉల్లిపాయల లోడుతో వస్తున్న మరో లారీ జేఎంజే కళాశాల సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ షేక్ అంజాద్ భాష ఎడమ కాలుకు బలమైన గాయాలై రక్తస్రావమైంది. వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న సిద్ధవటం మండల ఎస్సై హారిక ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదంపై విచారణ చేపట్టారు. ఈ ఘటనలో స్థానిక పోలీసులు పాల్గొని వివరాలు సేకరించారు.

వెంకటయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

ప్రజాభూమి , సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతిపురం ఎస్వీబీవీడీ సభ ఎలిమెంటరీ అండ్ హైస్కూల్‌లో పాఠశాల వ్యవస్థాపకులు, అధ్యక్షులు, ఉప్పరపల్లికి చెందిన శ్రీ మేరువ దాసయ్యగారి వెంకటయ్య వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.డి. మధుసూదన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు వెంకటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మేనల్లుడు కాసల సుబ్బయ్య మాట్లాడుతూ వెంకటయ్య విద్యాభివృద్ధికి, సమాజ సేవకు చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు.

21 నెలల సంకష్ట చవితి పూజలకు మహిళా మండలి సంకల్పం

- శ్రీ వాసవి దేవస్థానంలో మహా గణపతికి ప్రత్యేక పూజలు

ప్రజాభూమి, వేంపల్లె
ప్రథమ పూజలు అందుకునే శ్రీ మహా గణపతికి 21 నెలలపాటు సంకష్ట చవితి పూజలు నిర్వహించాలని ఆర్యవైశ్య మహిళా మండలి సంకల్పించినట్లు మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రీ వినాయకస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో స్వామివారికి అభిషేకం, అర్చన, గరికతో అష్టోత్తరం, కథాశ్రవణం, సామూహిక సంకష్ట చవితి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బారావు, శ్రీ వాసవి కల్యాణ మండపం సభ్యులు, మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభయ ఆంజనేయ స్వామి విగ్రహ,ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం

ప్రజాభూమి, సిద్ధవటం: కడప--చెన్నై జాతీయ రహదారిపై బొగ్గిడి వారిపల్లె పంచాయతీ పరిధిలోని గంగానగర్ గ్రామంలో శుక్రవారం అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు సురేష్ కుమార్ శర్మ మాట్లాడుతూ.. పరాభవ నామ సంవత్సర పంచమి శుక్రవారం సందర్భంగా అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని యంత్ర ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కలశ పూజ, అగ్ని హోమాలు, యంత్ర హోమం తదితర విశేష పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి చాముండేశ్వరి పేట గ్రామానికి చెందిన పుల్లారెడ్డి, మాచుపల్లి గ్రామానికి చెందిన మల్లు పెద్ద వెంకట సుబ్బారెడ్డి తదితరులు సహకారం అందించారని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలను గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాకాడు లో టీడీపీ అభ్యర్థుల ఇంటింటి ప్రచార హోరు

వేర్వేరు సెగ్మెంట్లలో పర్యటించిన బత్తిన ప్రమీల, దువ్వూరు జనార్దన్ రెడ్డి.. సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థన

ప్రజా భూమి ప్రతినిధి,వాకాడు

వాకాడు స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా వాకాడు మండలంలో తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థులు వేర్వేరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వాకాడు-1 ఎంపీటీసీ అభ్యర్థి, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బత్తిన ప్రమీల, నెల్లిపూడి ఎంపీటీసీ అభ్యర్థి దువ్వూరు జనార్దన్ రెడ్డి తమ తమ సెగ్మెంట్లలో పర్యటిస్తూ ఓటర్లను కలిశారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తమను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా బత్తిన ప్రమీల మాట్లాడుతూ ఎంపీటీసీ ఎన్నికల్లో తనతోపాటు జడ్పీటీసీ అభ్యర్థికి కూడా ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. పార్టీ అభ్యర్థులకు ప్రజల మద్దతు తెలిపి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు నెల్లిపూడి ఎంపీటీసీ అభ్యర్థి దువ్వూరు జనార్దన్ రెడ్డి కూడా తన సెగ్మెంట్ పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ భార్గవ్, మాజీ ఎంపీపీ పల్లాపల్లి వెంకటేశ్వర్లు, టీడీపీ సీనియర్ నాయకుడు హరీష్ నాయుడు, అన్నమేటి బాలసుబ్రమణ్యం, ఏం.బేటి పోలయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ ఆర్ కె హెల్త్ సెంటర్ ను ప్రారంభోత్సవం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి దంపతులు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

పట్టణంలోని కొత్తపేట (గర్ల్స్ హైస్కూల్ సమీపంలో) కొండుగారి రామమూర్తి కుమార్తె డాక్టర్ మృదుల,డాక్టర్ ఎం.వి.ఎస్. రాజు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ ఆర్ కె హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి దంపతులు హాజరై సంస్కర్ జ్యోతి ప్రజ్వలన చేసి హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, కొండు శ్రీరామమూర్తి నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమై ఉంటారని, ఆయన సేవా గుణాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఆయన కుమార్తెలు కూడా వైద్య రంగం ద్వారా ప్రజలకు సేవ చేయడానికి ముందుకు రావడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఈ నూతన హెల్త్ సెంటర్ ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు పటాన్ ఫరీద్, బుల్లెట్ జయశ్యం రాయల్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి మేయర్ అభ్యర్థి జేబీ శ్రీనివాస్ విజయాన్ని ఆకాంక్షిస్తూ శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సుడిగాలి ప్రచారం

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

సహచర శాసనసభ్యులు, జిల్లా పార్లమెంట్ అధ్యక్షురాలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి తిరుపతి వీధుల్లో నిర్వహించిన భారీ ర్యాలీ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా సాగింది. పార్టీ శ్రేణులు, వేలాది మంది అభిమానులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో తిరుపతి పురవీధులన్నీ పసుపుమయంగా మారాయి. ర్యాలీ అనంతరం వివిధ డివిజన్లలో ఇంటింటి ప్రచారం చేపట్టిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కూటమి తరఫున పోటీ చేస్తున్న కార్పొరేటర్ అభ్యర్థులకు, మేయర్ అభ్యర్థి జేబీ శ్రీనివాస్ కి మద్దతుగా ఓటర్లను నేరుగా కలిసి ఓట్లను అభ్యర్థించారు. ప్రజల నుంచి ఎమ్మెల్యేకి బ్రహ్మరథం పడుతూ ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రసంగిస్తూ శ్రీవేంకటేశ్వర స్వామి వారి పాదాల చెంత ఉన్న ఆధ్యాత్మిక నగరం తిరుపతి సమగ్ర అభివృద్ధి సాధించాలంటే అది కేవలం మన కూటమితోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక శోభ దెబ్బతినకుండా, నగరవాసులకు మౌలిక వసతులు కల్పిస్తూ తిరుపతిని మోడల్ సిటీగా తీర్చిదిద్దే సత్తా కూటమి పాలనకే ఉందన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరించి, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసేందుకు మన కూటమి అభ్యర్థులకు ఒక్కసారి అవకాశం ఇచ్చి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన తిరుపతి ప్రజలను ఆత్మీయంగా కోరారు.

సి.కె పల్లి పంచాయతీ టిడిపి అభ్యర్థులు విస్తృత ప్రచారం

టిడిపిని ఆదరించండి సైకిల్ గుర్తుకు ఓటెయ్యండి

ప్రజా భూమి ప్రతినిధి
రామచంద్రపురం



రామచంద్రపురం మండలంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని జడ్పీటీసీ సభ్యుడు మేకల తిరుమలరెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం సీకే పల్లె పంచాయతీలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు మేకల తిరుమలరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మాధవయ్య ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మేకల తిరుమలరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రామచంద్రపురం మండలంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సుమారు నాలుగు కోట్ల రూపాయలతో మండలంలో రహదారుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఈ ఎన్నికల్లోనూ తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోహన్ బాబు యూనివర్సిటీలో ఘనంగా ప్రారంభమైన మోహన మంత్ర..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

చంద్రగిరి మండలం, ఏ.రంగంపేట సమీపంలోని మోహన్ బాబు యూనివర్సిటీలో శుక్రవారం మోహన్ మంత్ర కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ టెక్నో ఫెస్టివల్ లో వివిధ రాష్ట్రాల నుంచి భారీగా విద్యార్థులు తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ పివి రమణ మాట్లాడుతూ విద్యార్థులలో మల్టీ డైమెన్షనల్ నైపుణ్యాలను పెంపొందించేందుకు ఛాన్సలర్ మంచు మోహన్ బాబు, ప్రో చాన్సలర్ మంచు విష్ణు యూనివర్సిటీ స్థాయిలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యను కరిక్యులర్, కో-కరిక్యులర్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ అనే మూడు ప్రధాన విభాగాలుగా విభజించి బోధిస్తున్నామని వెల్లడించారు. రెగ్యులర్ కార్యకలాపాలతో పాటు విద్యార్థులలోని సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను వెలికితీసేందుకు 'మోహన్ మంత్ర' పేరుతో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక వేదిక ద్వారా విద్యార్థులు తమ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించేందుకు వివిధ అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం కేవలం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడమే కాకుండా, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను నేర్పించడం, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వారి ప్రతిభను ప్రోత్సహించడం అని స్పష్టం చేశారు. అలాగే ప్రముఖ కార్పొరేట్ సంస్థలను ఆహ్వానించి ప్రాంగణంలో స్టాల్స్ ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. అర్హులైన విద్యార్థులు వారి నైపుణ్యాల ఆధారంగా ఈ కంపెనీల ద్వారా పెయిడ్ ఇంటర్న్‌షిప్‌లను పొందే అవకాశం కల్పించామని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆటోమేటిక్‌గా ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని వెల్లడించారు. పలు పేరుగాంచిన ఎంఎన్‌సీ కంపెనీలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యాయని, భవిష్యత్‌లో మరిన్ని కంపెనీలు తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నాయని తెలిపారు. ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. హౌ అనంతరం రిజిస్ట్రార్ సారథి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి, వారి ప్రతిభను ప్రదర్శించడానికి ఒక గొప్ప వేదికను ఏర్పాటు చేశామని, ఇది టెక్నికల్, కల్చరల్, మేనేజ్‌మెంట్ రంగాల్లో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని సమావేశంలో తెలిపారు. ఈసారి ప్రత్యేకంగా మల్టీనేషనల్ కంపెనీల సహకారంతో హ్యాకథాన్‌లు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు ఇచ్చే ప్రాబ్లమ్ సొల్యూషన్స్‌ని బట్టి వారికి నేరుగా ఉద్యోగాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో ఫ్యాకల్టీ ప్రమేయం లేకుండా పూర్తిగా విద్యార్థులే మేనేజ్‌మెంట్ స్కిల్స్‌తో మొత్తం వ్యవహారాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారని వెల్లడించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా వేలాదిగా విద్యార్థులు పాల్గొంటున్నారని, విజేతలకు లక్షకు పైగా నగదు బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు. వెలుపలి ప్రాంతాల నుంచి కూడా సుమారు పది వేలకు పైగా ఎంట్రీలతో విశేష స్పందన లభించిందని, ముఖ్యంగా బాలికలు ఇతర విద్యాసంస్థల నుంచి వచ్చి ఈ వేడుకలను తిలకించడం విశేషమని పేర్కొన్నారు. నా పేరు కౌశిక్, సత్యభామ యూనివర్సిటీ, చెన్నై. తిరుపతిలోని మోహన్ బాబు యూనివర్సిటీలో జరుగుతున్న 'యుక్తి 2026' హాకాథాన్‌లో పాల్గొనేందుకు ఇక్కడకు వచ్చాను. ఇది నా మొదటి హాకాథాన్, మంచి అనుభూతిని ఇస్తుంది. ఇక్కడ అద్భుతమైన మౌలిక వసతులు ఉన్నాయి, జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. ఐదు థీమ్స్‌తో కూడిన ఈ ఈవెంట్ యువత తమ నూతన ఆలోచనలను ప్రదర్శించడానికి మరియు ప్రతిభను నిరూపించుకోవడానికి ఒక గొప్ప వేదిక.

భద్రతా ప్రమాణాలు పాటిస్తూ బాణాసంచా దుకాణాలు ఏర్పాటు

నవంబర్ 1వ తేదీలోపు లైసెన్స్ దరఖాస్తులు సమర్పించాలి-చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు

నవంబర్ 5వ తేదీ సాయంత్రంలోపు లైసెన్సుల పంపిణీ పూర్తి- చిత్తూరు డిఎస్పి

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు: రాబోయే దీపావళి పండుగను పురస్కరించుకుని టపాసుల (బాణసంచా) దుకాణాల ఏర్పాటుకు సంబంధించి లైసెన్సుల జారీ ప్రక్రియపై ఆర్డీవో శ్రీనివాసులు మరియు డీఎస్పీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో స్థానిక వ్యాపారులతో చిత్తూరు ఆర్డీవో కార్యాలయంలోని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల ఏర్పాటుకు అనువైన స్థలాలు, మార్కెట్ ప్రాంతాలు, వ్యాపార నిర్వహణ, గతంలో మంజూరైన అనుమతులు, లేఅవుట్ ఏర్పాట్లు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా =ఋూ మాట్లాడుతూ, ప్రతి టపాసుల దుకాణానికి, మరో దుకాణానికి మధ్య కనీసం మూడు అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. లైసెన్స్ కోసం దరఖాస్తుదారులు మీ సేవ కేంద్రాల ద్వారా చలానా చెల్లించడంతో పాటు జీఎస్టీకి సంబంధించిన ప్రక్రియను కూడా పూర్తి చేయాలన్నారు. ఎవరి పేరు మీద లైసెన్స్ అవసరమో వారే నవంబర్ 1వ తేదీలోపు తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. వివిధ మండలాల నుంచి దుకాణాలు ఏర్పాటు చేయనున్న వ్యాపారులు తమ దుకాణాల ఖచ్చితమైన లొకేషన్ వివరాలను సంబంధిత అధికారులకు అందజేయాలన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం నవంబర్ 5వ తేదీ సాయంత్రంలోపు లైసెన్సుల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. డి.ఎస్.పి మాట్లాడుతూ టపాసుల దుకాణాల వద్ద రద్దీని నియంత్రించేందుకు అవసరమైన బారికేడింగ్ ఏర్పాటు చేసుకోవాలని, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి సమయాల్లో, పెట్రోల్ బంకుల సమీపంలో టపాసుల దుకాణాలకు అనుమతులు మంజూరు చేయబడవని స్పష్టం చేశారు. మున్సిపల్, పోలీస్ శాఖల మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటిస్తూ, ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అధికారులకు సహకరించాలని డీఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో ఫైర్ డిపార్ట్మెంట్ కరుణాకరన్, మున్సిపల్ డిపార్ట్మెంట్ వారు ఏడి మార్కెటింగ్ వారు మరియు చిత్తూరు రూరల్, ఎస్ఆర్ పురం, పూతలపట్టు, బంగారుపాళ్యం, యాదమరి ఎంఆర్ఓలు పాల్గొన్నారు.

జడ్పీటీసీ బరిలో సుజాతకు జైకొట్టండి..

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట మండలం కృష్ణాపురంలో వైఎస్సార్‌సీపీ నేతల స్థానిక సంస్థల ప్రచారంలో భాగంగా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేసిన స్థానిక నాయకులు. ప్రచారంలో పాల్గొన్నమాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఎన్నికల. రేణిగుంట మండల జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన గంగారి సుజాత (గంగారి రమేష్ సతీమణి) విజయమే లక్ష్యంగా ఆ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రేణిగుంట మండలం కృష్ణాపురం గ్రామంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ప్రచార కార్యక్రమంలో పాల్గొని ప్రజలను కలిసి గంగారి సుజాతకు మద్దతు కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. జడ్పీటీసీ ఎన్నికల్లో గంగారి సుజాతకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమవుతోందని, ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు పొందేందుకు ప్రయత్నిస్తోందని వారు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే ప్రజలకు మరింత మెరుగైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రేణిగుంట మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గంగారి సుజాతను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గంగారి రమేష్, తిరుమల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించండి....

-గ్రామాల అభివృద్ధి అభివృద్ధి చేసి చూపిస్తాం- టిడిపి నాయకులు.

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం

మండలంలో స్థానిక పోరులో జడ్పిటిసి ఎంపీటీసీలుగా పోటీ చేస్తున్న టిడిపి అభ్యర్థుల సైకిల్ గుర్తుకు ఓట్లేసి గెలిపించండి గ్రామాలను అభివృద్ధి చేసి చూపిస్తామని మాజీ ఎంపీపీ డివిందు మాధవి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు ప్రకాష్ యాదవ్, టిడిపి మహిళా అధ్యక్షురాలు ఎద్దుల గుణసుందరులు ఓటర్లను కోరారు. శుక్రవారం బీరమాకుల కండ్రిగలో టిడిపి ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థుల ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో మండలంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు స్థానిక ఎన్నికలలో ఎంపీటీసీ, జడ్పిటిసి టిడిపి అభ్యర్థులను ఆదరించి సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు. రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ డైరెక్టర్ ఎన్ చిన్నబాబు కోరారు. ఎంపీటీసీ అభ్యర్థిని కుమ్మర కౌసల్య మాట్లాడుతూ మీ బిడ్డను.... సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్ల దేవుళ్లకు పాదాభివందనాలు చేశారు. గ్రామాలలో టిడిపి ప్రచారానికి ప్రజలు కర్పూర హారతులు పట్టారు. అందరికీ అందుబాటులో ఉంటా..... ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. మూడేళ్ల ఓటమి ప్రభుత్వ పాలల్లో ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని...... ఇంకా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మన అందరివాడు.... రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి జడ్పిటిసి అభ్యర్థి మేకల తిరుమలరెడ్డి సైకిల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించి ఓటర్లను అభ్యర్థించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని నిరంతరం అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కార దిశగా కష్టపడి పని చేసి ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారని గుర్తు చేశారు. టిడిపి ప్రచార కార్యక్రమానికి ప్రజలు, ఓటర్ల నుండి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో బొడ్డు సోము రాయల్, బొడ్డు మధు రాయల్, కే గోపాల్ రెడ్డి, ఎల్ రూపు రాయల్, బండి విజయ్ కుమార్ రెడ్డి, ఆవుల సిద్ధయ్య యాదవ్, బాలచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, అప్పిలి బాలకృష్ణ, మూర్తి, పి వెంకటేష్ నాయుడు, గుర్రం దేవరాజులు రెడ్డి, నరేష్ రెడ్డి, స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

పల్లెల్లో 'ఫ్యాన్' జోరు!-మండలంలో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థుల విస్తృత ప్రచారం

ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రాపురం:

స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల వ్యాప్తంగా వైఎస్ఆర్‌సీపీ జోరు పెంచింది. గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యాను గుర్తు వేడి రాజేస్తోంది. శుక్రవారం మండలంలోని దేశూరి కండ్రిగ, సొరకాయలపాలెం, అనుపల్లి సెగ్మెంట్లలో పార్టీ నేతలు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొని ఉధృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ అభ్యర్థి ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఎంపీటీసీ అభ్యర్థులు బొజ్జ నందిని, మునెమ్మ, దొరస్వామి, కర్ణ వారి వారి సెగ్మెంట్లలోని పల్లె పల్లెనా విస్తృతంగా పర్యటించి ఇంటింటికీ వెళ్లారు. వైఎస్ఆర్‌సీపీకి మద్దతుగా 'ఫ్యాను' గుర్తుపై ఓటు వేసి తమను వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష..

ప్రచారంలో భాగంగా నాయకులు మాట్లాడుతూ... గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో అందించిన విప్లవాత్మక సంక్షేమ పథకాలు ప్రతి ఇంట్లోనూ వెలుగులు నింపాయని గుర్తుచేశారు. జగనన్న పాలనలో సంక్షేమ ఫలాలు పొందిన ప్రజలంతా వైఎస్ఆర్‌సీపీ వైపే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే స్థానిక పోరులో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థులకు ఓటేసి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో పాల్గొన్న నాయకులకు, అభ్యర్థులకు గ్రామాల్లో ప్రజలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు.

ప్రజల మనిషి ధనంజయ రెడ్డి... గెలిపించండి, అభివృద్ధికి బాటలు వేయండి..!

ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి: రాష్ట్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసకర పాలన సాగిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని టీడీపీ యూనిట్ ఇంచార్జ్ లోకేష్ రాయల్, బూత్ ఇన్‌చార్జి కడియాల రవితేజ యాదవ్ అన్నారు. చంద్రగిరి గ్రామపంచాయతీ 4వ సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థిగా కూటమి తరపున పోటీ చేస్తున్న సక్కూరు ధనంజయ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం రెండో రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రగిరిలోని రెడ్డివీధిలో సక్కూరు ధనంజయ రెడ్డి నిర్వహించిన ప్రచార

కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ లోకేష్ రాయల్ పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా ధనంజయ రెడ్డికి మంచి గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఎవరైనా సమస్యతో ఆయనను ఆశ్రయిస్తే వెంటనే స్పందించి, పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తారని కొనియాడారు. ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునే ఇలాంటి నాయకులను స్థానిక సంస్థల్లో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. చంద్రబాబు నాయుడు రాష్ట్రస్థాయిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కొనసాగాలంటే కూటమి అభ్యర్థులకు ప్రజలు తమ అమూల్యమైన ఓటును వేయాలని కోరారు. నాలుగో సెగ్మెంట్‌లో సక్కూరు ధనంజయ రెడ్డికి మద్దతుగా నిలిచి, అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వినోద్ ,మహేష్ ,పాకాల సతీష్ ,సాయి ,మురళి తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనపాకంలో వైఎస్సార్ సిపి గెలుపు కోసం ఇంటింట ప్రచారం

- గతంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేసి గెలిపించాలని కోరిన అభ్యర్థి!

ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి: స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో భాగంగా చంద్రగిరి మండలం, పనపాకం పంచాయతీ గడ్డక్రిందపల్లె, తూర్పుపల్లె, తువ్వసేను వారిపల్లె, ఇర్వెశెట్టివారిపల్లె గ్రామాల్లో వైఎస్సార్ సిపి, జడ్పీటీసీ అభ్యర్థి కొటాల పద్మజ,ఎంపిటిసి అభ్యర్థి బొజ్జా కోమల లను గెలిపించాలని పార్టీ శ్రేణులు ఇంటింట ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఎన్నికల వేడి ఒక్కసారిగా రాజుకుంది,పార్టీ నాయకుల నినాదాల నడుమ ప్రచార పర్వం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. గడ్డక్రిందపల్లె, తూర్పు పల్లె,తువ్వసేనువారిపల్లెలకు గత ప్రభుత్వంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సహకారం తో జాతీయ రహదారి నుంచి గ్రామాలలోకి సిమెంటు రోడ్లు,గ్రామంలో అభివృద్ధి పనులు వేశామని, తమను గెలిపిస్తే ఇంకా అభివృద్ధి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం మూడు సంవత్సరాలలో పంచాయతీ లో ఏమి అభివృద్ధి చేశారో చెప్పి

ఓట్లు అడగాలన్నారు. గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలతో ప్రచారం నిర్వహించారు. తూర్పు పల్లెలో గంగమ్మ ఆలయంలో కొబ్బరికాయలు కొట్టి ప్రచారాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సిపి జెడ్పీటీసీ అభ్యర్థి కొటాల పద్మజ, ఎంపీటీసీ అభ్యర్థి బొజ్జా కోమలను గెలిచాని గ్రామంలో నాయకులు, కార్యకర్తల భారీ ర్యాలీతో గ్రామంలో ఇంటింటికి, విస్తృత ప్రచారం చేపట్టారు. అడుగడుగునా ఘన స్వాగతం ఇంటింట ప్రచారం లో భాగంగా గ్రామంలో అడుగుపెట్టిన అభ్యర్థికి గ్రామస్తులు, మహిళలు మంగళహారతులు పట్టారు, గత ప్రభుత్వంలో తాము చేసిన గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం,చూసి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్ సిపి శ్రేణుల ఐక్యత, గ్రామస్తుల స్పందనతో గడ్డక్రిందపల్లె, తూర్పుపల్లె, తువ్వసేనువారిపల్లె, ఇర్వెశెట్టివారిపల్లె, గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి హేమేంద్రకుమార్ రెడ్డి, మట్టా మధుసూదన్ రెడ్డి, బొజ్జావెంకటరత్నం,కసా గోపాల్, సిహెచ్ రెడ్డెప్ప,అమాస నాగేశ్వరరావు, సుభాషిణి, మాతయ్య,బొజ్జా ఆనంద, అభ్యర్థి బొజ్జా కోమల, దూర్వాసులు,అమాస భాస్కర్, రాము, గురుస్వామి, పురుషోత్తం,పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

చంద్రగిరి 1వ వార్డులో ముమ్మర ప్రచారం: సైకిల్ గుర్తుకు ఓటేసి గురునాథం రెడ్డిని గెలిపించండి!

కూటమి ముఖ్య నేతలతో కలిసి ఇంటింటి ప్రచారం..

ఎమ్మెల్యే పులివర్తి నాని నమ్మకాన్ని నిలబెడతా: ఎంపీటీసీ అభ్యర్థి ఉగ్రాణం గురునాథం రెడ్డి..

ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి: చంద్రగిరి పట్టణంలోని 1వ సెగ్మెంట్ ఎంపీటీసీ కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న ఉగ్రాణం గురునాథం రెడ్డి తరఫున కూటమి నాయకులు విస్తృత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి సెగ్మెంట్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి 'సైకిల్' గుర్తుకు ఓటు వేసి, ఆయనను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఉగ్రాణం గురునాథం రెడ్డి మాట్లాడుతూ.. తనపై పూర్తి విశ్వాసంతో ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాన్ని కల్పించిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలుతెలిపారు. ప్రత్యక్ష ఎన్నికల బరిలో మొదటిసారి నిలిచిన తనకు 1వ సెగ్మెంట్ ఓటర్లే బలమని, అందరికీ అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు.ఈ ప్రచారకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గౌస్ బాషా, మాజీ జడ్పీటీసీ రమేష్ రెడ్డి, రమణమూర్తి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు లంకెల లలిత, శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పాలకమండలి సభ్యులు డిష్ గోపి, శంకర్, ప్రసాద్, చోటి, రామానుజన్ కుమార్ గౌడ్ మని,పట్టణ ప్రముఖులు, మహిళా నేతలు, భారీ సంఖ్యలో కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి దిగజారుడు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు

-న్యాయమే అంతిమంగా గెలుస్తుంది..

-రౌడీయిజాన్ని ఓడించాలి - బండి దీప్తి

ప్రజాభూమి ప్రతినిధి, కడప అర్బన్

కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న అణిచివేత, దౌర్జన్య రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప మేయర్ అభ్యర్థి బండి దీప్తి అన్నారు. శుక్రవారం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఎదుర్కోలేక కూటమి ప్రభుత్వం పోలీసు, రెవెన్యూ అధికారులను ఉపయోగించుకుని ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. గత పది రోజులుగా సుమారు 300 మంది అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, ప్రత్యర్థినిలో ఎలాంటి తప్పులు లేకపోయినా అధికార దుర్వినియోగంతో పలు వార్డులను ఏకగ్రీవం చేసుకున్నారని విమర్శించారు. కడప నగరాన్ని గతంలో వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అభివృద్ధి చేశారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని ఆరోపించారు. నిధులను అమరావతికి తరలిస్తున్నారే తప్ప కడప అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ప్రజలు ఆదివారం జరిగే ఎన్నికల పోలింగ్‌లో తప్పనిసరిగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, న్యాయాన్ని గెలిపించి రౌడీయిజాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎక్కడైనా అన్యాయం, అణిచివేత ఎదురైతే 8328127251 నంబర్‌కు ఫోన్ చేయాలని, ఐదు నిమిషాల్లో స్పందిస్తామని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని బండి దీప్తి కోరారు. అలాగే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్ ఛార్జి లు తదితరులు పాల్గొన్నారు.

వైకాపా అభ్యర్థుల ఇంటింటా ప్రచారం

వాకాడు పట్టణంలోని పలు కాలనీల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వాకాడు మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వాకాడు ఎంపీటీసీ సెగ్మెంట్ అభ్యర్థులు గూడూరు సుధా, సంగీతం మానస ఆయా ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. వాకాడు టెంకాయ తోపు కాలనీ, బంగ్లా సెంటర్, రెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కరపత్రాలను పంపిణీ చేసి, తమ అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తమను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైసీపీ నాయకులు నేదురుమల్లి బాబు రెడ్డి, నెల్లూరు పెంచల్ రెడ్డి, వాకాటి రవికుమార్, బండి ప్రభుచరణ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తలు కూడా ప్రచారంలో పాల్గొన్నారు.

పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలి

- మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలి

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట మండలం గాజుల మన్యం (రూరల్),ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు హెల్త్ సూపర్వైజర్ కామరాజు విద్యార్థులు- మానసిక ఆరోగ్యం మరియు పొగాకు ఉత్పత్తుల వాడకం-దుష్ప్రభావాలు పై గాజుల మన్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పొగాకు ఉత్పత్తులైన చుట్ట,బీడీ, సిగరెట్,జర్దా,గుట్కా మావా,ఖైని తదితర పదార్థాలు,గాంజా వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. పొగాకు వినియోగం నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు,శ్వాసకోశ సమస్యలకు కారణమవుతుందని తెలిపారు. చిన్న వయస్సులోనే చెడు అలవాట్లకు బానిసలైతే భవిష్యత్తు ఆరోగ్యం దెబ్బతింటుందని, విద్యార్థులు పొగాకు ఉత్పత్తులకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుల ఒత్తిడి,పరీక్షల భయం,కుటుంబ సమస్యలు,స్నేహితులతో తలెత్తే విభేదాలు వంటి కారణాలతో మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందని వివరించారు.మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానంగా ముఖ్యమైనదని, మనసులోని బాధలను దాచుకోకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన వ్యక్తులతో పంచుకోవాలని సూచించారు.ప్రతిరోజూ వ్యాయామం,యోగా, ధ్యానం,క్రీడలు,మంచి నిద్ర, పోషకాహారం అలవాటు చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలిపారు. ఆందోళన,నిరాశ, ఒంటరితనం వంటి సమస్యలు ఎక్కువకాలం కొనసాగితే నిపుణుల సలహా తీసుకోవాలని సూచించారు.విద్యార్థులు తమ జీవితంలో మంచి లక్ష్యాలను ఏర్పరచుకుని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.పొగాకు రహిత సమాజ నిర్మాణంతో పాటు మానసికంగా ఆరోగ్యవంతమైన యువతను తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆశాకార్యకర్త ఛాముండేశ్వరి పాల్గొన్నారు.

మద్యం దుకాణాల మూసివేత

- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సుమిత్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:

చిత్తూరు జిల్లాలో అర్బన్ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలను మూసివేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు జరిగే మున్సిపల్ ప్రాంతాలు మరియు వాటి పరిధిలోని 5 కిలోమీటర్ల ప్రాంతాల్లో మద్యం విక్రయాలపై నిషేధం అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల పోలింగ్ దృష్ట్యా 30-10-2026 సాయంత్రం 5.00 గంటల నుంచి 01-11-2026 వరకు మద్యం విక్రయాలు పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు. అదేవిధంగా, నవంబర్ 2వ తేదీన రీపోలింగ్ నిర్వహించాల్సి వస్తే ఆ రోజున కూడా, నవంబర్ 3వ తేదీన ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు మద్యం విక్రయాలపై నిషేధం అమలులో ఉంటుందని తెలిపారు. ఈ నిషేధం లిక్కర్ షాపులు, బార్లు, మిలిటరీ క్యాంటీన్లు, ఐఆ-1 లైసెన్సులు, కల్లు దుకాణాలు (ఐఆ, ఐఫ్), డిస్టిలరీలు మరియు బ్రూవరీలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత మద్యం దుకాణాలు, సంస్థల యజమానులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రచారం.. దూసుకుపోతున్న రవితేజ రెడ్డి

జడ్పీటీసీ అభ్యర్థి భారతి యాదవ్ కు మద్దతుగా నల్గొండవారిపల్లె, యర్రబల్లె తాండాలో విస్తృత ప్రచారం

అంగన్వాడీ టీచర్ విజ్ఞప్తికి తక్షణ స్పందన..

చిన్నారుల కోసం టిప్పర్ ఇసుక పంపిణీ

ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల మండలంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి అజ్జుగుట్టు రవితేజ రెడ్డి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇ.కొత్తపల్లె మాజీ సర్పంచ్ గంగాధర్ యాదవ్ సతీమణి, పులివెందుల మండల జడ్పీటీసీ కూటమి అభ్యర్థి బొంగాని భారతి యాదవ్ కి మద్దతుగా నల్గొండవారిపల్లె, యర్రబల్లె తాండా గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, సైకిల్ గుర్తుకు ఓటు వేసి భారతి యాదవ్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రవితేజ రెడ్డి కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో పులివెందుల మండల టీడీపీ అధ్యక్షుడు మర్రెల జగన్మోహన్ రెడ్డి, ఇ.కొత్తపల్లె ఎంపీటీసీ పుష్పనాథ్ రెడ్డి, పుష్పగిరి స్కూల్ కరస్పాండెంట్ ఓబుల్ రెడ్డి, యోగానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మానవత్వానికి నిదర్శనంగా నిలిచిన ఘటన నిన్న చోటుచేసుకుంది. జడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అంగన్వాడీ టీచర్ కళావతి, పాఠశాలలో చిన్నారులు ఆడుకునే ఆటస్థలానికి ఇసుక అవసరమని రవితేజ రెడ్డి ని కోరారు. వెంటనే స్పందించిన రవితేజరెడ్డి, ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఒక టిప్పర్ లారీ ఇసుకను ఏర్పాటు చేసి పంపించారు. చిన్నారుల సౌకర్యంకోసం తక్షణమే స్పందించి సాయం అందించడం పట్ల అంగన్వాడీ సిబ్బంది, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఓటరు ఓటు హక్కును విని యోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు: రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన ఓటు హక్కును ప్రతిఒక్క ఓటరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఓటర్లకు పిలుపునిచ్చారు. నవంబర్ 1న జరిగే జీవీఎంసీ ఎన్నికలకు ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో పేరున్నవారు ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల ఐడెంటిటీ కార్డులలో ఏదైనా ఒక ఐడెంటిటీ కార్డు తీసుకుని పోలింగ్ స్టేషన్ కు వెళ్లాలని స్పష్టం చేశారు. పోలింగ్ బూత్ వద్ద రెండు బ్యాలెట్ పత్రాలు ఇస్తారని, పింక్ కలర్ మేయర్ అభ్యర్థి, తెలుపు రంగు బ్యాలెట్ కార్పొరేటర్ అభ్యర్థి ఓటింగ్ కోసం ఇవ్వడం జరుగుతుందని, ఓటు వేసిన తర్వాత రెండు బ్యాలెట్ పత్రాలను ఒకే బ్యాలెట్ బాక్సులో వేయాలని తెలిపారు. జీవీఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా , పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగిందని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఓటరు తీసుకెళ్లవలసిన ఐడెంటిటీ కార్డు: ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, పాస్ పోర్ట్, పోస్టాఫీసు పాస్ బుక్, ఉపాధి హామీ వేతన జాబ్ కార్డ్, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, పెన్షన్ డాక్యుమెంట్, సర్వీస్ ఐడి కార్డు, ఎన్ పి ఆర్ స్మార్ట్ కార్డ్, ఎం.పి, ఎం ఎల్ ఏ, ఎం ఎల్ సి లకు జారీ చేసిన అఫిషియల్ ఐడి కార్డు, వికలాంగుల కార్డ్ లలో ఏదైనా ఒక కార్డును తీసుకువెళ్లాలని తెలిపారు.

టీడీపీ ఇన్‌చార్జి సూర్యనారాయణరెడ్డికి ఘన సత్కారం

మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పూలమాలతో సన్మానం

కొత్త తరంగం పోరుమామిళ్ల అక్టోబర్ 30 :

బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, డీసీసీ బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డిని రంగసముద్రం-2 ఎంపీటీసీ నారోజు లక్ష్మీశ్వరమ్మ, బీడీపీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డికి శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు నారిసెట్టి నాగేంద్ర, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చెన్నయ్య, మండల అధ్యక్షుడు తమ్మిశెట్టి రమణయ్య, కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, కాశినాయన మండల బీజేపీ నాయకురాలు చింతలచెరువు స్వప్నలత పాల్గొన్నారు. అలాగే టీడీపీ నాయకులు అంబవరం వెంకటరెడ్డి, బత్తల బ్రహ్మయ్య, బీజేపీ నాయకులు వెంకటేశ్వరాచారి, శేషాచారి, మణి విష్ణు ఆచారి, మనోహరాచారి, బ్రహ్మచన్ రాయుడు ఆచారి, మునయ్యాచారి, శ్రీనివాసాచారి, వెంకటసుబ్బయ్య చారి, గోవిందమ్మ, పద్మావతమ్మ, లక్ష్మీనారాయణ, సుభాషిని, బీజేపీ కడప జిల్లా అధికార ప్రతినిధి నారోజు రమణాచారి, వెంకటసుబ్బయ్య రామస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు సూర్యనారాయణరెడ్డికి శాలువా, పూలమాలలతో సత్కరించి తమ అభిమానం, గౌరవాన్ని చాటుకున్నారు. పలువురు టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా సాగింది.

ప్రజాభూమి

జనరల్ 10

శనివారం 31 అక్టోబరు 2026

పోస్టల్ బ్యాలెట్ సదుపాయ కేంద్రం ఏర్పాటు..

ప్రజా భూమి యల్లనూరు

యల్లనూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆరోఒ హర్షద్ వలి ఎంపీడీవో మనోహర్ బాబు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వివిధ శాఖల కు సంబంధించిన అధికారులు, ఎలక్షన్ డ్యూటీకి వెళ్ళవలసిన వారు తమ ఓట్లను పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటర్లు వినియోగించు కోవడానికి వీలుగా మూడు రోజులపాటు ఎంపీడీవో కార్యాలయంలో అందుబాటులో ఉంచామన్నారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇరువురు అధికారులు తెలిపారు.

పుట్లూరు మండలం అరకటవేముల గ్రామంలో

వైయస్ఆర్సీపీ తరపున ప్రచారం చేసిన సిపిఐ మండల కార్యదర్శి డి పెద్దయ్య

ప్రజాభూమి, పుట్లూరు.

స్థానిక ఎన్నికల ప్రచారంలో భాగంగా అరకటవేముల గ్రామంలో వైఎస్ఆర్సీపీ ఎంపీటీసీఅభ్యర్థి లోడుగు కుల్లాయమ్మ, జడ్పిటిసి అభ్యర్థి మిద్దె నారాయణస్వామి తరపున ఇంటింటా ప్రచారం నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా పెళ్లి పందిరిలో పెళ్ళికొడుకు కూడా ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థి తో కలిసి అభ్యర్థించడం జరిగినది. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి డి, పెద్దయ్య పాల్గొని వైయస్సార్ పార్టీ అభ్యర్థులకి సంపూర్ణ మద్దతు తెలుపుతు సిపిఐ పార్టీ సభ్యులు ప్రజలను కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. సిపిఐ నాయకులు, బాలరాముడు, వెంకటనారాయణ, సత్యనారాయణ, బాల లక్ష్మన్న, పెద్దిరాజు, వైయస్సార్ నాయకులు హరికృష్ణ రెడ్డి, లుడుగు ఆదినారాయణ, రామయ్య, కుమార్, నరసింహులు, శిరిడి, లక్ష్మీనారాయణ, కాలేశ్వరుడు, రఘు రాముడు, డి మారితి కుమార్, వైయస్సార్ పార్టీఇతర నాయకులు ఇంటింట ప్రచారంలో పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగినది.

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసిన ఎంపీడీవో అలివేలమ్మ

ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలంలో జెడ్పిటిసి మరియు ఎంపీటీసీ ఎన్నికలలో భాగంగా పుట్లూరు మండలంలోని మండల పరిషత్ కార్యాలయం నందు పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ను శుక్రవారం,, శనివారం మరియు ఆదివారం ఈ మూడు రోజులు పోస్టల్ బ్యాలెట్ నందు ఓటు ను వినియోగించుకొనుటకు ఎంపీడీవో కార్యాలయంలో ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్, ఎంపీడీవో ఏర్పాటు చేయడం జరిగింది.

-ప్రజలతో మమేకమవుతూ.. గెలుపే లక్ష్యంగా ప్రచారం

-వార్డుల్లో కూటమి అభ్యర్థుల ఇంటింటి పర్యటన

ప్రజాభూమి, హిందూపురం టౌన్

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా హిందూపురం పట్టణంలోని వార్డుల్లో కూటమి అభ్యర్థులు మంచాల రూప, మంచాల మారుతి తదితరు శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, బాలయ్య అభిమానులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ తమకు అవకాశం కల్పించాలని ప్రజలను అభ్యర్థించారు. 51వ వార్డు కూటమి అభ్యర్థి మంచాల రూప నాయకులు, కార్యకర్తలతో కలిసి వార్డులోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. తనను గెలిపిస్తే వార్డులో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా 49వ వార్డు కూటమి అభ్యర్థి మంచాల మారుతి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శేఖర్‌తో కలిసి వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలను నేరుగా కలుసుకుంటూ వారి సమస్యలను తెలుసుకున్నారు. తనకు అవకాశం కల్పిస్తే వార్డును సమగ్రంగా అభివృద్ధి చేసి పురపాలక సంఘంలోనే ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తానని వివరించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి వార్డుకు కొత్త రూపు తీసుకొస్తానని పేర్కొంటూ ఓటర్ల మద్దతు కోరారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బాలయ్య అభిమానులు పాల్గొన్నారు.

బావిలో పడి శవమై తేలిన పి ప్రదీప్

ప్రజా భూమి ప్రతినిధిరామచంద్రపురం

మండలంలోని నడవలూరు ఏ ఏ డబ్ల్యూ గ్రామానికి చెందిన ప్రేమల ప్రదీప్ (31) బావిలో పడి శవమైతెలిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రేమల ప్రదీప్, 27వ తారీఖున రాత్రి 8 గంటలకు ఇంటిలోనుండి అలిగి బయటకు వచ్చేసాడు. ప్రేమలో ప్రదీప్ మూర్చ వ్యాధితో బాధపడుతూ ఉండేవాడు ఈనేపద్యంలో రామాపురం సమీపంలోని తిరుపతి- పచ్చికాపలం ప్రధాన రహదారి పక్కనున్న తిరుమలరెడ్డి వ్యవసాయ బావి వద్ద కాలుజారి బావిలో పడి మృతి చెందాడు. మూడు రోజులుగా ప్రేమల ప్రదీప్ కనిపించడం లేదని కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికా సాగారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు బావిలో శవం ఉందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై భక్తవత్సలం తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రేమల ప్రదీప్ మృతదేహాన్ని బావిలో నుండి బయటకు తీశారు. ప్రేమల ప్రదీప్ తల్లి మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భక్తవత్సలం తెలిపారు.

గెలుపే లక్ష్యంగా కూటమి నేతల ప్రచార జోరు

గంగాయిపల్లె, రెడ్డిపల్లె, రామాపురం గ్రామాల్లో జనసేన జడ్పీటీసీ అభ్యర్థి విద్యావతికి మద్దతుగా విస్తృతంగా ఇంటింటి ప్రచారం

ప్రజాభూమి పోరుమామిళ్ల :

కడప జిల్లా కలసపాడు మండలంలో పరిషత్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. గెలుపే లక్ష్యంగా కూటమి నాయకులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ జనసేన జడ్పీటీసీ అభ్యర్థి భావనాసి విద్యావతికి మద్దతుగా గ్రామాల్లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని గంగాయిపల్లె, రెడ్డిపల్లె, రామాపురం గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పర్యటిస్తూ ఓటర్లను నేరుగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ అభ్యర్థి భావనాసి విద్యావతి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. రానున్న ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని, ప్రజాసేవకు అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలను తెలుసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని వివరించారు. తనపై నమ్మకం ఉంచి ఆశీర్వదించాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కమలాపురం మాజీ ఎమ్మెల్యే పుత్తా నరసింహారెడ్డి, బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, డీసీసీ బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి పాల్గొని జనసేన అభ్యర్థి విద్యావతికి మద్దతుగా ఓటర్లను అభ్యర్థించారు. కూటమి నాయకులు సమష్టిగా పనిచేసి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రతి ఓటరును కలిసి కూటమి అభ్యర్థికి మద్దతు కూడగట్టేందుకు నాయకులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. అలాగే రాష్ట్ర రోడ్డు రవాణా డైరెక్టర్ రంతు, ఎంపీపీ ముట్టే చెన్నయ్య, టీడీపీ నాయకులు ప్రహ్లాదరెడ్డి, దుగ్గిరెడ్డి బాలిరెడ్డితో పాటు పలువురు కూటమి నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీల్లో పర్యటిస్తూ ప్రజలను కలుసుకున్న నాయకులు జనసేన అభ్యర్థి విద్యావతికి అండగా నిలవాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొనడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. కూటమి నేతల సమష్టి ప్రచారంతో అభ్యర్థి విజయానికి మరింత బలం చేకూరుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కలసపాడు మండలంలో కూటమి నేతలంతా ఒక్కతాటిపైకి వచ్చి ప్రచారాన్ని వేగవంతం చేయడంతో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.

పులివెందుల నీళ్లకు చిరునామా చంద్రబాబే : బీటెక్ రవి, ఆదినారాయణ రెడ్డి

హామీ ఇచ్చాం.. నీళ్లు ఇచ్చాం.. చేసి చూపించాం - కేసుల్లో ఉన్న మీ దగ్గర నీతి పాఠాలు వినాలా? - అవినాష్ ఉన్న చోట వినాశనమే

ప్రజాభూమి, పులివెందుల:

పులివెందులకు తాగు, సాగునీరు అందించింది చంద్రబాబేనని, ఎర్రబెల్లి చెరువుకు నీరు ఇస్తామన్న ఎన్నికల హామీని నెరవేర్చి చూపించామని టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి స్పష్టం చేశారు. వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న అవినాష్ రెడ్డి నుంచి తాము నీతులు వినాల్సిన అవసరం లేదని మండిపడ్డారు. పులివెందుల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థి కొండారెడ్డితో కలిసి వారు మీడియా సమావేశం నిర్వహించారు.మున్సిపల్ ఎన్నికలకు, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధం లేదని, ఎర్రబెల్లి చెరువుకు నీరు అందిస్తామని జడ్పీటీసీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఎన్నికల తర్వాత నెరవేర్చామని తెలిపారు. పోలీసుల సహాయంతో లాడ్జీలు, వసతి గృహాలు పొందాల్సిన దౌర్భాగ్య పరిస్థితి తమకు లేదని, అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ తమను అనేక విధాలుగా ఇబ్బంది పెట్టినా ధైర్యంగా ఎదుర్కొని నిలబడ్డామని అన్నారు.సొంత బాబాయి సంతాప సభను కూడా అడ్డుకున్న చరిత్ర వైసీపీదని, సింహాద్రిపురంలో దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి నామినేషన్ పత్రాలు చించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 80% తమకే ఉందని వైసీపీ చెప్పుకోవడం హాస్యాస్పదమని, గత ఎన్నికల్లో టీడీపీకి 27% ఓట్లు వచ్చాయన్న కనీస జ్ఞానం కూడా అవినాష్ రెడ్డికి లేదని ఎద్దేవా చేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మారుస్తుంటే హార్టికల్చర్ అంటే అర్థమే తెలియని మీరు విమర్శిస్తారా అని ప్రశ్నించారు. పేదల టిడ్కో ఇళ్లను ఆపేసిన ఘనత జగన్ దేనని, సొంత చెల్లిని పక్కన పెట్టి రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలను ఆదుకుంటామనడం హాస్యాస్పదమని అన్నారు. చికెన్ లో కమీషన్లు, చీనీ పంటల్లో సూట్ విధానం పెట్టి ప్రజలను దోచుకున్నారని ఆరోపించారు. 1996 ఎన్నికల్లో తృటిలో గెలిచింది మీరేనని, వివేకానంద రెడ్డి హత్యను గుండెపోటుగా చిత్రీకరించిన చరిత్ర మీదేనని ధ్వజమెత్తారు. "మీరే కాదు, మేమూ అన్నింటికీ తెగించే వచ్చాం.. అవసరమైతే మోచేతి వరకు చేతులు మడతపెడతాం" అని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీతో పాటు 11 ఎమ్మెల్యే సీట్లు కూడా వైసీపీ కోల్పోతుందని జోస్యం చెప్పారు. వివేకా హత్య ఎవరు చేశారో సునీతమ్మను అడిగితే తెలుస్తుందని అన్నారు. చంద్రబాబు అభివృద్ధి నినాదంతోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిస్తామని, పులివెందులలో వైఎస్ కంచుకోటను బద్దలు కొట్టబోతున్నామని, పులివెందులలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించే రోజులు దగ్గరపడ్డాయని స్పష్టం చేశారు.

రెండు ఓట్లు.. ఓటర్లు అప్రమత్తంగా ఉండాలి

-ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్-ఓటరు స్లిప్పులు, ప్రత్యేక యాప్‌తో పోలింగ్ కేంద్రం వివరాలు

-మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రజాభూమి, హిందూపురం టౌన్

మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి ఓటరు రెండు ఓట్లు వేయాల్సి ఉంటుందని, ఓటు వేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సూచించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, చివరి సమయం వరకు వేచి చూడకుండా ఉదయమే ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఓటు ఏ వార్డులో, ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకునేందుకు బీఎల్ఓల ద్వారా ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ రూపొందించిన ప్రత్యేక యాప్‌లో ఓటరు గుర్తింపు కార్డు నంబరు లేదా పేరు నమోదు చేసి పోలింగ్ కేంద్రం వివరాలు, చిరునామా తెలుసుకోవచ్చన్నారు.

తెలుపు, గులాబీ రంగుల్లో బ్యాలెట్ పత్రాలు

ఈసారి చైర్‌పర్సన్ ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరుగుతున్నందున ప్రతి ఓటరు వార్డు కౌన్సిలర్ అభ్యర్థికి, చైర్‌పర్సన్ అభ్యర్థికి వేర్వేరుగా రెండు ఓట్లు వేయాల్సి ఉంటుందని కమిషనర్ వివరించారు. కౌన్సిలర్ బ్యాలెట్ తెలుపు రంగులో, చైర్‌పర్సన్ బ్యాలెట్ గులాబీ రంగులో ఉంటాయని, రెండింటినీ ఒకే బ్యాలెట్ బాక్సులో వేయాలని సూచించారు. ఓటు వేసిన తర్వాత బ్యాలెట్ పత్రాన్ని అడ్డంగా కాకుండా నిలువుగా మడవాలని, లేదంటే స్వస్తిక్ గుర్తు సిరా అంటుకుని ఓటు చెల్లకుండా పోయే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రానికి గుర్తింపు కార్డు తీసుకురావాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

వైసీపీ ప్రచారానికి జోరు.. ప్రతి గడపకు నేతలు

- జడ్పీటీసీ అభ్యర్థి వెంకట శివమ్మకు మద్దతుగా విస్తృత ప్రచారం - పలు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించిన నాయకులు

ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వేంపల్లె పట్టణంలో వైసీపీ ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది. జడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ సింగారెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీలు రవికుమార్ రెడ్డి, షబ్బీర్ వలి, వైసీపీ మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, రాష్ట్ర యువనేత రాచినేని వేణుగోపాల్ తదితర నేతలు ప్రతి గడపకు వెళ్లి ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ వైసీపీ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ తరపున జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బత్తల వెంకట శివమ్మకు మద్దతుగా ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. తమ అమూల్యమైన ఓటు వేసి ఆమెను గెలిపించాలని కోరారు. గత వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని, ప్రస్తుత టిడిపి కూటమి పాలనలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు పేర్కొన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతోందని విమర్శించారు. జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల ఉపాధ్యక్షులు మునీర్, రవిశంకర్ గౌడ్, నాయకులు కొత్తూరు రెడ్డయ్య, కుళాయప్ప, వైసీపీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి నిసార్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కటిక చంద్ర, బాబాషరీఫ్, హబిబుల్లా, రాజ్ కుమార్, భారతీ, మణిగోపాల్ రెడ్డి, అంజీ, తిరుమల రెడ్డి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్ఆర్సిపి అభ్యర్థి. భూమి రెడ్డి గారి రాధమ్మ

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి

ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా బరిలో ఉన్న భూమి రెడ్డి గారి రాధమ్మ ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలుస్తూ తనను ఆదరించి ఓటు వేయాలని కోరుతున్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి తనతో పాటు జడ్పిటిసి అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇప్పుడు జడ్పిటిసి రేపు అసెంబ్లీ.. బిజెపి చేతిలోకి.!?

గుజ్జ మోహన్ రావు జోష్యం.

ప్రజాభూమి ప్రతినిధి-కూనవరం

మండలంలోని రాజకీయాల్లో శాశ్వత మిత్రులు శాశ్వత శత్రువులు అంటూ ఎవరూ ఉండరు. పొత్తులు శాశ్వతం కాదు కానీ ఒక్కసారి పార్టీకి నష్టం జరిగితే కోలుకోవడం మాత్రం చాలా కష్టం. దేశవ్యాప్తంగా బిజెపి రాజకీయ ఎత్తుగడల వలన ఎన్నో ప్రాంతీయ పార్టీలు కోలుకోలేని దెబ్బతిన్నాయి. కూనవరం మండలం లో కూడా ఇదే జరుగుతుందని సిపిఐ డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ గుజ్జా మోహన్ రావు జోష్యం చెప్పారు. శుక్రవారం కోంద్రాజుపేటలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎంతో కష్టపడి పనిచేసి ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి కి గత అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్ రాకపోవడానికి బిజెపి ఆడిన డబల్ గేమ్ ప్రజలందరికీ తెలుసన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల గుర్తు సైకిలే అయినప్పటికీ అభ్యర్థి మాత్రం బిజెపి మనిషే అని తెలుగుదేశం కార్యకర్తలే బాహాటంగా వాపోయారు అన్నారు. ఇప్పుడు మళ్లీ అదే లాజిక్ ప్లే అయిందని తెలుగుదేశం పార్టీలో పొడియం అప్పారావుని పక్కన పెట్టి బిజెపి అభ్యర్థి పాయం వెంకయ్య కి బి ఫాం ఇవ్వడం వెనుక బిజెపి మార్కు రాజకీయం స్పష్టంగా తెలుస్తోంది. ఈ పరిణామం తెలుగుదేశానికి రానున్న కాలంలో ప్రాణ సంకటంగా మారదన్న గ్యారెంటీ లేదన్నారు. ఈరోజు తెలుగుదేశం అభిమానులంతా బిజెపికి ఓటు వేస్తే ఆ బలమంతా మాదేనని చూపించి పైనుంచి చక్రం తిప్పవచ్చు, రంపచోడవరం అసెంబ్లీ స్థానాన్ని కూడా పొత్తులో భాగంగా బిజెపి కొట్టేయవచ్చు అని అన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకొని ప్రయోజనం ఉండదు కామ్రేడ్.కాబట్టి తెలుగు తమ్ముల్లారా మేల్కోండి, మీ వేలితో మీ కంటిలోనే పొడిచే బిజెపితో తస్మాత్ జాగ్రత్త అని హితవు పలికారు.ఈ సమావేశంలో కూనవరం మండల కార్యదర్శి లంబు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు జుత్తుక సూర్యచంద్రరావు, జుత్తుక ఈశ్వర ప్రసాద్, సోడే కన్నారావు, బుడుపుటి వెంకటేశ్వర్లు, పొడియం సీతారామయ్య సోడే దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రం సందర్శన

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు శ్రీమతి గొర్ల సునీతా ఈ రోజు పోలవరం జిల్లా చింతూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు, వైద్య విభాగాల పనితీరుపై వివరాలను సూపరింటెండెంట్ డా శివకుమార్ ని అడిగి తెలుసుకున్నారు.ప్రత్యేకంగా నవజాత శిశువుల సంరక్షణ కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగం లో అందిస్తున్నా సేవలు గురించి డా మహేష్, చిన్నపిల్లల వైద్య నిపుణులు సభ్యులకు వివరించారు. దయాలసిస్ కేంద్రం లో చికిత్సా పొందుతున్నా రోగులతో ఆమె మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు, ప్రసూతి మరియు శిశు ఆరోగ్య సేవలు, ఇతర వైద్య విభాగాల ద్వారా గిరిజన ప్రాంత ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆసుపత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలానే ఆసుపత్రిలో రోగులకు అందిస్తునా బోజన సదుపాయాలను ఆమె పరిశీలించారు, రోగులకు నాణ్యమైన, మెనూ ప్రకారం డైట్ సప్లయ్ చేయాలని సూచించారు.

మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం, పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబా టులో ఉంచడం, ముఖ్యంగా తల్లులు మరియు నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.చింతూరు వంటి మారుమూల గిరిజన ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రి సిబ్బంది కృషి అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షణ వైద్యాధికారి డా. శివకుమార్, డా. రమణ రావు, డా జలపతి, డా శశికళ, డా మాధవి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

రోకలి పట్టిన జడ్పీటీసీ అభ్యర్థి. ప్రజల మనసు గెలుస్తున్న విష్ణుప్రియ

- శ్రీరామగిరిలో ఇంటింటి ప్రచారం.. వృద్ధురాలితో కలిసి కారం దంచిన కూటమి అభ్యర్థి
- మైకులు, జెండాలకే పరిమితం కాకుండా సామాన్యులతో మమేకం

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

వి.ఆర్.పురం మండలంలో జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. టీడీపీ మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ ఆధ్వర్యంలో కూటమి జడ్పీటీసీ అభ్యర్థి వాళ్ల విష్ణుప్రియ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం శ్రీరామగిరి గ్రామంలో ఆమె నిర్వహించిన ఇంటింటి ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ప్రచారంలో భాగంగా ముందుగా శ్రీరామగిరిలోని రాముని ఆలయాన్ని విష్ణుప్రియ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని మండల ప్రజల సుఖసం తోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్ నేతృత్వంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లిన విష్ణుప్రియ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, మౌలిక వసతుల అవసరాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు తది తర అంశాలపై స్థానికులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

వృద్ధురాలి ఇంటి వద్ద ఆగి.. రోకలి పట్టిన విష్ణుప్రియ

ఇదిలా ఉండగా ప్రచారంలో చోటుచేసుకున్న ఓ ఆసక్తికర సంఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఓ వృద్ధురాలి ఇంటి వద్దకు వెళ్లిన విష్ణుప్రియ, ఆ వృద్ధురాలు రోట్లో కారం దంచుతుండటాన్ని గమనిం చారు. వెంటనే ఆమె పక్కన కూర్చుని రోకలి పట్టుకుని స్వయంగా కారం దంచారు. అనంతరం వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడి ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సాధారణంగా ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు మైకులు, వాహనాలు, జెండాలతో ప్రచారం నిర్వహిస్తుంటారని, అయితే విష్ణుప్రియ మాత్రం ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వారితో కలిసి మమేకమవుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. వృద్ధురాలితో కలిసి కారం దంచిన ఫొటో ప్రస్తుతం స్థానికంగా వైరల్‌గా మారింది. బీజేపీ-జనసేన-టీడీపీ కూటమి కండువాతో ప్రచారంలో పాల్గొంటున్న విష్ణుప్రియ, సామాన్య ప్రజలతో కలిసిపోతూ వారి జీవన విధానాన్ని దగ్గరగా తెలుసుకునే ప్రయత్నం చేయడం ప్రజలను ఆకట్టుకుంటోంది. ఎన్నికల ప్రచారాన్ని కేవలం ఓట్లు అడిగే కార్యక్రమంగా కాకుండా ప్రజల సమస్యలను తెలుసుకునే అవకాశంగా మలుచుకుంటున్నారని కూటమి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా విష్ణుప్రియ మాట్లాడుతూ, "ప్రజల మధ్య ఉండటం నాకు ఎంతో ఇష్టం. ఎన్నికల్లో గెలిచిన తర్వాత కూడా ఇదే విధంగా ప్రతి గ్రామానికి వెళ్లి ప్రజలను కలుస్తాను. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు నా వంతు కృషి చేస్తాను. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నా ప్రధాన లక్ష్యం" అని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల మద్దతు ఉందని, జడ్పీటీసీగా తనను గెలిపిస్తే మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కూటమి అభ్యర్థి విష్ణుప్రియకు, ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

గంగవరం మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో జాయింట్ కలెక్టర్

ప్రజాభూమి ప్రతినిధి-రంపచోడవరం

పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ ఐఏఎస్ శుక్రవారం గంగవరం మండలంలోని పాత గంగవరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించి, పంపిణీ ప్రక్రియకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అర్హులైన లబ్ధిదారులకు నిర్ణీత మార్గదర్శకాలకు అనుగుణంగా పింఛన్ల నగదు సక్రమంగా అందేలా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

ధర్మతాళ్ళగూడెంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల జోరుగా ఇంటింటి ప్రచారం

ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థన

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

వి.ఆర్.పురం మండలం వడ్డిగూడెం పంచాయతీ పరిధిలోని ధర్మతాళ్ళగూడెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా నిర్వహించారు. జడ్పీటీసీ అభ్యర్థిని బంధం విజయలక్ష్మి, ఎంపీటీసీ అభ్యర్థి పిట్టా రామారావు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిసి తమ ఎన్నికల గుర్తు ఫ్యాన్‌పై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు ప్రతి ఇంటికీ వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటూ, ప్రజలతో మమేకమయ్యారు. తమకు అవకాశం కల్పిస్తే గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఓటర్లకు హామీ ఇచ్చారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని నాయకులు తెలిపారు. ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జడ్పీటీసీ అభ్యర్థిని బంధం విజయలక్ష్మి, ఎంపీటీసీ అభ్యర్థి పిట్టా రామారావులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా నినాదాలు చేస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంతో ధర్మతాళ్ళగూడెం గ్రామంలో రాజకీయ సందడి నెలకొంది.

2026లో ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తులు 110.99 శాతం పెరుగుదల

ప్రజాభూమి ప్రతినిధి-రంపచోడవరం

పోలవరం జిల్లాలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా 2024 తుది ఓటరు జాబితాలో 637 మంది ఓటర్లు ఉండగా, 2026 సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు 707 ఫారం-19 దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. గత ఓటర్ల సంఖ్యతో పోలిస్తే ప్రస్తుతం 110.99 శాతం దరఖాస్తులు నమోదయ్యాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 2024 తుది ఓటరు జాబితాలోని 637 మందికి సంబంధించి మొత్తం 707 ఫారం-19 దరఖాస్తులు అందగా, వాటిలో 648 దరఖాస్తులను ఈఆర్వోకు సమర్పించామని, మిగిలిన 59 దరఖాస్తుల పరిశీలన, సమర్పణ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు.మండలాల వారీగా పరిశీలిస్తే... రంపచోడవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో అడ్డతీగలలో 2024లో 98 మంది ఓటర్లు ఉండగా, 2026లో 80 దరఖాస్తులు, దేవీపట్నంలో 58 మందికి 53, గంగవరంలో 51 మందికి 72, మారేడుమిల్లిలో 37 మందికి 33, రంపచోడవరంలో 124 మందికి 100, రాజవొమ్మంగిలో 121 మందికి 122, వై. రామవరంలో 34 మందికి 19, గూర్చేడులో 3 మందికి 6 దరఖాస్తులు అందాయి. ఈ డివిజన్ పరిధిలో మొత్తం 526 మంది పాత ఓటర్లకు సంబంధించి 485 దరఖాస్తులు స్వీకరించారు. చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో చింతూరులో 2024లో 37 మంది ఓటర్లు ఉండగా, 2026లో 89 దరఖాస్తులు, కూనవరంలో 41 మందికి 64, వీఆర్ పురంలో 23 మందికి 42, యటపాకలో 10 మందికి 27 దరఖాస్తులు అందాయి. ఈ డివిజన్ పరిధిలో 111 మంది పాత ఓటర్లకు సంబంధించి 222 దరఖాస్తులు స్వీకరించారు. ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా / కాకినాడ జిల్లా కలెక్టర్, సహాయ రిటర్నింగ్ అధికారిగా పోలవరం జిల్లా రెవెన్యూ అధికారి ఆర్. శివరావు వ్యవహరిస్తున్నారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఓటు హక్కు కోసం నమోదుకు నవంబర్ 3 వ తేదీ చివరి తేదీ అని, నవంబర్,9 న డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు కోసం ఫారం 19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు

ఓజుబంద నుంచి సూరంపాలెం పంచాయితీ వరకు కూటమి అభ్యర్థుల ఇంటింటి ప్రచారం

ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలం సూరంపాలెం ఎంపీటీసీ పరిధిలో శుక్రవారం కూటమి అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు ఎంపీటీసీ అభ్యర్థి సారపు భవాని,జడ్పీటీసీ అభ్యర్థి తీగల ప్రభ కలిసి వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ ఓటర్లను కలిశారు గంగవరం మండల టీడీపీ అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జనసేన మండల అధ్యక్షుడు కుంజం సిద్దు,మండల ప్రధాన కార్యదర్శి కనిగిరి సుభాష్,సొసైటీ చైర్మన్ పాము అర్జున్ రావు తదితర నాయకులు,కూటమి శ్రేణులు ప్రచారంలో పాల్గొన్నారు ఓజుబంద జీఎం పాలెం,జగ్గంపాలెం పంచాయతీల పరిధిలో ఇంటింటికీ వెళ్లి అభ్యర్థులు ఓటర్లను కలుసుకున్నారు ఈ సందర్భంగా ఎంపీటీసీ అభ్యర్థి సారపు భవాని,జడ్పీటీసీ అభ్యర్థి తీగల ప్రభలకు కేటాయించిన ఎన్నికల గుర్తులపై ఓటు వేసి తమకు మద్దతు తెలపాలని కోరారు కూటమి నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచార కార్యక్రమాన్ని కొనసాగించారు.

గొరగుమ్మిలో తాగునీటి సమస్యకు పరిష్కారం.. కమ్యూనిటీ భవనం వద్ద కొత్త చేతి బోరు ఏర్పాటు

ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

గంగవరం మండలం గొరగుమ్మి గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు బెతిస్తా ప్రార్థనా మందిరం వారి సహకారంతో కమ్యూనిటీ భవనం వద్ద కొత్త చేతి బోరును ఏర్పాటు చేశారు గొరగుమ్మి పీసా అధ్యక్షుడు ఓండోపు శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో బోరు వేయించి అవసరమైన సామగ్రిని తెప్పించి బిగించే పనులు పూర్తి చేశారు గ్రామంలోని కమ్యూనిటీ భవనం వద్ద కొత్తగా తాగునీటి బోరు ఏర్పాటు కావడంతో చుట్టుపక్కల నివాసితులు హర్షం వ్యక్తం చేశారు తాగునీటి అవసరాలకు ఈ బోరు ఉపయోగపడుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో పీసా అధ్యక్షుడు ఓండోపు శివశంకర్ రెడ్డి,పీసా కార్యదర్శి రాజారెడ్డి,విద్యా కమిటీ చైర్మన్ లోత వెంకటరమణ,వైస్ చైర్మన్ సీతారామిరెడ్డి వార్డు సభ్యుడు అబ్బాయిరెడ్డి తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

తుఫాన్ దెబ్బకు నేల కొరిగిన అరటి పంట.

-12.8 హెక్టార్లలో పంట నష్టం.. రూ.4.48 లక్షలుగా అంచనా

ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

అడ్డతీగల మండలంలోని తిమ్మాపురం, కొట్టంపాలెం గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో అరటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. తుఫాన్ ధాటికి అరటి చెట్లు నేలకొరగడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు.ఈ నేపథ్యంలో ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేశారు. మొత్తం 12.8 హెక్టార్లలో అరటి పంట దెబ్బతిన్నట్లు గుర్తించి, రూ.4,48,000 నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.ఈ విషయాన్ని ఉద్యానవన శాఖ అధికారి కోలా ముత్తయ్య తెలిపారు. పంట నష్టానికి సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం త్వరలోనే రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

మండల కేంద్రంలో ఎమ్మెల్యే శిరీషా దేవి ఎన్నికల ప్రచారం

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని హై స్కూల్ సెంటర్ వద్ద రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషా దేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ ప్రచార కార్యక్రమంలో కూనవరం ఎంపీటీసీ-1 కూటమి అభ్యర్థి కొయ్యల కనక లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషా దేవి మాట్లాడుతూ మేజర్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కూనవరం ఎంపీటీసీ-1 గా కనక లక్ష్మీ ప్రసన్నను, జడ్పీటీసీగా పాయం వెంకయ్యను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు, ఆర్ అండ్ ఆర్, స్ట్రక్చర్ వ్యాల్యూ తదితర సమస్యలన్నీ కూటమి ప్రభుత్వం హయాంలోనే పరిష్కారమవుతాయని భరోసా ఇచ్చారు.అనంతరం హై స్కూల్ సెంటర్ నుండి ఇంటింటికీ తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఎమ్మెల్యే రాకతో కార్యకర్తల్లో, మహిళల్లో ఉత్సాహం నెలకొంది. మహిళలు హారతులు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో కూటమి మండల నేతలు, కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిర్మాణ రంగంలో పర్యావరణహిత విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

*సుస్థిర పట్టణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ దిశగా సమిష్టి కృషి అవసరం *వికసిత్ భారత్ @2047 లక్ష్య సాధనలో సుస్థిర మౌలిక వసతులు కీలకం*జాతీయ సదస్సులో ముఖ్యోపన్యాసం చేసిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ: దేశంలో సుస్థిరమైన, తక్కువ కర్బన ఉద్గారాలు కలిగిన, వాతావరణ మార్పు లను తట్టుకోగల పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు నిర్మాణ రంగం, పట్టణ ప్రణాళిక, రియల్ ఎస్టేట్, సుస్థిర మౌలిక వసతుల మధ్య సమన్వయం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు.జాతీయ ప్రాధాన్యత కలిగిన విద్యాసంస్థ విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ).. నీడ్ మిషన్ సహకారంతో శుక్ర వారం ఎస్‌పీఏలో "నిర్మిత పర్యావరణంలో నికర శూన్య కర్బన ఉద్గారాలు: భవనాల నుంచి నగర ప్రాంతాల వరకు - వికసిత్ భారత్ @2047 లక్ష్యంగా నిర్మాణ శాస్త్రం, పట్టణ ప్రణాళిక, రియల్ ఎస్టేట్, సుస్థిర మౌలిక వసతుల సమ న్వయం" అనే అంశంపై జాతీయ సద స్సును నిర్వహించింది. ఈ సదస్సులో ప్రము ఖులు, విద్యావేత్తలు, ప్రభుత్వ అధికారులు, వృత్తి నిపుణులు, పరిశోధకులు, పారిశ్రామిక ప్రతిని ధులు, విద్యార్థులు పాల్గొని దేశంలో సుస్థిర అభి వృద్ధి, తక్కువ కర్బన ఉద్గారాలు, వాతావరణ మా ర్పులను తట్టుకోగల నిర్మాణ వ్యవస్థల అభివృద్ధిపై చర్చించారు. సదస్సులో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సుస్థిర పట్టణాభివృద్ధి, సమన్వయ పాలన, మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కార్యక్రమాల్లో పర్యావరణ పరిరక్షణ అంశాలను సమగ్రంగా చేయడం ద్వారా వికసిత్ భారత్ @2047 లక్ష్య సాధనకు దోహదపడుతుందని వివరించారు.

పటిష్ఠ సమన్వయంతో పర్యావరణ సవాళ్లను ఎదుర్కొందాం:

ఎస్‌పీఏ విజయవాడ ఆర్కిటెక్చర్ విభాగాధిపతి ప్రొఫెసర్ అమితవ సర్కార్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న పర్యావరణ సవాళ్లను ఎదుర్కోవడంలో నిర్మాణ రంగం, పట్టణ ప్రణాళిక, అనుబంధ రంగాల మధ్య సమన్వ యం, పరస్పర సహకారం అవసరమన్నారు. ఎస్‌పీఏ విజయవాడ డైరెక్టర్ ప్రొఫెసర్ డా. రమేష్ శ్రీకొండ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, నిర్మిత పర్యావరణ రంగంలో వినూత్న విధానాలను ప్రోత్సహించేందుకు సంస్థ కట్టుబడి ఉందన్నారు.

అన్నా విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ మాజీ డీన్ డాక్టర్ మోనిగంగ్ దేవదాస్.. సుస్థిర, పర్యావరణహిత అభివృద్ధి, నిర్మాణ పద్ధతుల ప్రోత్సాహంలో నిర్మాణ విద్య, పరిశోధనలు, వృత్తిపరమైన అనుభవాల పాత్రను వివరించారు. విభా సెక్రటరీ జనరల్ పి.వి.వివేకానంద మాట్లాడుతూ దేశ దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాల సాధనకు సమష్టి భాగస్వామ్యం, సంస్థల మధ్య సహకారం, విజ్ఞానాన్ని పరస్పరం పంచు కోవడం ఎంతో అవసరమన్నారు. స్టూడియో చింతల అధినేత, ఆర్కిటెక్ట్ దివాకర్ చింతల తన పరిశోధన ప్రాజెక్టులైన ఈఫ్రాజిటిక్ ల్యాబ్స్, అమరారాజా పరిశోధనా కేంద్రం, అమెరికాలో జెన్సర్ సంస్థ ద్వారా చేపట్టిన నియర్ జీరో కమర్షియల్ బిల్డింగ్ ప్రాజెక్టుల గురించి తన అభిప్రాయాలను పంచుకున్నారు.సదస్సులో ప్రధానంగా విద్య, ఆరోగ్యం, వాణిజ్య భవనాలు, నగర ప్రాంతాలు, వ్యూహాలు, భవనాలు అనే అయిదు అంశాలపై చర్చలు జరిగాయి.

వాతా వరణ మార్పులను తట్టుకోగల నగర ప్రాంతాల అభివృద్ధి, భవనాల్లో ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించడం, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం, సుస్థిర రవాణా వ్యవస్థలు, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువడే నిర్మాణ సామగ్రి వినియోగం వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సదస్సులో డాక్టర్ విజయలక్ష్మి అయ్యర్, డాక్టర్ అమితవ సర్కార్, డాక్టర్ అన్నుజయ్ గుప్తా, డాక్టర్ ఆదినారాయణ, డాక్టర్ ప్రశాంత్ వర్దన్, డాక్టర్ ఫైజ్, డాక్టర్ అనురాగ్, డాక్టర్ రాజేష్ తదితరులు తమ పరిశోధన ప్రాజెక్టుల ఫలితాలను వివ రించారు.

విద్యార్థులు సైతం ఈ సదస్సుకు అను బంధంగా తమ విద్యా సంబంధిత ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎస్‌పీఏ విజయవాడ డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎస్. వెంకట కృష్ణ కుమార్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని, సదస్సుకు హాజరైన అతిథులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పోలీస్ శాఖకు బెరాకా మినిస్ట్రీస్ సౌండ్ సిస్టం బాక్సుల అందజేత

పోలీస్ శాఖకు బెరాకా మినిస్ట్రీస్ చేయూత

శాంతిభద్రతల పరిరక్షణకు మూడు మినీ సౌండ్ సిస్టం బాక్సుల అందజేత

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం: సమాజ శ్రేయస్సు, శాంతిభద్రతల పరిరక్ష ణలో పోలీస్ శాఖకు సహకరించాలనే ఉద్దేశంతో బెరాకా మినిస్ట్రీస్ ప్రతినిధులు ముందుకు వచ్చారు.మచిలీపట్నంలోని ఆర్.పేట, మచిలీపట్నం, బందరు తాలూకా పోలీస్ స్టేషన్లకు అవసరమైన మూడు మినీ సౌండ్ సిస్టం బాక్సులను ఆర్.పేట సీఐ ఏసుబాబుకు బెరాకా మినిస్ట్రీస్ ప్రతినిధులు అందజేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు అవసరమైన సమాచారాన్ని చేరవేయడం, పోలీస్ శాఖ నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో ఈ సౌండ్ సిస్టం బాక్సులు ఉపయోగ పడనున్నాయి. పోలీస్ శాఖకు అవసరమైన పరికరాలను అందజేస్తూ సామాజిక బాధ్యతను చాటు కున్న బెరాకా మినిస్ట్రీస్ ప్రతినిధులను సీఐ ఏసుబాబు అభినందించారు.ఈ సందర్భంగా ఆర్.పేట సీఐ ఏసుబాబు మాట్లాడుతూ.. సమాజ సేవలో ముందుండే బెరాకా మినిస్ట్రీస్ పోలీస్ శాఖకు ఎంతో ఉపయోగకరమైన మినీ సౌండ్ సిస్టం బాక్సులను అందజేయడం అభినందనీయమన్నారు. శాంతిభ ద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ శాఖ చేపట్టే కార్యక్రమాలకు ఈ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పోలీస్ శాఖకు సహకారం అందించిన బెరాకా మినిస్ట్రీస్ వ్యవస్థా పకులు కిరణ్ పాల్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.బెరాకా మినిస్ట్రీస్ ప్రతినిధులు మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పోలీస్ శాఖకు తమ సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ, పోలీస్ శాఖకు అవసరమైన ఉపయోగకరమైన వస్తువులను అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని వెల్లడిం చారు. ముఖ్యంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో పోలీస్ శాఖకు ఈ మినీ సౌండ్ సిస్టం బాక్సులు ఉపయోగపడతాయని సీఐ ఏసుబాబు పేర్కొన్నారు. సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొనేలా పోలీస్ శాఖకు సహకరించడం అభినందనీయమని తెలిపారు. సామాజిక సేవలో భాగంగా పోలీస్ శాఖకు అవసరమైన పరికరాలను అందజేసిన బెరాకా మినిస్ట్రీస్ సేవా దృక్పథం పలువురి ప్రశంసలు అందుకుంది.ఈ సేవా కార్యక్రమం లో సీఐ ఏసుబాబుతో పాటు బెరాకా మినిస్ట్రీస్ ప్రతినిధులు కాగిత రమాదేవి, అడపా గణేష్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

మొదుముడిలో విక్కుర్తి జయలక్ష్మి ఎన్నికల ప్రచారం

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

అవనిగడ్డ మండలం మొదుముడిలో గ్రామంలో శుక్రవారం కూటమి పార్టీలు బలపరిచిన అవనిగడ్డ మండలం తెలుగుదేశం పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థిని విక్కుర్తి జయలక్ష్మి, మొదుముడి ఎంపీటీసీ అభ్యర్థిని బచ్చు వరలక్ష్మి తో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని వివిధ ప్రాం తాల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి స్థానిక ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై, ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటూ ప్రచారాన్ని కొనసాగించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను పలకరిస్తూ తమకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లింల మద్దతు ఆకాంక్షించిన కూటమి అభ్యర్థులు

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

ముస్లిం సోదరులు కూటమి అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు అందించాలని టీడీపీ మండల అధ్య క్షులు మోర్ల రాంబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మధ్యాహ్నం చల్లపల్లి మహమ్మదీయ మస్జీదులో కూటమి బలపరి చిన టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి రావెళ్ల ఉదయ్ కుమార్, చల్లపల్లి నాలుగు సెగ్మెంట్ల టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థులు పైడిపాముల స్వప్న, మోర్ల శివ, జనసేన ఎంపీటీసీ అభ్యర్థులు అద్దేపల్లి జయలక్ష్మి సాయికుమారి, బొందలపాటి శ్యామసుందరి ముస్లిం సోదరులను కలిసి ఓట్లు అభ్య ర్థించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి: విక్కుర్తి

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు ప్రజలకు పిలుపుని చ్చారు. శుక్రవారం కోడూరు మండలంలో ఆయన కూటమి అభ్యర్థులతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.కోడూరు మండల జెడ్పీటీసీ అభ్యర్థిని బొలిశెట్టి అరుణతో పాటు తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ఎంపీటీసీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని విక్కుర్తి శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా గ్రామాల అభివృద్ధికి మరింత బాటలు వేసినట్లవుతుందని పేర్కొ న్నారు. ప్రజల ఆశీస్సులతో కూటమి అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తారనే నమ్మకం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ ఎన్నికల్లో కూటమి ఐక్యతను చాటుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

దివిసీమ రైతన్నలకు తీరని నష్టం!

ఆర్నాబ్ తుపాను ప్రభావంతో నీటమునిగిన పంటలు.. దెబ్బతిన్న ఉద్యానవనాలు

పెట్టుబడులు నీటిపాలు.. అన్నదాతలకు అండగా నిలవాలని రైతుల విజ్ఞప్తి

ప్రజాభూమి అవనిగడ్డ

కోడూరు దివిసీమ రూరల్‌ఆర్నాబ్ తీవ్ర తుపాను దివిసీమ ప్రాంత రైతాంగంపై తీవ్ర ప్రభావం చూపింది. తుపాను కారణంగా కురిసిన కుండపోత వర్షాలతో కోడూరు, గూడూరు తదితర ప్రాంతాల్లో వ్యవసాయ పంటలు నీటమునిగాయి. చేతికొచ్చే దశలో ఉన్న వరి పంటలు నీటిలో మునిగిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు పెట్టిన పెట్టుబడులు నీటిపాలవడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటు న్నారు.కోడూరు ప్రాంతంలో వరి పొలాలు వర్షపు నీటిలో మునిగిపోగా, గూడూరు పరిసర ప్రాంతాల్లో పంట పొలాలు నీటితో నిండిపోయి చెరు వులను తలపిస్తున్నాయి. మోకాలి లోతు నీరు నిలిచిపోవ డంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, పురుగుమం దులు, కూలీల ఖర్చుల రూపంలో లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు ఇప్పుడు నష్టాల భారంతో ఆవేదన చెందుతున్నారు.వరి పంటలతో పాటు ఉద్యానవన పంటలకూ భారీ నష్టం సంభవించింది. అరటి తోటలు గాలుల ధాటికి నేలకొరిగి, చెట్లు విరిగిపోయాయి. బొప్పాయి తోటలు కుప్పకూలాయి. కొబ్బరి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. టమోటా పంటలో కాయలు రాలిపోగా, పసుపు పంటలు సైతం దెబ్బతిన్నాయి. దీంతో వాణిజ్య పంటలు సాగు చేసిన రైతులకు కోలుకోలేని నష్టం వాటిల్లింది.ఏటా ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ వ్యవసాయాన్ని కొనసాగిస్తున్న అన్నదా తలకు తుపాను మరోసారి గట్టి దెబ్బ తీసింది. పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి ప్రకోపం కారణంగా సాగు ఖర్చులన్నీ వృథా కావడంతో రైతు కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఏర్పడింది.

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు. నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి పారదర్శకంగా నష్టపరిహారం అందించాలని, పెట్టుబడి రాయితీతో పాటు అవసరమైన ఆర్థిక సహాయం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి అన్నదా తలను ఆదుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణ ఉపశమనం కల్పించాలని దివిసీమ రైతాంగం కోరుతోంది.

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి కెయూ – స్కిల్‌డిజైర్ మధ్య ఒప్పందం

ఇంటర్న్‌షిప్‌లు, ఆన్‌లైన్ కోర్సులు, వృత్తి నైపుణ్య శిక్షణకు అవకాశం

మచిలీపట్నం కృష్ణా విశ్వవిద్యాలయం : విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించి, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో కృష్ణా విశ్వవిద్యాలయం, స్కిల్‌డిజైర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. శుక్రవారం విశ్వవిద్యాల యంలో జరిగిన కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య కె. రాంజీ సమక్షంలో ఈ ఒప్పంద ప్రక్రియ పూర్తయింది.ఈ మేరకు విశ్వవిద్యా లయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. ఉషా, స్కిల్‌డిజైర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ముప్పళ్ల శ్రీకాంత్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.ఈ ఒప్పందం ద్వారా ఏపీఎస్‌సీహెచ్‌ఈ (APSCHE) మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యార్థులకు వేసవి కాల ఇంటర్న్‌షిప్‌లు, పూర్తి సెమిస్టర్ ఇంటర్న్‌షిప్‌లు, ఎంఓఓసీఎస్ (MOOCs) ఆన్‌లైన్ కోర్సులు, వివిధ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అందించనున్నారు.ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ప్రాయోగిక పరిజ్ఞానంతో పాటు పరిశ్రమలకు అవసరమైన వృత్తిపరమైన నైపుణ్యాలు అందనున్నాయి. తద్వారా విద్యాభ్యాసంతోపాటు ఉద్యోగ రంగానికి అవసరమైన సామర్థ్యాలను పెంపొందించుకుని మెరుగైన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు దోహదప డనుంది.విశ్వవిద్యాలయ విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడేలా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించడంలో ఈ ఒప్పందం కీలకంగా నిలవనుంది.

తుపాను ముప్పు నుంచి తేరుకోకముందే మరో వర్ష బీభత్సం!

మచిలీపట్నంలో భారీ వర్షం.. అస్తవ్యస్తమైన జనజీవనం

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం: అర్నబ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల నుంచి మచిలీపట్నం నగరం ఇంకా పూర్తిగా తేరుకోకముందే మరోసారి భారీ వర్షం ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది. శుక్రవారం నగరంలో కురిసిన భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమ య్యాయి. పలు ప్రాంతాల్లో రహదారులు డ్రైనేజీలను తలపించడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.గత రెండు రోజులుగా కురిసిన వర్షాల ప్రభావం నుంచి నగరం కోలుకోకముందే మరోసారి భారీ వర్షం కురవడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షపు నీరు సక్రమంగా బయటకు వెళ్లకపోవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజాజీవనం అస్తవ్యస్తంగా మారింది.వరుస వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఉపశమనం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

చెప్పాం.. చేస్తున్నాం.. చేసి చూపిస్తాం

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి చూపించాం

అభివృద్ధిలో బందరు నియోజకవర్గాన్ని రాష్ట్రానికి రోల్ మోడల్‌గా మారుస్తా

మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం: గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం. చెప్పిన ప్రతి పనినీ పూర్తి చేస్తూ పాలన సాగిస్తున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేసి అభి వృద్ధి పాలనకు మద్దతు తెలపాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. మచిలీపట్నం మున్సిపాలిటీ పరిధిలో మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదా గారితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే కృతనిశ్చయంతో పని చేస్తుంటే.. వైసీపీ పాలకులు మాత్రం చొక్కాలు మడతపెడతాం, నరుకుతాం, రప్పా రప్పా అంటూ గొడ్డలి సంస్కృతి విస్తరిం చేందుకు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రం కోసం పని చేసేదెవరో.. రాష్ట్రాన్ని రక్తసిక్తం చేయాలనుకుంటున్నదెవరో ప్రజలు గుర్తించి ఎన్నికల్లో ఓటు వేయాలి. మచిలీపట్నం నియోజకవర్గం పరిధిలో తాగునీరు, డ్రైనేజీలు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యమిచ్చి పూర్తి చేస్తున్నాం. 2014-19 మధ్య మచిలీపట్నంలో చేసిన అభివృద్ధి తప్ప.. వైసీపీ పాలనలో వీసమెత్తు అభివృద్ధి కూడా జరగలేదు. మళ్లీ ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చాక పనులు వేగవంతమయ్యాయి. 15వ ఆర్థిక సంఘం, సాస్కి, హామ్ నిధులు తీసుకొచ్చి మచిలీపట్నంలో సుమారు రూ.954 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశాం. మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసేందుకు కట్టుబడి పని చేస్తున్నాం.గత ఐదు సంవత్సరాలు మున్సిపాలిటీని ఏలిన వైసీపీ నేతలు కనీసం బడ్జెట్ కూడా పెట్టలేదు. మున్సిపల్ కార్పొరేషన్‌కు సరైన భవనం కూడా కట్టలేకపోయారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.7.60 కోట్ల వ్యయంతో మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణం ప్రారంభించాం. మెడికల్ కాలేజీ పనులు వేగవంతం చేశాం. పెట్టుబడులు తీసుకొ స్తున్నాం. బందరు పోర్టుకు అనుబంధంగా రూ.8000 కోట్ల వ్యయంతో గోవా షిప్ యార్డు కంపెనీ ఏర్పాటు చేస్తున్నాం. 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం.మచిలీపట్నం నియోజక వర్గం బాగుపడేది కూటమి ప్రభుత్వంలోనే. కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా మాత్రమే రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో ఉంటాయి. అభివృద్ధి శాశ్వతంగా కొనసాగుతుంది. రప్పా రప్పా అంటూ మాట్లాడే రౌడీ బ్యాచ్‌కు, గొడ్డలి పార్టీ నేతలకు రేపు ఓటుతో బుద్ధి చెప్పాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బూరగడ్డ వేదవ్యాస్ , కొనకళ్ల జగన్నాథరావు , బీజేపీ నాయకులు పంతం గజేంద్ర ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావిత కారణంగా కృష్ణా జిల్లాల్లోఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఓటీపీ ధృవీకరణ నుంచి తాత్కాలిక మినహాయింపు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:



కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ వారి ఆదేశాల మేరకు, 'అర్నాడ్' తుఫాను నేపథ్యంలో ప్రజల కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎల్‌పీ జీగ్యాస్సిలిండ ర్లప ంపిణీలోనిర ంత రాయ ంగా కొనసాగించేందుకు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ రోజు వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో జిల్లా పౌరసరఫ రాల అధికారి, కృష్ణా జిల్లా, టి.శివ రామ ప్రసాద్ ఎల్‌పిజి గ్యాస్ డీలర్లుకు తగు ఆదేశాలు జారీ చేశారు.అర్నాబ్ తుపానుకారణంగాఏర్పడినఅంతరాయాలు, విద్యుత్సరఫరానిలిచిపోవడం, మొబైల్ నెట్‌వర్క్ లు మరియు ఇంటర్నెట్ కనెక్టివిటీలో సమస్యలను దృష్టిలోఉంచుకొని, ఆంధ్రప్రదేశ్‌లోని తుపాను ప్రభావిత 13 జిల్లాల్లో గృహవినియోగ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల పంపిణీకి ఓ.టి.పి. ఆధారిత ధృవీకరణ నుంచి తాత్కాలిక మినహాయింపు ఇవ్వడానికి భారతప్రభుత్వం ఆమోదం తెలిపింది.అదేవి ధంగా, నగదుచెల్లింపు ద్వారా నేరుగా సిలిండర్లను పొందే క్యాష్ అండ్ క్యారీ విధానాన్నిఅమలు చేసేందుకు భారత ప్రభుత్వ పెట్రోలియం మరియు సహజ వాయువుల మంత్రిత్వశాఖ అనుమతి మంజూరు చేసింది.

ప్రస్తుత విపత్తు సమయంలో ఎల్‌పీజీ గృహ వినియోగధారులకు గ్యాస్ సరఫ రా ఎలాంటి అంతరాయం లెకుండా చూడటంతో పాటు, వినియోగధారులకు ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లపం పిణీకి సంబంధించి ఓ.టి.పి. (OTP) ఆధారిత ధృవీకరణ నుంచి తాత్కా లిక మినహా యింపు ఇవ్వటం జరిగింధీ. ఈ మనహాయింపు తదుపరి ఉత్తర్వులు జారీ చేసి వరకు అమలులో వుం టాయి.ఎల్‌పిజి గ్యాస్ డీలర్లుసరఫరాలో కొరత ఏర్పడకుండా తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కృత్రిమ కొరత సృష్టించడంకాని అధిక ధరలకు విక్రయించడంకానీ అక్రమ నిల్వలు చేయడం వంటి చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన ఎల్‌పీజీ గ్యాస్సిలిండర్లనిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు ఈ వేసులుబాటును అవసరమైన మేరకు వినియోగించుకోవాలని, ఎల్‌పీజీగృహ వినియోగధ రులు సహకరించాలని కోరారు.

31 డివిజన్లో విస్తృత ప్రచారం

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం: మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్ ఉపఎ న్నికల ప్రచారంలో భాగంగా, కూటమి (తెలుగుదేశం, జనసేన, బిజెపి) బలపరిచిన బిజెపి కార్పొరేటర్ అభ్యర్థి పంతం వెంకట గజేంద్ర రావు సతీమణి పంతం వెంకట మహాలక్ష్మిని, అలాగే నగర మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబిదాని భారీ మెజార్టీతో గెలిపించాలని నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. జిల్లా నాయకులు మరియు ఎన్‌డిఏ కూటమి నేతలు పాల్గొని, కూటమి అభ్యర్థుల విజయానికి గడప గడపకూ తిరుగుతూ మద్దతు సేకరించారు తదుపరి డివిజన్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at East Godavari and published at d.no.70-7-28/1A, KRISHNA NAGAR, SBI COLONY PARK RAMANAYYA PETA KAKINADA editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1470.cell:9502116677

ఎన్నికల వేళ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల కవాతు

- అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు.. సిబ్బందికి ఎస్సై వి. సురేష్ దిశానిర్దేశం

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఈ క్రమంలో ఆగిరిపల్లి ఎస్సై వి. సురేష్ ఆధ్వర్యంలో గురువారం ఆగిరిపల్లి పురవీధుల్లో పోలీసు సిబ్బంది, ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా

ప్రజల్లో భద్రతాభావం కల్పించడంతో పాటు, ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఈ కవాతు చేపట్టారు. అనంతరం పోలీసు సిబ్బందికి ఎస్సై పలు సూచనలు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల కదలికలను గమనించాలని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలని, ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

అర్నబ్ తుఫాను నష్టాల అంచనాలను పారదర్శకంగా సిద్ధం చేయండి

- వాస్తవ నష్టాలను మాత్రమే గణిస్తూ నమోదు చేసి, నిర్దేశిత ప్రొఫార్మాలలో నివేదికలు సమర్పించాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి, కాకినాడ:

అర్నబ్ తుఫాను కారణంగా కాకినాడ జిల్లా లో ప్రాథమిక రంగాలకు సంబంధించి జరిగిన నష్టాల అంచనాలు (ఎన్యూమరేషన్) ప్రక్రియ ను అత్యంత వేగవంతంగా, పారదర్శకంగా,ప్రామాణికం గా పూర్తి చేసి నిర్దేశిత గడువు లోగా ప్రభుత్వానికి సమగ్ర నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేం ధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పంట నష్ట అంచనాలను ఎన్యుమ రేషన్ ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు. ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో వ్యవసాయం,ఉద్యానవనం, మత్స్య, పశుసంవర్ధక, పట్టు పరిశ్రమ తదితర రంగాలకు జరిగిన నష్టాల అంచనాలను ప్రాధాన్యత ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు నష్టాల వివరాలను నిర్దేశిత ప్రొఫార్మా ల్లో సమర్పించాలని సూచించారు.పునరుద్ధరణ పనులతో పాటు ఎన్నికల విధులు కూడా సమాంతరం గా కొనసాగుతున్నందున, అందుబాటులో ఉన్న సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయా లన్నారు. కొన్ని శాఖలు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా, మరికొన్ని శాఖలు ఆఫ్‌లైన్ విధా నంలో నష్టాల వివరాలను

సేకరిస్తున్నందున, ఆన్ లైన్ లో నమోదు చేయ దంతో పాటు మాన్యువల్ రికార్డులను కూడా పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కేవలం క్షేత్రస్థాయిలో నిర్ధారించిన వాస్తవ నష్టాలను మాత్రమే నమోదు చేయాలని, ఎలాంటి అవాస్తవాలకు, తప్పుడు వివరాలకు తావులేకుండా పారదర్శకం గా అంచనా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మండల స్థాయిలో వ్యవ సాయం,ఉద్యాన,పశు సంవర్ధక శాఖలకు సంబంధించి ఎన్నికల విధులకు నియ మించని గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులు మండలవ్యవసాయ అధికారులు (వీహెచ్ఎ), సంబంధిత పర్యవేక్షణ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖకు సంబం ధించి నష్టపోయిన పంట విస్తీర్ణం, సన్న, చిన్నకారు రైతుల వివ రాలు, ఇసుక మేటలు పడిన భూముల విస్తీర్ణ వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఉద్యాన, పశుసంవర్ధక శాఖలకు సంబంధించి జరిగిన నష్టాలు, పశువుల నష్ట వివరాలు,వెటర్నరీ క్యాంపులు,వ్యాక్సి నేషన్ వివరాలను సమగ్రంగా సేకరించాలన్నారు. గృహాలు,రహదారులు, మత్స్య శాఖ తదితర విభాగాలకు సంబం ధించి కూడా ప్రభుత్వం నిర్దేశించిన ప్రొఫార్మాల్లోనే పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. తుఫాను నష్టాలకు సంబంధించి పరిహారం ప్రతిపాదనలు రూపొందించే సమయంలో ఎలాంటి డూప్లికేషన్ జరగకుండా అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికే ఇన్‌పుట్స్, స్లిప్పుల ద్వారా వివరాలు సేకరించి, ప్రతి పాదనలు సమర్పించిన నేపథ్యంలో అదే భూమికి సంబంధించి మరోసారి నష్టపరిహారం ప్రతిపాదించ కుండా సంబంధిత జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ముంపు ప్రభావిత ప్రాంతాల్లో కూడా నష్టాల వివరాలను క్షుణ్ణం గా పరిశీలించి,ఇప్పటికే నమోదు చేసిన వివరాలతో సరిపోల్చిన తర్వాతే తుది ప్రతి పాదనలు సిద్ధం చేయాలన్నారు.నష్ట పరిహారం చెల్లింపుల్లో ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు జరగకుండా పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో భాగంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తి చేసుకున్న వెంటనే నష్టాల అంచనా ప్రక్రియ లో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధుల్లో పూర్తిగా నిమగ్నమైన సిబ్బంది తమ విధులు ముగిసిన వెంటనే, నవంబర్ 2వ తేదీ నాటికి ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేసేలా ముందస్తు కార్యాచరణ రూపొందిం చుకోవాలన్నారు.

తుఫాన్లు, ప్రకృతి విప త్తుల సమయంలో ప్రాణ నష్టాన్ని ఏ విధంగా తగ్గించవచ్చనే అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. తుఫాన్లు ప్రకృతి విపత్తులు సమయంలో ప్రాణ,ఆస్తి నష్టాలను తగ్గించేందుకు అవసర మైన ముందస్తు చర్యలు, సమన్వయ వ్యవస్థలను బలోపేతం చేయాలని ఆదేశించారు. తుఫాను నష్టాల అంచనా, పరిహారం, ప్రతిపాదనలు, పునరుద్ధరణ చర్యలన్నింటి లో అధికారులు బాధ్యతా యుతంగావ్యవహరించాలని,వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నష్టాల గణాంకాల సమగ్ర నివేదిక లను నిర్దేశిత గడువులోగా ప్రభుత్వానికి సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు..

ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న, ఈ మండలంలో ఓటు హక్కు కలిగిన ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు శుక్ర, శనివారాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆగిరిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో అవకాశం కల్పించినట్లు ఎన్నికల అధికారి ఈ.బి. విలియమ్స్ తెలిపారు. సంబంధిత ఉద్యోగులు ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, ఎన్నికల విధుల ఉత్తర్వులతో హాజరై ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సౌకర్యం రెండు రోజులు మాత్రమే అందుబాటులో ఉంటుందని, అర్హులైన ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుక్కునూరులో జోరుగా కూటమి ప్రచారం

ప్రజాభూమి కుక్కునూరు

కుక్కునూరు మండల కేంద్రంలోని జడ్పిటిసి అభ్యర్థి బొంతు కోమలాదేవి ,కుకునూరు-1 కుక్కునూరు ఎంపీటీసీ-2 అభ్యర్థుల ప్రచారం జోరందుకుంది. తెలుగుదేశం మండల అధ్యక్షులు మొలిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం ఉధృతం గావించారు. కుక్కునూరు ఎంపీటీసీ 1 అభ్యర్థి ఇచ్చుక రాజు ,ఎంపీటీసీ-2 అభ్యర్థి శ్రీలత, జడ్పిటిసి అభ్యర్థి బొంతు కోమలాదేవి విజయాలను కోరుతూ సింగన్న దొర కోడలు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే ఉకె అబ్బయ్య కూతురు పూనం శశికళ శుక్రవారం ప్రచారంలో పాల్గొనడంతో ప్రచారం జోరందుకుంది.

తుఫాను బాధితులకు నగదు, నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాభూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న ఆదేశాల మేరకు తుఫాను ప్రభావంతో ఆగిరిపల్లి, సగ్గూరు గ్రామాల్లోని పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన 94 కుటుంబాలకు చెందిన 294 మందికి నగదు, నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ పి.ఎన్.వి. ప్రసాద్ తెలిపారు. ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున, ఒక్కో కుటుంబానికి గరిష్ఠంగా రూ.3,000 పరిమితితో నగదు అందజేశారు. అలాగే ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు, కిలో పంచదార, లీటరు వంటనూనె ప్యాకెట్, కిలో కందిపప్పు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీ వెజ్జు రామారావు, యూనస్, డీటీ మరియన్న, వీఆర్వోలు పుష్ప, రజిని, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మనమిత్ర...ఇది జనమిత్ర

- అర్నబ్ తుపాన్ వేళ బాధితులకు భరోసాగా నిలిచిన మనమిత్ర
- వాట్సాప్ గవర్నెన్స్‌ను సమర్థవంతంగా వినియోగించుకున్న బాధితులు
- 1500లకుపైగా సమస్యలను ప్రభుత్వానికి షేర్ చేసిన ప్రజలు
- వచ్చిన సమస్యను వచ్చినట్లే యుద్ధప్రాతిపదికన పరిష్కరించిన యంత్రాంగం
- మనమిత్ర ద్వారా వచ్చిన ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించిన ఆర్టీజీఎస్
- కోనసీమ, కాకినాడ, తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖ, శ్రీకాకుళం నుంచి అత్యధిక సమస్యలు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావ

అర్నబ్ తుపాన్ వేళ మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ బాధితులకు కొండంత భరోసాగా నిలిచి సేవలందించింది. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో బాధితులు తమ ప్రాంతంలో ఎదురవుతున్న సమస్యలను మనమిత్ర ద్వారా ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకొచ్చే సదుపాయం కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్‌లు అధికారులను ఆదేశించారు. దీనిపై స్పందించిన రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) అధికారులు మనమిత్ర ద్వారా తుపాన్ బాధిత ప్రాంతాల్లో ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే సదుపాయాన్ని వెంటనే అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సేవలను ఉపయోగించుకోవాలని ప్రజలకు దానిపై విస్తృత అవగాహన కల్పించారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు విపత్తు వేళ మనమిత్ర సేవలను సద్వినియోగం చేసుకుని ఉపశమనం పొందారు.

తమ ప్రాంతాల్లో నీళ్లు నిలిచిపోయాయని, చెట్లు కూలాయని, కరెంటు పునరుద్ధరించాలని, ఆహారం అందజేయాలని, మెడిసిన్స్ కావాలని, ఇతరత్రా పలు రకాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి అత్యవసర సాయం పొందారు.

95 శాతానికిపైగా పరిష్కారం

మనమిత్ర ద్వారా తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు శుక్రవారం సాయంత్రానికి 1500లకుపైగా సమస్యలను మనమిత్ర ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. మనమిత్ర ద్వారా వచ్చిన సమస్యలను 95 శాతంపైగా అధికారులు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించారు. మనమిత్ర ద్వారా తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు షేర్ చేసిన ప్రతి సమస్యను ఆర్టీజీ కార్యదర్శి భాస్కర్ కాటంనేని, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్‌లు స్వయంగా పర్యవేక్షించారు.

బీజేపీ తీర్థం పుచ్చుకున్న బండారు రాజు

జనసేనకు రాజీనామా చేసి బీజేపీలో చేరిక

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు

నూజివీడులో రాజకీయ చర్చనూజివీడు వార్త ప్రభ

నూజివీడు నియోజకవర్గ జనసేన పార్టీసమన్వయకర్త బండారు రామానుజులు (రాజు) బీజేపీలో చేరారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గారపాటి సీతారామాంజనేయులు (తపన చౌదరి) రాజుకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాపు సామాజిక వర్గానికి చెందిన బందర్ రాజు చిరంజీవి అభిమానిగా ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీలో చురుకైన పాత్ర పోషించారు. అదేవిధంగా అనంతరంపవన్ కళ్యాణ్ జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి బండారు రాజు ఆ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ బలోపేతానికి కృషి చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ పలు రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొంటూ పార్టీ తరఫున తన గళాన్ని వినిపించారు.అయితే, నూజివీడులో రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్న తరుణంలో బండారు రాజు జనసేనను వీడి బీజేపీలో చేరడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆయన వెంట పలువురు జనసైనికులు కూడా జనసేనను

వీడేందుకుసిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పరిణామాలు నూజివీడు రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు దారితీస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

స్థానిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- ఎన్నికల అధికారి ఎ వి. సుబ్బరాయన

ప్రజాభూమి, బుట్టాయగూడెం.

బుట్టాయిగూడెం మండలంలో జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎవి. సుబ్బరాయన తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యాలయంలో శుక్రవారం ఆర్వో సుబ్బరాయన మాట్లాడుతూ రెండవ సాధారణ స్థానిక ఎన్నికలు - 2026 ప్రశాంతంగా జరగడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఉత్తర్వుల మేరకు మండలంలో 15 ప్రాదేశిక నియోజకవర్గాలు , ఒక జడ్పిటిసి స్థానానికి నవంబర్ 5వ తేదీన ఎన్నిక జరగనున్నట్లు వివరించారు. ఈ ఎన్నికలలో మండలంలో 42962 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. వీరిలో పురుషులు 20133, స్త్రీలు22825, ట్రాన్స్ జెండర్స్ -4 ఉన్నట్లు చెప్పారు. మండలంలో 49 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు, రెండు జోన్లు,ఆరు రూట్లు గా విభజించి, మేజిస్ట్రీయల్ పవర్స్ కలిగిన ఇద్దరు జోనల్ ఆఫీసర్లను

నియమించినట్లు చెప్పారు. బ్యాలెట్ పేపర్, పోస్టల్ బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ కు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల అనంతరము నవంబర్ 7వ తేదీన జంగారెడ్డిగూడెం మండలం వేగవరం లోని నోవా ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఆత్రేయపురంలో బీఎస్పీకి పెరుగుతున్న ప్రాధాన్యం

- స్థానిక సంస్థల ఎన్నికల బరిలో యువ అభ్యర్థులు, ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా బీఎస్పీపై చర్చ

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ఆత్రేయపురం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) పోటీ రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటివరకు ప్రధాన పార్టీల మధ్యనే సాగిన పోటీకి భిన్నంగా బీఎస్పీ అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలవడంతో స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ప్రత్యేకంగా దళిత, బహుజన వర్గాలకు సంబంధించిన సమస్యలను ఎన్నికల అజెండాగా ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో బీఎస్పీ ప్రచారం సాగిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో దళిత యువకులులపై జరిగిన అక్రమ కేసులు విషయంలో వచ్చిన ఘటనలు, వాటిపై జరిగిన ఉద్యమాలు, బాధితులకు మద్దతుగా నిలిచిన సందర్భాలను బీఎస్పీ నాయకులు ప్రస్తావిస్తున్నారు. అదేవిధంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలోనూ రాష్ట్ర వ్యాప్తంగా దళితుల సమస్యలు, సామాజిక న్యాయం, యువతకు రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలను బీఎస్పీ ప్రధానంగా ప్రస్తావిస్తోంది. అధికార కూటమి, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా బీఎస్పీని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. ఆత్రేయపురం జడ్పీటీసీ స్థానానికి బీఎస్పీ తరఫున యాళ్ల వీరన్నబాబు, ర్యాలి ఎంపీటీసీ-2 స్థానానికి చిగురుపాటి సుభాష్ పోటీ చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వీరిద్దరూ యువ అభ్యర్థులు కావడంతో యువతలోనూ తమ అభ్యర్థిత్వంపై ఆసక్తి నెలకొందని బీఎస్పీ నాయకులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, ఆత్రేయపురం మండలంలోని 19 ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 43 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో వైఎస్సార్‌సీపీ 19, టీడీపీ 15, జనసేన 4, బీఎస్పీ 1, స్వతంత్రులు 4 మంది ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి వెల్లడించారు. ప్రధాన పార్టీలకు పరిమితంగా ఉన్న రాజకీయ పోటీకి భిన్నంగా బీఎస్పీ సామాజిక న్యాయం, యువత ప్రాతినిధ్యం, స్థానిక సమస్యలను ముందుకు తెస్తుండటంతో ఎన్నికల ఫలితాలపై కంటే ముందుగా ఆ పార్టీ పొందుతున్న ప్రజా స్పందనపై చర్చ

సాగుతోంది. అయితే ఎన్నికల తుది తీర్పు మాత్రం ఓటర్ల నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది.

రూ.111.04 కోట్ల పింఛన్ పంపిణీ

- జిల్లా కలెక్టర్ కె. వైట్రీ సెల్వీ.

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఏలూరు, జిల్లాలో 2,52,397మంది ఫించన్ దారులకు 111.04కోట్ల రూపాయిలు పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక ఫిరంగులదిబ్బ ప్రాంతంలోని కగ్గా అంకులమ్మ ,గండికోట పాపమ్మ, గండికోట వీర్రాజమ్మ, తదితర లబ్ధిదారుల ఇంటికి శుక్రవారం వెళ్లి పెన్షన్ అందజేశారు. గండికోట అంజమ్మ ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా లో 4916 మంధి సచివాలయ , ఇతర ప్రభుత్వ సిబ్బంది తో ఫించనల పంపిణీకి ఏర్పాటు చేయడమైనదన్నారు. పెన్షన్దారులందరికీ పెన్షన్ అందించేందుకు ఏర్పాటు చేయడం జరిగిందని, 30 వ తేదీన పెన్షన్ తీసుకోనివారికి 5వ తేదీ వరకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్, డిఆర్డిఏ పీడీ విజయలక్ష్మి, ఏలూరు తహసీల్దార్, వార్డ్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మక ఆవిష్కరణలకు సాంకేతిక వేదిక

- ఎన్ఆర్ఐ సాంకేతిక కళాశాలలో ఘనంగా ప్రాజెక్టుల ప్రదర్శన

ప్రజాభూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గ్రామ సమీపంలోని డాక్టర్ ఆర్వీఆర్ ఎన్ఆర్ఐ సాంకేతిక కళాశాలలో శుక్రవారం కంప్యూటర్ సైన్స్, కృత్రిమ మేధస్సు విభాగం ఆధ్వర్యంలో 'ఇంజినీరింగ్ ఫర్ ఇంపాక్ట్--2026' పేరుతో ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహించారు. ఇందులో చివరి సంవత్సరం విద్యార్థులు క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యసనం, సమాచార సాంకేతికత తదితర రంగాల్లో రూపొందించిన వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించి వాటి పనితీరు, ఉపయోగాలను వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ కార్యక్రమ నిర్వాహకులు వెంకటస్వామి తాడికొండ, ఇండియన్ సర్వర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సాయి సతీష్ హాజరై విద్యార్థుల ఆవిష్కరణలను అభినందించారు. సంస్థ ప్రో ఛాన్సలర్లు డాక్టర్ సి. నాగభాస్కర్, డాక్టర్ జి. సాంబశివరావు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి తేజ సాయి, రిజిస్ట్రార్ డాక్టర్ రాఘవరావు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఛాన్సలర్ డాక్టర్ ఆర్. వెంకట్ రావు, ఉపకులపతి డాక్టర్ కె.ఆర్.ఎస్. సాంబశివరావు విద్యార్థులు, అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొనగా, నిర్వహణ కార్యదర్శిగా డాక్టర్ బి.హెచ్. దశరథ రామ్ వ్యవహరించారు.

నిధుల కొరత ఉన్నా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

- బడేటి చంటి, రెడ్డి అప్పలనాయుడు

ప్రజాభూమి ఏలూరు

నిధుల కొరత ఉన్నప్పటికీ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ అభివృద్ధి,సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చిన కూటమి అభ్యర్థులను మరోసారి గెలిపించాలని జిల్లా టీడీపీ అధ్యక్షులు,ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, కూటమి మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు కోరారు.ఏలూరు కార్పొరేషన్ ఎన్నికల ప్రచారానికి చివరి రోజైన శుక్రవారం నగరంలోని 1, 3, 30, 52, 53వ డివిజన్లలో వారు విస్తృతంగా పర్యటించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ప్రజలను కలుసుకుని కరపత్రాలు పంపిణీ చేస్తూ కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ రెండున్నరేళ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అనేక ప్రయోజనాలు కల్పించామని తెలిపారు.రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ తనను మేయర్గా,62 డివిజన్లలో కూటమి అభ్యర్థులను కార్పొరేటర్లుగా గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల కూటమి కార్పొరేటర్ అభ్యర్థులు, ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్,మాజీ ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్,జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ

కాకినాడ జిల్లాలో అర్నబ్ తుఫాను ప్రభావంతో ముఖ్యం గా ప్రాథమిక రంగాలకు సంబంధించి జరిగిన నష్టాలను క్షేత్ర స్థాయి లో పరిశీలించేందుకు ఈ నెల 31వ తేదీ శనివారం రాత్రికి కేంద్ర బృందం కాకినాడ జిల్లాకు చేరుకోనుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, విపత్తుల నిర్వహణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ లు అమరావతి నుంచి తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కేంద్ర బృందం పర్యటన వివరాలను తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడు తూ, నవంబర్ 1వ తేదీ ఉదయం నలుగురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం జిల్లాలో పర్యటించి, తుఫాను కారణంగా నష్టపోయిన ప్రాథమిక రంగాలకు సంబంధించిన వివిధ విభాగాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించనుందని తెలిపారు.

ఈ పర్యటనలోవ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ రంగాలకు సంబంధించి జరిగిన పంటలు, ఆస్తుల నష్టాలను తీరప్రాంత రోడ్ల ను కేంద్ర బృందం పరిశీలించనుందని తెలిపారు ..ముఖ్యంగా వ్యవసాయ భూముల్లో ముంపునకు గురైన ప్రాంతాలు,పంటలకు జరిగిన నష్టాలను అంచనా వేయడంతో పాటు, మత్స్య రంగానికి సంబంధించి దెబ్బతిన్న బోట్లు, ఇతర మత్స్య సంపదకు జరిగిన నష్టాలను కూడా పరిశీలించ నుందని వివరించారు. కేంద్ర బృందం కాకినాడ నుంచి ఉప్పాడ వరకు తీర ప్రాంతంలో పర్యటించ నుందని,తిరుగు ప్రయాణం లో పెద్దాపురం,గొల్లప్రోలు, తాటిపర్తి తదితర ప్రాంతాల లో తుఫాను ప్రభావాన్ని పరిశీలించ నుందని తెలిపారు.తుఫాను కారణం గా దెబ్బతిన్న సముద్ర తీర ప్రాంత రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టాలను కూడా బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించనుందని తెలిపారు. తుఫాను ప్రభావం తో దెబ్బతిన్న ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి అవసరమైన నిధుల కేటాయింపు, పనుల అంచనాలు, పరిపాలనా అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే ఆమోదం పొందిన ఫైళ్లను వెంటనే సర్క్యులేట్ చేసి, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

కేంద్ర బృందం పర్యటన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు తమ తమ విభాగాలకు సంబంధించి జరిగిన నష్టాల వివరాలు, అంచనాలు, ఫొటోలు, సంబంధిత రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తుఫాను కారణంగా జరిగిన నష్టాలను, క్షేత్ర స్థాయిలోని వాస్తవ పరిస్థితులను కేంద్ర బృందానికి స్పష్టంగా వివరించి, సమగ్ర సమా చారాన్ని అందించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి.తిప్పే నాయక్, జిల్లా వ్యవసాయ అధికా రి వి.టి.రామారావు,జిల్లా ఉద్యానవన అధి కారి సిరులు, మత్స్య శాఖ అధికారి కృష్ణకుమార్, రహదారులు భవనాల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. శ్రీనివాస్ నాయక్ తది తరులు పాల్గొన్నారు.

15 రోజుల్లో జరగాల్సిన విద్యుత్ పునరుద్ధరణ..

నాలుగైదు రోజుల్లోనే సాధించేలా మంత్రి నిమ్మల కృషి!

- తుఫాన్ విధ్వంసాన్ని సవాల్గా తీసుకుని విద్యుత్ శాఖను పరుగులు పెట్టిస్తున్న మంత్రి
- ఇతర జిల్లాల నుంచి 200 మందికి పైగా విద్యుత్ సిబ్బంది రాక.. యుద్ధప్రాతిపదికన రోజుల్లో జరగాల్సిన విద్యుత్ పునరుద్ధరణ..

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

ఆర్నాబ్ తుఫాన్ సృష్టించిన విధ్వంసంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ముఖ్యంగా విద్యుత్ రంగానికి అపార నష్టం వాటిల్లింది. భారీ వృక్షాలు విద్యుత్ తీగలపై కూలిపడటంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ట్రాన్స్ఫార్మర్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచి పాలకొల్లు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు గత నాలుగు రోజులుగా అంధకారంలోనే మగ్గుతున్నాయి. ప్రజలు రాత్రింబవళ్లు అంధకారంలోనే గడుపుతూ తీవ్ర కష్టాలు అనుభవిస్తున్నారు . మరి ముఖ్యంగా పాలకొల్లు పట్టడంతో పాటు గ్రామాల్లో విద్యుత్ సరఫరా లేక అటు మున్సిపాలిటీ, ఇటు గ్రామపంచాయతీలు తాగునీటి సరఫరాను అందించలేకపోతున్నాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించడమే లక్ష్యంగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సాధారణ పరిస్థితుల్లోనే ఇంత భారీ స్థాయిలో విద్యుత్ వ్యవస్థ దెబ్బతింటే పునరుద్ధరణకు కనీసం 15 రోజులకు పైగా సమయం పట్టే అవకాశం ఉందని విద్యుత్ శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ప్రజలు ఇబ్బందులు పడకుండా వీలైనంత తక్కువ సమయంలోనే విద్యుత్ వెలుగులు నింపాలనే, తాగునీటి అవసరాలు తీర్చాలనే సంకల్పంతో మంత్రి నిమ్మల రామానాయుడు విద్యుత్ శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. మరమ్మతు పనుల్లో వేగం పెంచేందుకు ఇతర జిల్లాల నుంచి 200 మందికి పైగా అదనపు విద్యుత్ సిబ్బందిని పాలకొల్లు నియోజకవర్గానికి రప్పించారు. స్థానిక విద్యుత్ సిబ్బందితో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన సిబ్బంది బృందాలుగా ఏర్పడి నిరంతరాయంగా పనిచేస్తున్నారు. కూలిపోయిన విద్యుత్ స్తంభాలను తిరిగి ఏర్పాటు చేయడం, తెగిపోయిన విద్యుత్ తీగలను పునరుద్ధరించడం, దెబ్బతిన్న ట్రాన్స్ఫార్మర్లకు మరమ్మతులు చేయడం, విద్యుత్ లైన్లను యథాస్థితికి తీసుకురావడం వంటి పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. 15 రోజుల సమయం పట్టే పనులను నాలుగైదు రోజుల్లోనే పూర్తి చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలనే లక్ష్యంతో మంత్రి నిమ్మల ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరితో సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతం చేస్తున్నారు. ప్రతి ప్రాంతంలో విద్యుత్ పునరుద్ధరణ పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటూ అవసరమైన సిబ్బంది, వనరులను సమకూర్చుతున్నారు. తుఫాన్ కారణంగా జరిగిన భారీ నష్టాన్ని అధిగమించి, సాధారణంగా 15 రోజుల వరకు పట్టే విద్యుత్ పునరుద్ధరణ ప్రక్రియను కేవలం నాలుగైదు రోజుల్లోనే పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం, విద్యుత్ శాఖ యంత్రాంగం కదులుతోంది. మంత్రి నిమ్మల చొరవతో శుక్రవారం పట్టణంలోని కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన శనివారం సాయంత్రానికి పూర్తిస్థాయిలో పునరుద్ధరణ జరిగేలా అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను తన ఇబ్బందులుగా భావిస్తూ, తుఫాన్ సమయంలో సహాయక చర్యలతో పాటు విద్యుత్ పునరుద్ధరణకు, తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ విధ్వంసం నుంచి పాలకొల్లును సాధారణ స్థితికి తీసుకురావడంలో మంత్రి నిమ్మల రామానాయుడు చూపుతున్న చొరవ, అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేస్తున్న తీరు ఇప్పుడు ప్రధానంగా నిలుస్తోంది.

ఎన్నికల సమాయత్తంపై కూటమి నేతల సమావేశం

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గ్రామంలోని పొన్నం కళ్యాణ మండపంలో శనివారం సాయంత్రం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెదేపా మండల అధ్యక్షుడు నక్కన బోయిన వేణు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదును వేగవంతం చేయాలి

- అర్హులైన ప్రతి ఉపాధ్యాయుడూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణా--గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించి, నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓలు), ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్ల నమోదు పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందిస్తారని, కాబట్టి అర్హులైన ఉపాధ్యాయులు ప్రతి ఎన్నికలోనూ తప్పనిసరిగా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో జిల్లాలో 3,187 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు కాగా, ప్రస్తుతానికి కేవలం 840 దరఖాస్తులు మాత్రమే అందడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నవంబర్ 6వ తేదీ ఓటర్ల నమోదు గడువుకు చివరి తేదీ అని, ఆలోగా అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల్లో ఓటరు నమోదు అర్హతలపై సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంఈఓలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండలాల వారీగా అర్హులైన ఉపాధ్యాయులను గుర్తించి, నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. వీలైనంత వరకు ఆన్లైన్లోనే దరఖాస్తులు సమర్పించాలని, ఆన్లైన్ దరఖాస్తులపై సంబంధిత అధికారులు విచారణ చేపడతారని, ఇందుకోసం దరఖాస్తుదారులు కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేదని తెలిపారు. అవసరమైన చోట ఆఫ్లైన్ దరఖాస్తులను కూడా పరిశీలించి ధ్రువీకరించాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జిల్లా లేదా డివిజన్ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తే ఓటర్ల నమోదు మరింత వేగవంతమవుతుందని సూచించారు. అగ్రిమెంట్ ప్రాతిపదికన ఆరేళ్లుగా పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులను పార్ట్టైమ్ లేదా ఫుల్టైమ్ కేటగిరీగా పరిగణించాలా అనే సందేహాన్ని వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్, వారి నియామక ఉత్తర్వులు, అగ్రిమెంట్ నిబంధనల ప్రతులను పరిశీలన నిమిత్తం తనకు పంపాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు మాట్లాడుతూ, ఇప్పటికే ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలతో సమన్వయం చేసుకుంటూ తహసీల్దార్ల సహకారంతో ప్రైవేట్ పాఠశాలల్లోనూ సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులకు అవసరమైన సమాచారం అందించామని వివరించారు. ఓటర్ల నమోదు పురోగతిపై మరుసటి రోజు తహసీల్దార్లతో మాట్లాడి సమీక్షించాలని కలెక్టర్ సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఫలితాలు సాధించాలని, ఎంఈఓలు ఈ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని ఓటర్ల నమోదును గణనీయంగా పెంచాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలి

- ఎమ్మెల్యేచింతమనేని ప్రభాకర్ పిలుపు

ప్రజాభూమి ప్రతినిధి పెదపాడు

రాష్ట్ర సమగ్రాభివృద్ధి, పల్లెల ప్రగతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ కోసం కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ పిలుపునిచ్చారు. పెదపాడు మండలం కొత్తూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కూటమి ఎంపీటీసీ అభ్యర్థిని దనే విజయలక్ష్మి, జడ్పీటీసీ అభ్యర్థి చౌటపల్లి విక్రమ్ కిషోర్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందని తెలిపారు. వృద్ధాప్య పింఛను రూ. 4,000కు పెంచడం, అన్నదాత సుఖీభవ, ఏడాదికి మూడు

ఉచిత గ్యాస్ సిలిండర్లు, కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా 'తల్లికి వందనం', స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ మేలు చేకూరుస్తున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పదిసార్లు పెంచి ప్రజలను దోచుకుంటే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క రూపాయి కూడా కరెంటు బిల్లు పెంచలేదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు శాశ్వతంగా సాగునీరందిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కొత్తూరు డ్రైనేజీ సమస్యను పరిష్కరించి సిమెంట్ రోడ్డు కూడా మంజూరు చేశామని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు, పెదపాడు జడ్పీటీసీ అభ్యర్థి చౌటపల్లి విక్రమ్ కిషోర్, కూటమి ఎంపీటీసీ అభ్యర్థిని దనే విజయలక్ష్మి, జిల్లా టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పలపాటి రాంప్రసాద్, పెదపాడు మండల పార్టీ అధ్యక్షులు మరడాని రవి, విజయవాడ శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ మోరు శ్రావణి, కొత్తూరు రాజు, విశ్వనాథం, మందపాటి వెంకటేశ్వరరావు, కూటమి నేతలు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలవరం జిల్లాలో 46,211 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద రూ.19.37 కోట్ల మేర పింఛన్ల నగదు పంపిణీ

–జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి–రంపచోడవరం

పోలవరం జిల్లావ్యాప్తంగా అక్టోబర్ 30వ తేదీన 46,211 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.19,37,16,500 (రూ.19.37 కోట్లు) మేర ఎన్టీఆర్ భరోసా పింఛన్ల నగదును పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.జిల్లాలోని అన్ని మండలాల్లో అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము పంపిణీ ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం రంపచోడవరం మండలం తాళ్లపాలెం గ్రామంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి పింఛన్ల పంపిణీ జరుగుతున్న తీరును, నగదు అందిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నిర్ణీత మార్గదర్శకాల ప్రకారం పింఛను అందేలా సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పింఛన్ల పంపిణీ ప్రక్రియ నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులకు, సిబ్బందికి ఇప్పటికే అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. పింఛన్ల పంపిణీ సమయంలో ఎన్నికల నిబంధనలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘనకు గురికాకుండా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో పీడీ డీఆర్డీఏ–సెర్ప్ దాసరి రత్నకర్ రావు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి మాజీ ఎమ్మెల్యేల విస్తృత ప్రచారం

ప్రజా భూమి ప్రతినిధి–పోలవరం

పోలవరం జిల్లా తెలుగుదేశం కూటమి అభ్యర్థుల ప్రచారంలో సీనియర్ తెలుగుదేశం నాయకులు మాజీ శాసనసభ్యులు శాతంశెట్టి వెంకటేశ్వరరావు మరియు చెన్నం బాబు రమేష్ పాల్గొన్నారు క్షేత్రస్థాయిలో ప్రచారంలో పాల్గొని అభ్యర్థుల గెలుపుకు ముందుకు దూకడంతో తెలుగుదేశం పార్టీ శ్రేణుల లో కొత్త ఉత్సాహం నెలకొంది మూడుసార్లు ఎమ్మెల్యేగా చేసిన సీతంశెట్టి వెంకటేశ్వరరావు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడంతో పోటీ చేసిన అభ్యర్థులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు మరోవైపు తెలుగుదేశం మాజీ ఎమ్మెల్యే చందన్ జోగారావు గారి కుమారుడు మాజీ ఎమ్మెల్యే చందం బాబు రమేష్ తనదైన శైలిలో ప్రచారంలో పాల్గొని పార్టీ కార్యకర్తలను ఉత్సాహపరుస్తున్నారు. వీరితోపాటు రంప ఎంపీటీసీ అభ్యర్థి పొడియం సీతామహాలక్ష్మి తెలుగుదేశం పార్టీ ఐ. పోలవరం గ్రామం లో ఇంటింటి ప్రచారం లో పాల్గొన్న కూటమి నాయకులు సీతపల్లి గుడి చైర్మన్ కుంజం బాపన్న దొర, మాజీ ఎంపీటీసీ కంగల మనోహర్, మాజీ సర్పంచ్ చవలం బాపన్న దొర,కుంజం రామకృష్ణ దొర, కొమరం రాము, కంగల అబ్బాయి దొర మరియు గ్రామ ప్రజలు అధిక పాల్గొనడం జరిగింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్రాభివృద్ధి

మోదీ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు

బీజేపీ అభ్యర్థిని రమాదేవిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి: విక్కుర్తి

ప్రజా భూమి ప్రతినిధి–నాగాయలంక

నాగాయలంక మండలంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు బలపరిచిన బీజేపీ జెడ్పీటీసీ అభ్యర్థిని భోగాది రమాదేవి విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం నాగాయలంకలో నిర్వహించిన పరిచయ కార్యక్రమంలో అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో ఏకైక బీజేపీ జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న భోగాది రమాదేవిని కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ ప్రత్యేక సహకారం అందిస్తున్నారని తెలిపారు.గుల్లలమోదలో ఏర్పాటు చేస్తున్న డీఆర్డీఓ ప్రాజెక్టుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక శ్రద్ధ చూపించారని, ఈ ప్రాజెక్టు ప్రాంత అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత కలిగినదని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు.కూటమి ఐక్యతను చాటుతూ భోగాది రమాదేవిని భారీ మెజారిటీతో గెలిపించి నాగాయలంక మండల అభివృద్ధికి బాటలు వేయాలని విక్కుర్తి శ్రీనివాసరావు కోరారు.

భీమవరం గ్రామంలో

క్షేత్రస్థాయి పర్యటన - ప్రజలతో మాట్లాడి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్న జిల్లా కలెక్టర్

అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటించి, అందుతున్న సేవలను పరిశీలించిన కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి–రంపచోడవరం

పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ శుక్రవారం ఉదయం రంపచోడవరం మండలంలోని భీమవరం గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, గ్రామంలో నెలకొన్న పరిస్థితులు, ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న సేవలపై వారి అభిప్రాయలను తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అంశాలపై అధికారులతో చర్చించారు.అనంతరం గ్రామ పరిధిలోని కాలువను పరిశీలించి, అక్కడ కల్వర్టు నిర్మాణానికి సంబంధించిన అంశాలను సమీక్షించారు. అకాల వర్షాలు, ప్రకృతి విపత్తుల సమయంలో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడకుండా, గ్రామాలకు రాకపోకలు నిలిచిపోకుండా ముందస్తు మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని సూచించారు. వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టి, అత్యవసర సమయాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా కల్వర్టు నిర్మాణ పనులను చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని VB-G-RAM-G సిబ్బందికి కలెక్టర్ సూచించారు.తాళ్లపాలెం గ్రామంలో పర్యటించిన పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి, గ్రామంలో నెలకొన్న సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులు వెల్లడించిన సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారంపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.అనంతరం భీమవరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించారు. వారి ఆరోగ్యం, పోషకాహారం, ప్రీ–స్కూల్ విద్య, ఆటపాటలు, అభ్యసన కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. చిన్నారుల ఎదుగుదల, ఆరోగ్య పరిరక్షణకు పోషకాహారం తో పాటు నాణ్యమైన ప్రాథమిక విద్య, ఆహ్లాద కరమైన అభ్యసన వాతావరణం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, వారికి అందించే సేవల్లో నాణ్యతను నిరంతరం కొనసాగించాలని సిబ్బందికి సూచించారు.ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

అర్నబ్ తుఫానుని సమర్థవంతంగా ఎదుర్కొందాం

అన్ని శాఖల సిబ్బందికి అభినందనలు జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి–రంపచోడవరం

అర్నబ్ తుఫాను వలన ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ఎక్కడికక్కడ అధికార యంత్రాంగాన్ని ఉపయోగించడం జరిగిందని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ పేర్కొన్నారు.శుక్రవారం రాత్రి స్థానిక జిల్లా కలెక్టర్ వారి ఛాంబర్ లో పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్, పోలవరం జిల్లా పోలీస్ సూపరెంటెంట్ కె.చక్రవర్తి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ అర్నబ్ తుఫాను వలన పోలవరం జిల్లాలో అధికార యంత్రాంగం ఎక్కడికక్కడ సహాయక కార్యక్రమాలు ఏర్పాట్లపై పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలో అర్నబ్ తుఫా న్ వలన మన జిల్లాలో సుమారు 100 ఎం ఎంఎల్ వర్షపాతం నమోదయిందని ఆయన తెలిపారు. అర్నబ్ తుఫాను ఎదుర్కొనే విధంగా ఎక్కడకక్కడ ముందస్తు సహాయ చర్యలు సి ద్ధం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ తుపాను కారణంగా పోలవరం జిల్లాలో కంట్రోల్ రూమ్‌లో ఎక్కడకక్కడ ఏర్పాటు చేయడం జరిగిందని అదేవిధంగా జిల్లా యంత్రాంగం అంతా 24x7 విధులు నిర్వహించి సహాయక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. పోలవరం జిల్లాలో కరెంటు స్తంభాలు విరిగిపోయిన వాటిని ఎక్కడికి అక్కడ వెంట వెంటనే కరెంటు పునరుద్ధరణ పనులు ఏర్పాటు చేయడం జరిగిందని అదేవిధంగా తుఫాను ప్రభావం వల్ల రోడ్లపై విరిగిపోయిన చెట్లను రాకపోకలకు అంతరాయం లేకుండా ఎక్కడికక్కడ చెట్లను తొలగించే సహాయ సహకారాలు ఏర్పాటు చేసి రాకపోకలకు అంతరాయం లేకుండా ప్రత్యేక టీంల ద్వారా పునరుద్ధరణ పనులు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ తుపాను కారణంగా పోలవరం జిల్లాలో గర్భిణీ స్త్రీలను గుర్తించి ఎక్కడికక్కడ గర్భిణీ స్త్రీలను వైద్య సేవల కొరకు ప్రత్యేక వైద్య సేవలు అందించే విధంగా సంబంధిత ఆసుపత్రులలో జాయిన్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. పోలవరం జిల్లాలోని వివిధ శాఖల సమన్వయంతో తుఫాన్ ని ఎదుర్కొని జిల్లాలో ఎటువంటి ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా అందరి సహాయ సహకారాలతో అదేవిధంగా పాత్రికేయుల సహాయ సహకారాలతో తుపాను ఎదురుకోవడం జరిగిందని అదేవిధంగా అందరికీ జిల్లా యంత్రాంగం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నానని కలెక్టర్ తెలిపారు.

ప్రజల సహకారంతో అర్నబ్ తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొన్నాం

- రోడ్లపై చెట్లు పడిన వెంటనే తొలగింపు.. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు
- ప్రజల భద్రతే లక్ష్యంగా ఘాట్ రోడ్లు, వాగుల వద్ద పోలీసు బందోబస్తు
- పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి

ప్రజా భూమి ప్రతినిధి–రంపచోడవరం

అర్నబ్ తుఫాను ప్రభావాన్ని పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, విద్యుత్ తదితర శాఖల సమన్వయంతో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి తెలిపారు. ప్రజల సహకారం, వివిధ శాఖల అధికారుల సమష్టి కృషి వల్ల జిల్లాలో ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా తుఫాను పరిస్థితులను అధిగమించగలిగామని పేర్కొన్నారు.తుఫాను కదలికలు, వర్షపాతం, ప్రభావ తీవ్రతపై ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారని తెలిపారు. రాష్ట్ర డీజీపీ కూడా నిరంతరం టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ జిల్లాల పరిస్థితులను సమీక్షించారని, అవసరమైన పోలీసు బలగాలు, ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సహాయం తదితర అంశాలపై మార్గనిర్దేశం చేశారని వివరించారు.

చెట్లు పడిన వెంటనే తొలగింపు.. ప్రమాదాల నివారణకు చర్యలు

తుఫానుల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడటం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఈ నేపథ్యంలో రోడ్లపై చెట్లు పడిన వెంటనే ఆర్ అండ్ బీ, సంబంధిత శాఖల సిబ్బంది స్పందించి తొలగింపు చర్యలు చేపట్టారని చెప్పారు. సమాచారం అందిన కొద్దిసేపటికే అధికారులు సంఘటనా స్థలాలకు చేరుకునే లోపే చాలా ప్రాంతాల్లో రహదారులపై పడిన చెట్లను తొలగించారని, తాను క్షేత్రస్థాయికి చేరుకునే సమయానికి సుమారు 70 నుంచి 80 శాతం రహదారుల క్లియరెన్స్ పూర్తయి ఉండేదని పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందిన వెంటనే ప్రత్యేక బృందాలు స్పందించడం వల్ల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడగలిగామని తెలిపారు. తుఫాను సమయంలో ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు శాఖ ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిందని ఎస్పీ తెలిపారు. ప్రమాదకరమైన ఘాట్ రోడ్లలో ప్రయాణాలు చేయవద్దని సూచించినప్పుడు ప్రజలు సహకరించారని, భారీ వాహనాలను అవసరమైన ప్రాంతాల్లో నిలిపివేసినా ఎలాంటి ఇబ్బందులు సృష్టించకుండా పోలీసుల సూచనలు పాటించారని వివరించారు.పోలవరం జిల్లాలో వాగులు, వంకలు అధికంగా ఉన్నందున వర్షాల సమయంలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగి రహదారులపైకి వస్తుందని తెలిపారు. అలవాటైన మార్గాలే కదా అనే నిర్లక్ష్యంతో ప్రవాహాన్ని దాటేందుకు ప్రయత్నిస్తే నీటి ఉధృతికి కొట్టుకుపోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు వాగులు, వంకలు, రహదారులు తెగిపోయిన ప్రాంతాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజల రాకపోకలను నియంత్రించామని తెలిపారు. అధికారులు సూచించిన భద్రతా చర్యలకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించడం వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడగలిగామని పేర్కొన్నారు.అన్ని శాఖల సమన్వయం, పోలీసు సిబ్బంది అప్రమత్తత, ప్రజల సహకారం వల్ల అర్నబ్ తుఫాను ప్రభావాన్ని సమర్థవం తంగా ఎదుర్కోగలిగామని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు, పాత్రికేయ మిత్రులకు పోలీసు శాఖ తరఫున పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

అర్ణబ్ తుఫాను ప్రభావాన్ని తట్టుకుని నిలిచిన ప్రకృతి వ్యవసాయ వరి పంట

- రసాయన వ్యవసాయంతో పోలిస్తే ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో మెరుగైన పంట ఎదుగుదల
- ఒకే రకం, ఒకే రోజు నాటిన వరి పంటలను పరిశీలించి తులనాత్మకంగా విశ్లేషించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ
- కాటూరు గ్రామంలో తుఫాను ప్రభావిత వరి పంట క్షేత్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలన

ప్రజా భూమి ప్రతినిధి–ఉయ్యూరు

కృష్ణా జిల్లా, ఉయ్యూరు మండలం, కాటూరు గ్రామంలో అర్ణబ్ తుఫాను ప్రభావానికి గురైన వరి పంటలను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ డి.కె. బాలాజీ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఒకే రకమైన ఎంటియు–1318 వరి పంటను, ఒకే సమయంలో నాటిన రెండు వేర్వేరు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, రసాయన వ్యవసాయ పద్ధతులు మరియు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసిన పంటల స్థితిగతులను స్వయంగా పరిశీలించి తులనాత్మకంగా విశ్లేషించారు.ఈ పర్యటనలో భాగంగా రసాయన వ్యవసాయ పద్ధతిలో నాలుగు ఎకరాల్లో ఎంటియు–1318 వరి సాగు చేసిన రైతు శ్రీ తుమ్మూరు సంజీవరెడ్డి క్షేత్రాన్ని, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పది ఎకరాల్లో అదే రకం వరి సాగు చేసిన రైతు శ్రీ గుజ్జుల నాగరాజు క్షేత్రాన్ని కలెక్టర్ సందర్శించారు. రెండు క్షేత్రాల్లోనూ ఒకే రకం విత్తనాలు, ఒకే సమయంలో నాట్లు వేసిన నేపథ్యంలో తుఫాను ప్రభావం, పంట ఎదుగుదల, మొక్కల బలం తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు.

ప్రకృతి వ్యవసాయ పంటలో స్పష్టంగా కనిపించిన తేడా

అర్ణబ్ తుఫాను ప్రభావంతో రసాయన వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి పొలంలో మొక్కలు గణనీయంగా నేలకొరిగి ఉండగా, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి పొలంలో మొక్కలు చాలావరకు నిలకడగా నిలిచి ఉండటాన్ని కలెక్టర్ గమనించారు. అనంతరం రెండు క్షేత్రాల్లోని వరి మొక్కలను పరిశీలించి, దుబ్బుకు వచ్చిన పిలకల సంఖ్య, ఈనిన కంకుల అభివృద్ధి, వేర్ల విస్తరణ, వేర్ల బలం, కంకుల్లోని గింజల సంఖ్య తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్వహించిన పరిశీలనలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో ఒక దుబ్బుకు సుమారు 32 పిలకలు ఉండగా, వేరు వ్యవస్థ చుట్టుకొలత 124 సెంటీమీటర్లుగా నమోదైంది. అదే రసాయన వ్యవసాయ క్షేత్రంలో ఒక దుబ్బుకు సుమారు 18 పిలకలు, వేరు వ్యవస్థ చుట్టుకొలత 65 సెంటీమీటర్లుగా నమోదైంది. ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో కంకుల అభివృద్ధి, గింజల సంఖ్య కూడా మెరుగ్గా ఉన్నట్లు పరిశీలనలో వెల్లడైంది.ఈ గణాంకాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, రెండు వ్యవసాయ పద్ధతుల మధ్య పంట ఎదుగుదల, వేర్ల వ్యవస్థ, మొక్కల స్థిరత్వంలో కనిపిస్తున్న వ్యత్యాసాలను వ్యవసాయ అధికారులతో చర్చించారు. ముఖ్యంగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంట నేలకొరిగిపోకుండా నిలదొక్కుకోవడంలో బలమైన వేరు వ్యవస్థ, మొక్కల ఆరోగ్యం ఎంతగానో దోహదపడతాయని ఈ క్షేత్ర పరిశీలన ద్వారా గుర్తించారు.

పిఎండిఎస్ విధానంతో ప్రకృతి వ్యవసాయంలో మెరుగైన ఫలితాలు

ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ రైతు శ్రీ గుజ్జుల నాగరాజు మాట్లాడుతూ, తాను గత రెండు సంవత్సరాలుగా తన పొలంలో పీఎండీఎస్ విధానాన్ని అనుసరిస్తూ విత్తనాలు విత్తుతున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం వల్ల పంట ఆరోగ్యం, నేల నాణ్యత, వేర్ల అభివృద్ధి మెరుగుపడటంతో పాటు ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం పెరుగుతున్నట్లు తన అనుభవాలను వివరించారు.

అధిక మోతాదులో రసాయన ఎరువులు, ఇతర రసాయనాల వినియోగంతో సాగు చేసిన క్షేత్రంతో పోలిస్తే, గ్రావీణా విధానంతో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న క్షేత్రంలో పంట ఎదుగుదల, వేర్ల విస్తరణ, పిలకల సంఖ్య, పంట నిలకడ వంటి అంశాల్లో మెరుగైన లక్షణాలు కనిపించాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అయితే తుది దిగుబడి, ఆర్థిక ప్రయోజనాలను పంట కోత అనంతరం సమగ్రంగా అంచనా వేయాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు పంటల సహజ నిరోధక శక్తిని పెంపొందించుకునే అవకాశాలను రైతులు పరిశీలించాలని సూచించారు. అర్ణబ్ తుఫాను వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పంట నిలకడగా ఉండటం, పంట ఎదుగుదలలో కనిపించిన వ్యత్యాసాలు పరిశీలించదగిన అంశాలని పేర్కొన్నారు.

రసాయన వ్యవసాయం చేస్తున్న రైతులు కూడా ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, అక్కడ అనుసరిస్తున్న సాగు పద్ధతులు, వాటి ఫలితాలను స్వయంగా పరిశీలించాలని సూచించారు. రైతులు తమ అనుభవాలు, క్షేత్రస్థాయి పరిశీలనల ఆధారంగా రాబోయే పంట కాలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను క్రమంగా అవలంబించే దిశగా ముందుకు రావాలని తెలిపారు.వ్యవసాయ శాఖ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, మార్గదర్శకాలు అందిస్తూ ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జ్యోతి రమణి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె. పార్థసారథి, ఏడీఏ సునీల్, గ్రామ వ్యవసాయ సహాయకులు , ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.